

సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 307
శనివారం 20-7-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చల్లని రాజా.. ఓ చందమామా

నేడు ఇంటర్నేషనల్ మూన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం - 11లో



మన మహిళలదే పైచేయి

ఆసియా కప్ టోర్నీ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై భారత్ విజయం - 13లో



పూజా ఖేడ్కర్‌పై డిబార్ వేటు!

'నిబంధనల' మేరకు ఎందుకు డిబార్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఐఏఎస్ పూజాకు యూపీఎస్సీ షోకాజ్ జారీ చేసింది.


వివరాలు 6లో ▸



పాక్‌లో లాడెన్ సన్నిహితుడి అరెస్ట్

ఒసామా బిన్ లాడెన్‌కు సన్నిహితుడిగా భావిస్తున్న అమీనుల్ హక్‌ను పాక్ ఉగ్రవాద వ్యతిరేక విభాగం అరెస్ట్ చేసింది.

వివరాలు 6లో ▸



'బిల్కిస్ బానో' దోషులకు చుక్కెదురు

బిల్కిస్ బానో రేప్ కేసులో శిక్ష తగ్గింపును సవాల్ చేస్తూ దోషులు వేసిన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.

వివరాలు 6లో ▸



చల్లారని ఉద్రిక్తతలు

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఆందోళనల్లో మృతుల సంఖ్య 64కి చేరింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున కుటుంబసభ్యులతో కలసి ఆమె అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆమెకు రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనాన్ని, అధికారులు ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

వివరాలు 5లో ▸

15 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



ఏవోబీ ప్రాంతంలోని ఏజెన్సీల నుంచి సేకరించిన గంజాయిని విజయవాడ, పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తోన్న 15 మందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం అరెస్ట్ చేసింది. నిందితుల నుంచి 90.5 కిలోల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకుంది.

వివరాలు 14లో ▸

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ.. ఉధృతంగా గోదావరి



గోదావరిలో వరద ఉధృతి శుక్రవారం మరింత పెరిగింది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 7 అడుగులకు చేరింది. జూరాలలో విద్యుత్ కేంద్రం, ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్న వరద ప్రవాహం శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకోనుంది.

వివరాలు 10లో ▸



• రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది..

రాష్ట్రపతి పాలన విధించాలి

రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రికి ఆధారాలతో నివేదిస్తాం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో 24న ఢిల్లీలో ధర్నా

- ఏపీలో పరిస్థితిని యావత్ దేశానికి తెలిసేలా చేస్తాం.. రాష్ట్రంలో 45 రోజులుగా పూర్తిగా క్షీణించిన శాంతి భద్రతలు
- అసెంబ్లీ వేదికగా గవర్నర్ ప్రసంగం సమయంలో నిలదీస్తాం.. నెలన్నరలో 36 రాజకీయ హత్యలు.. 300కుపైగా హత్యాయత్నాలు
- టీడీపీ నేతల వేధింపులతో 35 మంది ఆత్మహత్య.. 560 ప్రైవేటు, 490 ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం
- ఇళ్లలోకి చొరబడి దాడులు.. విధ్వంసాలు
- వినుకొండలో సామాన్యుడైన రషీద్ దారుణ హత్య.. ఇంత జరుగుతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తున్న పోలీసులు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5.. దిగజారుడు రాతలు
- మా ప్రభుత్వంలో టీడీపీ వాళ్లను చంపండని, వారికి పథకాలు ఇవ్వద్దని చెప్పలేదు

2 లో



వినుకొండలో రషీద్ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

"గత 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయి. 300కుపైగా హత్యాయత్నాలు, టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇళ్లలోకి చొరబడి 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేశారు. షాపులను కాల్చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల చీనీ చెట్లు నరికేస్తున్నారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేశారు. ఇంతటితో ఆగకుండా వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పడానికి ఇంత కంటే నిదర్శనం అవసరమా?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



రషీద్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అండగా ఉంటాం

- దోషులకు శిక్ష పడేలా చేద్దాం
- ఏ కష్టం వచ్చినా వెంట ఉంటాం
- ఈ ప్రభుత్వంలో మంచి చేసే పరిస్థితి లేదు
- రషీద్ కుటుంబ సభ్యులకు జగన్ భరోసా

2 లో

జగన్ భద్రతపై సర్కారు నిర్లక్ష్యం

- రిపేర్‌లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయింపు
- దారిలో పలుమార్లు మొరాయించిన వాహనం
- పనిచేయని ఏసీ.. డోర్ తీయడానికి కూడా వీల్లేక ఇబ్బంది
- వేరే వాహనంలోకి మారి వినుకొండ చేరుకున్న వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు

3 లో

ముంచిన వాన

రాష్ట్రమంతా విస్తృతంగా వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వేలాది ఎకరాల్లో పంట నీటమునక
- పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు
- జలదిగ్బంధంలో ఏజెన్సీ గ్రామాలు
- ఏలూరు జిల్లాలో 29 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కొట్టుకుపోయిన వందలాది ఇళ్లు.. నిరాశ్రయులైన ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వం.. పునరావాస కేంద్రాలు నిల్

10 లో



తూర్పు గోదావరి జిల్లా సింగవరం-కంసాలిపాలెం రోడ్డుపై ప్రవహిస్తున్న ఎర్రకాలువ నీరు

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

నేడు ఒడిశాలోని పూరీ సమీపంలో వాయుగుండం తీరం దాటే అవకాశం

10 లో

బగ్ దెబ్బకు 'విండోస్' క్లోజ్!

విశ్వవ్యాప్తంగా స్తంభించిన మైక్రోసాఫ్ట్ సేవలు

విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థల సేవల్లో తీవ్ర అంతరాయం

ఇబ్బందులు పడ్డ కోట్లాది మంది యూజర్లు, ప్రయాణికులు


'క్రౌడ్‌స్ట్రయిక్'అప్‌డేట్ వల్లే ఇదంతా: మైక్రోసాఫ్ట్ వివరణ

భారత్‌లో కనపడని ప్రభావం

6 లో



ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడండి



పూర్తి అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్లు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

భారీ వర్షాలు, వరదలపై సమీక్ష

10 లో

22 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో కాలయాపన
- హామీలకు కేటాయింపులు చేయకుండా తప్పించుకునేందుకే
- అసెంబ్లీలోనే ఎక్సైజ్, ఆర్థిక, శాంతి భద్రతలపై శ్వేతపత్రాలు

5 లో

కంప్యూటర్ సైన్స్ ఫస్ట్

ఆ తర్వాత స్థానంలో ఈసీఈ

ఇంజనీరింగ్‌లో ఈ రెండు కోర్సులకే విద్యార్థుల ప్రాధాన్యం

రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్లు 1,36,660.. తొలి విడతలో సీఎస్‌ఈలో 40,242 సీట్ల భర్తీ

14లో





531, 32వ క్రాస్, 11వ మెయిన్ రోడ్, 4వ బ్లాక్, జయనగర్ ✆ 41539900
93/1, వర్తూర్ రోడ్, తులసీ థియేటర్ దగ్గర, మారతహళ్లి ✆ 25400009
హోటల్ రామేశ్వరి కాంప్లెక్స్, (SRR థియేటర్ ఎదురుగా), కాలమ్మ వీధి, బళ్లారి ✆ 08392-271600.



Available at all leading retail outlets: Bangalore: Jayanagar: Arvind - 9448988092, Devi International - 9916944265, Kitchen Mart - 8861929966, Chikpet: Jain Wire Emporium - 9980037182, Paramjyothi Ele - 8310334850, Pagariya Ent - 9535378544, Shiva Elect - 9743066660, Ashok Combines - 802226659, Paras Appliances - 9739363600, V V Puram: Griha Vaibhav - 9341259423, Electronic City: Baron Ele - 9242204839, KR Puram: SRM Ele - 9845445748, Pooja Electronics - 9353432376, Hanumanthanagar: Meenakshi Electricals - 9844798577, Pankaj Electronics, Peenya: Ace Comm - 9743335557, Sunkadakatte: Kundan Electroniks - 9448040338, Rajaji Nagar: R S Mart - 9900958652, Prakash Elec - 9845949116, Dasarahalli: Pawan Distributors - 9980650890, Nagarabhavi: Crystal Inc. - 9972068924, Hot Touch Home Appl - 9900265745, Chandra Layout: Pavan Kitchen World - 8618028319, Yeshwantpura: Mbhawarlals - 7411296609, Malleshwaram: Devdarshan Home Appl - 8971717182, Tumkur: Darshan Home Appl - 9880360124, Jaya Ganga Home - 8050759981, Bilekahalli: Shree Pooja Home Appl - 8088380133, Bommanahalli: Atchaya Electronics - 8095585500, HRBR Layout: Bhavani Home Appl - 9036438263, Sampurna Ent - 7022973015, Hormavu: Mamatha Home Apl - 8880050050.

అండగా ఉంటాం

దోషులకు శిక్ష పడేలా చేద్దాం.. ఏ కష్టం వచ్చినా వెంట ఉంటాం

రషీద్ కుటుంబ సభ్యులకు వైఎస్ జగన్ భరోసా



రషీద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మీ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రషీద్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. రెండు రోజుల క్రితం తెలుగుదేశం గూండాల చేతిలో రషీద్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం వినుకొండకు రోడ్డు మార్గంలో వచ్చిన ఆయన సాయంత్రం ఐదున్నర గంటలకు రషీద్ నివాసానికి చేరుకున్నారు. రషీద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రషీద్ సోదరుడు ఖాదర్.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హత్య జరిగిన తీరును సెల్‌ఫోన్‌లో చూపించి వివరించారు. తన సోదరుడు వైఎస్సార్‌సీపీలో పని చేస్తున్నాడని కక్షతోనే హత్య చేయించారని, ఈ హత్య వెనుక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఉన్నారని చెప్పారు. రషీద్ తల్లి బడేబీ మాట్లాడుతూ.. తన కుమారుడు తన పనేంటో తాను చూసుకునే వాడని, ఎలాంటి గొడవలకు వెళ్లడన్నారు. ఎమ్మెల్యే మనుషులు తన కొడుకును టార్గెట్ చేసి హత్య చేయించారని కన్నీళ్ల పర్యంతమయ్యారు. జిలానీ.. రషీద్‌ను అన్నా అని పిలుస్తుంటాడని, కేవలం రాజకీయ కక్షతోనే నరికి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. మద్యం షాపులో సూపర్‌వైజర్‌గా చేస్తున్న తన తమ్ముడు ఎనిమిది గంటలకు షాపు క్లోజ్ చేస్తాడని, ఆ సమయంలో నిందితుడు వెనుక నుంచి వచ్చి హత్య చేశాడని ఖాదర్ వివరించాడు. దీనిపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ 'చంపుకునేంత కక్షలు లేవు.. ఎందుకలా జరిగింది.. రాష్ట్రమంతా అతలాకుతలంగా మారింది.. పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు.. మన ఊళ్లల్లో మనం ఉండేందుకు కూడా వీలు లేకుండా పోయింది. మన ఎమ్మెల్యేలపై కూడా రాళ్లు వేయించిన పరిస్థితి. ఇదంతా ఎందుకు వచ్చిందంటే.. మన కన్నా ఎక్కువ చేస్తామని చెప్పి, నాలుగింతలు ఎక్కువ మేలు చేస్తామని చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చారు. అమ్మ ఒడి ఇస్తానన్నాడు. అమ్మ ఒడి పడిందా.. మోసం చేశారు. రైతు భరోసా, సున్నా వడ్డీ.. ఇవన్నీ పడలేదు. తప్పు చేయకపోయినప్పటికీ తప్పు చేసినట్లు చూపిస్తారు.. రషీద్ హత్యకు సంబంధించి దోషులకు తప్పకుండా శిక్ష పడేలా చేద్దాం. మీకు ఎలాంటి కష్టం వచ్చినా, మిమ్మల్ని ఎవరు ఇబ్బంది పెట్టించినా నేరుగా హైకోర్టులో కేసు వేసి, అన్ని రకాలుగా అండగా ఉంటాం. న్యాయం జరిగేలా చూస్తాం. మీకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటాం. చేస్తే మంచి చేయాలి. ఈ ప్రభుత్వంలో మంచి చేసే పరిస్థితి లేదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా మీ వెంట నేనుంటాను' అని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ పర్యటనలో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కోన రఘుపతి, అన్నాబత్తుని శివకుమార్, కాసు మహేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు బలసాని కిరణ్‌కుమార్, షేక్ నూరీఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రమేయంతోనే రషీద్ హత్య

- పోలీసుల తీరుపై మండిపడుతున్న కుటుంబ సభ్యులు



మీడియాతో మాట్లాడుతున్న రషీద్ కుటుంబ సభ్యులు

సాక్షి, గుంటూరు : వ్యక్తిగత కక్షల వల్లే రషీద్ హత్య జరిగిందని పోలీసులు చెబుతుండటంపై మృతుడి కుటుంబ సభ్యులు మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే పక్కా పథకం ప్రకారం తమ కుమారుడిని స్థానిక నాయకుల ప్రోద్బలంతో హత్య చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చే ముందు రషీద్ తల్లిదండ్రులు బడేబీ, పరేషాలు మీడియాతో మాట్లాడారు. హత్యలో రాజకీయ కోణం లేకపోతే గతంలోనే హత్య చేయాలి కదా.. అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే హత్య జరగడం రాజకీయం కాక మరేంటని నిలదీశారు. తమ కుమారుడిని అన్యాయంగా పొట్టన బెట్టుకున్నారని వాపోయారు.

రాష్ట్రపతి పాలన విధించాలి

- రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోం మంత్రికి ఆధారాలతో నివేదిస్తాం..
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. గత 45 రోజులుగా శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఏ సామాన్యుడిని కదిలించినా ఇదే ఆవేదన వ్యక్తం అవుతోంది. టీడీపీ నాయకులు ఎవరినైనా కొట్టొచ్చు.. ఎవరి ఆస్తులనైనా ధ్వంసం చేయొచ్చు.. హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడొచ్చనే రీతిలో పాలన నడుస్తోంది. అరాచకాలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితిలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాష్ట్రపతి పాలన విధించాలి. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోం మంత్రిని కలిసి అన్ని ఆధారాలను నివేదిస్తాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ దిగజారుడు రాజకీయాలపై కచ్చితంగా తమ పార్టీ నిరసన గళాన్ని వినిపిస్తుందన్నారు. 24వ తేదీన (బుధవారం) తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి రాష్ట్రంలోని పరిస్థితులు యావత్తు దేశానికి తెలిసేలా ఢిల్లీలో ధర్నా చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దురాగతాలను రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లేందుకు వారి అపాయింట్‌మెంట్ కోరామన్నారు. ఏపీలో రాష్ట్రపతి పాలనను విధించాల్సిన అవసరాన్ని ఆధారాలతో సహా నివేదిస్తామని చెప్పారు. అసెంబ్లీలో ఉభయ సభల వేదికగా గవర్నర్ ప్రసంగం సమయంలో ఆటవిక పాలనపై ప్రశ్నిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని అమలు చేయకుండా దౌర్జన్యాలతో తెలుగుదేశం పార్టీ భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



వినుకొండలో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్



నరసరావుపేటలో వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

మీడియా ముసుగులో దిగజారుడు తనం

రాష్ట్రంలో దారుణాలు జరుగుతుంటే పోలీసు వ్యవస్థ టీడీపీకే కొమ్ముకాస్తోంది. వీరితో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంటి సంస్థలు మీడియా ముసుగులో దిగజారిపోయి ప్రవర్తిస్తున్నాయి. రషీద్ హత్య ఉదంతాన్ని తప్పుదోవ పట్టించేలా చేస్తున్న దుష్ప్రచారానికి సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది. జిలానీకి చెందిన మోటార్ బైక్‌కు వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తులు నిప్పుపెట్టడంతోనే ఇప్పుడు ఈ హత్యకు పాల్పడినట్టు అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు. వాస్తవానికి మోటార్ బైక్ జిలానీది కాదు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఆసిఫ్ అనే వ్యక్తిది. ఆ బైక్‌ను టీడీపీకి చెందిన మాజీ చైర్మన్ షామీమ్, టీడీపీ స్టేట్ సెక్రటరీ ఆయూబ్ ఖాన్, మరికొంత మంది టీడీపీ నాయకులు తగలబెట్టి, ఆసిఫ్‌ను తీవ్రంగా గాయపరిచారు. దీనిపై ఈ ఏడాది జనవరి 17నే పోలీసులు కేసు నమోదు చేశారు.10/2024తో క్రైమ్ నంబర్ కూడా నమోదైంది. అయితే ఇదంతా జరగలేదన్నట్టు ఎల్లో మీడియా సృష్టించి, పోలీసులు కేసు కూడా పెట్టలేదని చెబుతోంది. వాస్తవాలను వక్రీకరించారు. కొత్తగా వచ్చిన ఎస్పీ ఘటన జరిగిన గంటల్లోనే బయటకు వచ్చి వ్యక్తిగత కక్షలతో జరిగిందంటూ తప్పుడు మాటలు మాట్లాడుతూ, అబద్ధాలు చెబుతున్నారు.

పోలీసుల ప్రేక్షక పాత్ర..

రాష్ట్రంలో దారుణమైన ఆటవిక చర్యలను అరికట్టాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. చివరికి టీడీపీ నాయకుల దాడుల్లో బాధితులైన వ్యక్తులు పోలీసుల వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటుంటే తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించే పరిస్థితి దాపురించింది. ఇలాంటి నీచ సంస్కృతి రాష్ట్రంలో రాజ్యమేలుతుండటం సిగ్గుచేటు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి వినుకొండలో రషీద్ దారుణ హత్య పెద్ద ఉదాహరణ. గతంలో పల్నాడు జిల్లాలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించే అధికారి రవిశంకర్ ఎస్పీగా ఉంటే తెలుగుదేశం నాయకులు తమ పలుకుబడితో ఆయన్ను తప్పించేశారు. అనంతరం వారికి అనుకూలంగా పని చేసే బిందుమాధవ్‌ను ఎస్పీగా తెచ్చుకుని అరాచక పర్వానికి తెరలేపారు. బిందు మాధవ్ ఎన్నికల సమయంలో అత్యంత దారుణంగా వ్యవహరించడంతో ఎన్నికల కమిషన్ స్వయంగా సస్పెండ్ చేసింది. తర్వాత మరో మంచి అధికారి మలికా గార్గ్‌ను ఈసీ నియమిస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెను సైతం పంపించేశారు. చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు సహాయ సహకారాలు అందించరనే కారణంతో మలికా గార్గ్‌ను తప్పించారు. ఇప్పుడు టీడీపీకే మద్దతు పలికే శ్రీనివాస్ అనే వ్యక్తికి పల్నాడు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. కొత్త ఎస్పీ వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే అత్యంత పాశవికంగా నడిరోడ్డుపై, ప్రజలంతా చూస్తుండగానే కత్తులతో నరికి రషీద్‌ను దారుణంగా హత్య చేశారు. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీకి చెందిన సానుభూతి పరులను భయభ్రాంతులకు గురిచేసి, బెదిరించేందుకే అమాయకుడు, సాధారణ ఉద్యోగి అయిన రషీద్‌ను క్రూరంగా హత్య చేయడం దుర్మార్గం.

ఈ సంబంధాలేంటి?

రషీద్ హత్యపై పోలీసులు కేసు పెట్టామని అంటున్నారు. ఈ కేసు జిలాని అనే వ్యక్తి మీద మాత్రమే పెట్టారు. జిలానీకి.. టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో సత్సంబంధాలు ఉన్నాయి. ఎమ్మెల్యేతో ఫొటోలు దిగాడు. ఆయన భార్యకు కేక్‌లు తినిపించాడు. ఆ పార్టీ నాయకులు షమీమ్ ఖాన్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ క్రమంలో వారందరి పేర్లు ఎందుకు ఎఫ్ఐఆర్‌లో లేవు? ఇదేంటి మరి? (ఫొటో చూపుతూ) ఇందులో జిలానీ స్వయంగా ఇక్కడి ఎమ్మెల్యే భార్యకు కేక్ తినిపిస్తున్నాడు. లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా వారు కేక్ కట్ చేయడం.. ఆ కేక్‌ను ఈ జిలానీ స్వయంగా ఎమ్మెల్యే భార్యకు తినిపించడం క్లాదుటే కనిపిస్తోంది. అంటే వీళ్ల మధ్య సంబంధాలు ఎంత బలంగా ఉన్నాయో చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం కావాలా? (ఎమ్మెల్యేతో, ఆయూబ్‌ఖాన్, షమీమ్‌ఖాన్‌తో జిలానీ దిగిన ఫొటోలు చూపారు) మరి వీళ్లెవరూ కేసులో ఎందుకు లేరు? వారిపై కేసు ఎందుకు నమోదు చేయలేదు? ఇంతకన్నా అన్యాయం ఏమైనా ఉంటుందా? రషీద్‌ను ఫ్యాక్షన్ మూలాలున్న వ్యక్తిగా చిత్రీకరించడం దారుణం. ఆ కుటుంబం ఏం పాపం చేసిందని ఒక మనిషిని చంపారు? అంతటితో ఆగకుండా కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తులకు సానుభూతి తెలపకుండా తప్పుడు ప్రచారం చేయడం దారుణం. చంద్రబాబు క్షమాపణ చెప్పాలి. పోలీసులు ప్రేక్షక పాత్ర వీడాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం అవ్వవు అని ప్రజలకు విశ్వాసం కల్పించాలి.

ఎంపీలను తిరగనివ్వట్లేదు

ఎంపీ మిథున్ రెడ్డి తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పుంగనూరులో తిరగకూడదా? మా మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి వెళితే.. ఆ ఇంటిని దిగ్బంధం చేసి ఇంటి మీద రాళ్లు వేసి, రెడ్డెప్ప కారుకు నిప్పు పెట్టారు. ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయి. ఇంతకన్నా శాంతి భద్రతలు దిగజారిన పరిస్థితులు ఎక్కడైనా ఉంటాయా? చివరికి అమ్మాయిల మీద అత్యాచారాలు జరుగుతున్నా కూడా పోలీసులు పట్టించుకోవడం లేదు. చంద్రబాబే పట్టించుకోవద్దని చెప్పడంతో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. మా ప్రభుత్వంలో ఏ రోజు టీడీపీ వాళ్లను కొట్టండి, చంపండి, వారికి పథకాలు ఇవ్వద్దు అని చెప్పలేదు. ఏ అక్కచెల్లెమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లినా ఏదైనా ఆపద వస్తే మొబైల్ ఫోన్‌లో 'దిశ' యాప్ ద్వారా పోలీసులను సంప్రదిస్తే వెంటనే రక్షించే వ్యవస్థను తెచ్చాం.

రషీద్ తల్లిదండ్రులకు ఈ ప్రభుత్వం ఏం చెబుతుంది?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నెలన్నరలో 36 హత్యలు.. 300కు పైగా హత్యాయత్నాలు
- చంద్రబాబు ప్రభుత్వ అరాచకాలను దేశం దృష్టికి తీసుకెళ్తాం

సాక్షి, అమరావతి: 'పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీ కార్యకర్త చేతిలో క్రూరంగా హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించాను. రాజకీయ కక్షలతో తన కొడుకును పొట్టనబెట్టుకున్నారంటూ ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తోడుగా నిలవాల్సిన కొడుకు దారుణ హత్యకు గురికావడం వారిని మరింత కుంగదీసింది. ఆ తల్లిదండ్రుల ప్రశ్నలకు ఈ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. 'ఆటవిక పాలనకు బలైన ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుంది. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందనడానికి రషీద్ హత్యే ఒక ఉదాహరణ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయి. టీడీపీ వాళ్ల వేధింపులు భరించలేక 37 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి. రాష్ట్రంలో జరుగుతున్న ఈ పరిణామాలపై ఈ నెల 24న అంటే వచ్చే బుధవారం న్యూఢిల్లీలో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడతాం. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఈ 45 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న అరాచకాల గురించి దేశం అంతటికి తెలిసేలా చేస్తాం. ప్రధాన మంత్రి, హోం మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తాం. ఇందుకోసం వారి అపాయింట్‌మెంట్లు కూడా కోరాం' అని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వేర్వేరుగా పోస్టులు చేశారు.



వినుకొండలో కారులోంచే అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్





వినుకొండలో వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

తాడేపల్లి టు వినుకొండ.. ఏడున్నర గంటలు

- అశేష ప్రజాభిమానం మధ్య వైఎస్ జగన్ పర్యటన ఆలస్యం
- జోరు వానలోనూ తరగని జనాభిమానం
- దారి పొడవునా అభివాదం చేస్తూ ముందుకు సాగిన జననేత
- గ్రామాలకు గ్రామాలు తరలి వచ్చి ఘన స్వాగతం
- జగన్‌ను చూసేందుకు జన సముద్రమైన వినుకొండ



బస్సులోంచి వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి అమరావతి: వినుకొండ పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. తాడేపల్లి నుంచి వినుకొండకు 120 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి ఏడున్నర గంటలు పట్టిందంటే ప్రజల స్పందన ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. రెండు రోజుల కిందట హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న జగన్‌కు జనం పెద్ద ఎత్తున తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌పై టీడీపీ గూండా జిలానీ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. రెండు చేతులు తెగ నరికాడు. అనంతరం కత్తితో మెడ నరికి పాశవికంగా హత్య చేశాడు. ఈ విషయం తెలియగానే బెంగళూరులో ఉన్న వైఎస్ జగన్ హుటాహుటిన బెంగళూరు నుంచి బయలుదేరి తాడేపల్లికి గురువారం సాయంత్రానికి చేరుకున్నారు. రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరగానే పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నేతలు ఆయన్ను అనుసరించారు. దారి పొడవునా వేలాది మంది పలు కూడళ్ల వద్ద జగన్ కోసం వేచి చూశారు. ఎక్కడికక్కడ జగన్.. వాహనాన్ని ఆపి రెండు చేతులు పైకి ఎత్తి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ప్రతి చోటా వేలాది మంది మేము సైతం మీ వెంటే అంటూ చేతులెత్తి సంఘీభావం తెలిపారు. తాడేపల్లి నుంచి వినుకొండకు వెళ్లాలంటే సాధారణంగా రెండు.. రెండున్నర గంటలు పడుతుంది. కానీ వైఎస్ జగన్ ఉదయం పది గంటలకు బయలుదేరితే వినుకొండలోని రషీద్ ఇంటికి చేరుకునేసరికి సాయంత్రం ఐదున్నర గంటలు అయ్యింది.

అభిమాన జడి

తాడేపల్లి నుంచి వినుకొండ వరకు వర్షం పడుతూనే ఉన్నా, దారి పొడవునా అశేష జనవాహిని జగన్ వెంట కదలి వచ్చింది. కాజ టోల్ గేట్, పెదకాకాని వై.జంక్షన్‌లో పార్టీ సమన్వయకర్తలు అంబటి మురళీ కృష్ణ, షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, కార్యకర్తలు జగన్‌కు స్వాగతం తెలిపారు. కాన్వాయ్ వెంట ఉన్న పలు వాహనాలను పెదకాకాని వై.జంక్షన్ వద్ద బారికేడ్లు అడ్డుపెట్టి నిలిపి వేయడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 30 నిమిషాల తర్వాత వాహనాలను అనుమతించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యకర్తలు ఏటుకూరు వద్ద పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో అపూర్వ స్వాగతం లభించింది. 144 సెక్షన్ అమలులో ఉందంటూ పోలీసులు మైక్‌లో హెచ్చరికలు చేస్తున్నా వెరవక జనం వేలాదిగా తరలి వచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఎన్ఆర్‌టీ సెంటర్ వద్ద జై జగన్ నినాదాల హోరు నడుమ ఘన స్వాగతం పలికారు.

జగన్ కోసం జనం ఎదురుచూపులు

నరసరావుపేట నియోజకవర్గంలో జోరువానలోనూ జనం ఎదురు చూశారు. గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం పలికారు. బసికాపురం, ఎస్ఆర్‌కెటి జంక్షన్, ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా జగన్ కాన్వాయ్ బాపట్ల జిల్లా సంతమాగలూరు చేరుకుంది. సంతమాగలూరు అడ్డరోడ్డు వద్ద వేలాది మంది అద్దంకి నియోజకవర్గ కార్యకర్తలు స్వాగతం పలికారు. శావల్యాపురం నుంచి వినుకొండ వరకు జనం ప్రతిచోటా రోడ్లపైకి వచ్చారు. వినుకొండ పట్టణంలోకి వచ్చిన తర్వాత రషీద్ ఇంటికి వెళ్లడానికి గంటన్నర సమయానికి పైగా పట్టింది. వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి నుంచి రాజీవ్ రజక కాలనీ, నిర్మలా స్కూల్, డ్రైవర్స్ కాలనీ మీదుగా రషీద్ ఇంటి వరకు ఇసుకేస్తే రాలనంతగా జనం జగన్ కోసం వేచి ఉన్నారు. పలు చోట్ల యువకులు, మహిళలు జగన్ ప్రయాణిస్తున్న కారుకు అడ్డుగా నిలిచి బయటకు రావాలని పట్టుబట్టారు. జగన్ బయటకు వచ్చి వారితో కరచాలనం చేస్తూ ముందుకు సాగారు.

పట్టణంలోని బ్యాంక్ కాలనీ పార్టీ కార్యాలయం వద్ద గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు జగన్‌కు స్వాగతం పలికారు. చిలకలూరిపేట మండలం కావూరు, లింగంగుంట్ల గ్రామాల మధ్య ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి స్వాగతం పలికారు. కోమటినేని వారిపాలెం వద్ద, అమీన్‌సాహెబ్ పాలెం, బసికాపురం గ్రామాల మధ్య కనపర్రు, తదితర గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అభిమానం చాటుకున్నారు.

క్లుప్తంగా...

మిథున్‌రెడ్డిపై దాడి హేయం: ముద్రగడ



కిర్లంపూడి: ఎంపీ మిథున్‌రెడ్డిపై జరిగిన దాడి హేయమని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. పుంగనూరులో మిథున్‌రెడ్డిపై జరిగిన దాడిపై శుక్రవారం ఆయన స్పందించారు. అధికారం శాశ్వతం కాదని, ఎప్పుడు మీరే అధికారంలో ఉంటామనే భ్రమ వీడాలని హితవు పలికారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను ఆపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ముద్రగడ కోరారు.

సొంత జిల్లాలకు 'ఎన్నికల' తహసీల్దార్లు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు తిరిగి తమ సొంత జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్‌ఏకి (భూపరిపాలన ప్రధాన కమిషనర్) శుక్రవారం మెమో జారీ చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం సొంత జిల్లాల్లో పనిచేస్తున్న 656 మంది తహసీల్దార్లను పక్క జిల్లాలకు బదిలీ చేశారు. జూన్ 6న ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో తిరిగి వారిని సొంత జిల్లాలకు పంపడానికి అనుమతి ఇచ్చారు. సొంత జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను వారి సొంత రెవెన్యూ డివిజన్లలో నియమించకూడదని స్పష్టం చేశారు.

ప్రధానికి జగన్ లేఖ రాయడం విడ్డూరం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పరిస్థితులపై మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రధాని మోదీకి లేఖ రాయడం విడ్డూరంగా ఉందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఇలా లేఖ రాయడంపై జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన దారుణాలపై ఆ పార్టీ ఎప్పుడూ స్పందించలేదని 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు.

పోలీసుల నిర్లక్ష్యం వల్లే రషీద్ హత్య

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖురేషి



సాక్షి, అమరావతి: పోలీసుల నిర్లక్ష్యం వల్లే వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త అబ్దుల్ రషీద్ హత్య జరిగిందని, ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సదర్ ఉద్దీన్ ఖురేషి శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్యకు గురైతే ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఆంక్షల పేరుతో పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఆయనకు సరైన వాహనం కేటాయించకపోవడం ఆయన భద్రత పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో తేటతెల్లమవుతోందని పేర్కొన్నారు.

చంద్రబాబు బెయిలు రద్దు కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ పిటిషన్‌ను తర్వాత విచారిస్తామని ధర్మాసనం విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈకేసులో అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏపై ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి రిఫర్ చేసిన అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

ఇనుప ఖనిజం దోపిడీకి ప్లాన్

బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ధ్వజం

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెపం నెట్టి ప్రస్తుతం ఇనుప ఖనిజాన్ని దోపిడీ చేసేందుకు నాయకులు పెద్ద ఎత్తున ప్లాన్ చేస్తున్నారని అనంతపురం జిల్లా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీల్లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజాన్ని గత ఐదేళ్లలో దోపిడీ చేశారంటూ కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు ప్రచురించాయని తెలిపారు. అక్కడున్న ఖనిజాన్ని ఇప్పుడున్న నేతలు ఒకట్రెండు రోజుల్లో అక్రమంగా తరలించేందుకు ప్లాన్ చేస్తున్నారని, దీన్లోభాగంగానే తప్పుడు కథనాలు ప్రచురింపజేసి సీబీఐని సైతం అవమానించారన్నారు. ప్రస్తుతం చేస్తున్న ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గు తేల్చాలంటూ సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాస్తున్నట్లు ఆయన తెలిపారు.

జగన్ భద్రతపై సర్కారు నిర్లక్ష్యం



తాడేపల్లి మండలం కుంచనపల్లి హైవే వద్ద వైఎస్సార్‌సీపీ నేతల వాహనాలను అడ్డగించిన పోలీసులు

- 15 చోట్లకు పైగా కాన్వాయ్‌లో వాహనాల నిలిపివేత
- పోలీసుల తీరుపై అభిమానుల్లో ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ సాక్షి, అమరావతి/ గుంటూరు రూరల్/ తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతపై చంద్రబాబు సర్కార్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వినుకొండ పర్యటన నేపథ్యంలో గురువారం బెంగళూరు నుంచి ఇంటికి రాగానే ప్రభుత్వం వైఎస్ జగన్‌కు భద్రతను తగ్గించింది. ఆయనకు పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కేటాయించింది. ఇద్దరు గన్‌మెన్‌లను, ఒక ఇన్‌చార్జిని మాత్రమే నియమించారు. రిపేర్‌లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వడంతో మార్గంలో పలుమార్లు మొరాయించింది. అది బుల్లెట్ ప్రూఫ్ కావడంతో మొరాయించినప్పుడు డోర్ తీయడం కూడా వీలు కాలేదు. ఏసీ కూడా సరిగా పని చేయలేదు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని ఇంటి నుంచి జగన్ నిర్ణీత సమయానికే బయలుదేరారు. కొద్ది దూరం ప్రయాణించగానే వాహనంలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ముందుకు కదలక పోవటంతో మంగళగిరి వద్ద తెనాలి ఫ్లైఓవర్‌కు 50 మీటర్ల దూరంలో వైఎస్ జగన్ తాను ప్రయాణిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం నుంచి దిగి వెనుకనే వస్తున్న శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి వాహనంలోకి మారారు. దారిపొడవునా పలుచోట్ల పోలీసులు అడ్డంకులు సృష్టించారు. జగన్‌తో వెళ్తున్న వాహనాలను పదేపదే అడ్డుకున్నారు. తాడేపల్లి నుంచి వినుకొండ చేరేలోపు 15 చోట్ల కాన్వాయ్ వెనుక వస్తున్న వాహనాలను అడ్డుకుని నిలిపివేశారు. వైఎస్ జగన్ తన నివాసం నుంచి బయలుదేరగానే రెండు మూడు వాహనాలను అనుమతించి, మిగిలిన వాహనాలను ఆపేశారు. వెనుక వస్తున్న వాహనాలను అడ్డుకుంటున్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వేర్వేరు రహదారుల మీదుగా వినుకొండ చేరుకున్నారు. తాడేపల్లి పరిధిలోని జాతీయ రహదారి నుంచి మున్సిపాలిటీకి వచ్చే రహదారిలో, కాజా టోల్ గేటు, శంకర కంటి ఆసుపత్రి వద్ద, గుంటూరు ఆటోనగర్ వై. జంక్షన్ వద్ద ఇలా.. పలు చోట్ల పోలీసులు నేతల వాహనాలు అడ్డుకున్నారు. వైఎస్ జగన్ పర్యటనను కవర్ చేస్తున్న జర్నలిస్టులను కూడా పలుచోట్ల ఆపేసి ఇబ్బంది పెట్టారు. పోలీసుల తీరుపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే విధ్వంసకాండ

- అలవిగాని హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు
- ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు ఇస్తానని హామీ
- ప్రతి మహిళకూ నెలకు రూ.1,500.. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ
- అన్నదాతలకు రూ.20 వేల చొప్పున రైతు భరోసా సాయం
- మత్స్యకారులకు రూ.20 వేల చొప్పున మత్స్యకార భరోసా
- ఈ పథకాలన్నీ ఎప్పుడిస్తారని అడుగుతున్న జనం
- దిక్కుతోచకే అరాచకాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలకు ఊతం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు
- జగన్ సీఎంగా ఉండి ఉంటే ఇప్పటికే ఈ పథకాలన్నీ అమలు

సాక్షి, అమరావతి: అలవిగాని హామీలిచ్చి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు.. వాటిని అమలు చేయలేక వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే విధ్వంసాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలను ప్రోత్సహిస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయిస్తూ.. దిగజారిన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లా వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తప్పుడు వాగ్దానాలతో, ప్రజలను మోసం చేసి సీఎం అయ్యారన్నారు. 'గత ప్రభుత్వంలో ప్రతి త్రైమాసికానికీ విద్యా దీవెన అందించాం. జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన ఇంకా ఇవ్వలేదు. ఏప్రిల్, మే, జూన్ కూడా అయిపోయింది. రెండు త్రైమాసికాల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే జగన్ సీఎంగా ఉండి ఉంటే ఏప్రిల్‌లో వసతి దీవెన, రైతు భరోసా, అమ్మ ఒడి, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా డబ్బులు ఇప్పటికే వచ్చి ఉండేవి. ఈ రోజు ప్రతి అక్కచెల్లెమ్మ ఎదురు చూస్తోంది. 'పిల్లలను బడికి పంపితే జగన్ ఒక్కరికే అమ్మ ఒడి కింద రూ.15 వేలు చొప్పున ఇస్తాడు. అదే నేను అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలను బడికి పంపితే అంత మందికి అమ్మ ఒడి ఇస్తాం' అని చంద్రబాబు చెప్పారు. ఇంట్లో నలుగురు పిల్లలుంటే నలుగురికి రూ.15 చొప్పున రూ.60 వేలు ఇస్తాం అని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నికల్లో చెప్పినట్టు 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.1,500 ఇవ్వండని ఈ రోజు ప్రతి అక్కచెల్లెమ్మ అడుగుతోంది. ఈ రోజున రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రకారం 2.10 కోట్ల మందికిపైగా అక్కచెల్లెమ్మలు ఉన్నారు. ఇందులో పెన్షన్‌లు తీసుకుంటున్న వారిని పక్కన పెట్టినా 1.50 కోట్ల మంది మాకు రూ.1,500 ఎప్పుడిస్తావ్ అని నిలదీస్తున్నారు. ప్రతి పిల్లాడు అడుగుతున్నాడు. జగన్ మామ మా అమ్మకు రూ.15 వేలు ఇచ్చేవాడు.. మీరు తల్లికి వందనం ఇస్తాం అన్నారు. ఎప్పుడు ఇస్తారని అడుగుతున్నారు. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. 50 లక్షల మంది రైతన్నలు పెట్టుబడి సాయం ఏమైందంటున్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన సున్నా వడ్డీ డబ్బులు ఎందుకు ఇవ్వలేదని అక్కచెల్లెమ్మలు అడుగుతున్నారు. కాలేజీల్లో చదివిన పిల్లలకు సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదు. మత్స్యకార భరోసా రూ.20 వేల చొప్పున ఎప్పుడిస్తారని మత్స్యకారులు అడుగుతున్నారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే విధ్వంసం సృష్టిస్తున్నారు' అని మండిపడ్డారు.

గంజాయి మత్తులో బాలికలపై అఘాయిత్యాలు

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత



తిరుపతి(అలిపిరి)/తిరుమల: రాష్ట్రంలో గంజాయి మత్తులో బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని.. ఈ పరిణామాలు చూసి ప్రజలు భయాందోళనకు గురికావొద్దని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, బాలికలపై దాడులు చేస్తున్న వారిని వెంటనే పట్టుకుంటున్నట్టు తెలిపారు. తప్పుచేసిన వారిని కఠినంగా శిక్షిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీ నేతలు పాకులాడుతున్నారని, గత ప్రభుత్వం కారణంగానే చిన్నపిల్లల సంచుల్లోకి గంజాయి చేరుతోందని ఆరోపించారు. గంజాయిని రాష్ట్ర పంటగా పండించింది వైఎస్సార్ సీపీ నేతలేనని.. లిక్కర్ పైన పెట్టిన దృష్టి గంజాయిపై ఎందుకు పెట్టలేదన్నారు. పోలీసుల్ని కాపలాకు ఉపయోగించుకున్న గత ప్రభుత్వంలోనే వందలాది మంది బాలికలు కనిపించకుండా పోయారని ఆరోపణలు చేశారు. ఇదిలా ఉండగా, కాలినడక మార్గంలోనే శ్రీవారి దర్శనం టికెట్లు జారీచేయాలని హోం మంత్రి అనిత కోరారు. అలిపిరి కాలినడక మార్గాన నడుచుకుంటూ ఆమె తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. అదృశ్యమైన ఎంపీడీవో వెంకటరమణ ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని అనిత చెప్పారు.

సామాన్యుడి జీవితాన్ని మార్చేలా విజన్ ఉండాలి

- ఏఐ హబ్స్‌గా విశాఖ, అమరావతి
- రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు ఆలోచనతో ఉన్నాం
- నీతి ఆయోగ్ బృందానికి సీఎం చంద్రబాబు సూచన
- వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్‌పై చర్చ



సాక్షి, అమరావతి: మారుమూల గ్రామంలో ఉన్న సామాన్యుడి జీవితాన్ని కూడా మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 కోసం విజన్ డాక్యుమెంట్‌పై చర్చించేందుకు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనతో, టెక్నాలజీని ఉపయోగించుకుని పేదరికం లేని సమాజం సాధించేలా వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ 2047 సిద్ధం చేయాలని అన్నారు. జనాభా సమతుల్యతపై లోతైన కసరత్తు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. విశాఖ, అమరావతిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్స్‌గా రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల, కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలు రచించాలని, అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తే రైతులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన విద్యుత్ రంగంలో అనూహ్య మార్పులు వస్తాయని, వాటికి అనుగుణంగా వ్యవస్థలను, ప్రజలను సిద్ధం చేయాలని చెప్పారు. మానవ వనరుల నైపుణ్యం పెంచడానికి పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు సిలబస్ రూపొందించాలని చెప్పారు. కొత్త టెక్నాలజీని, అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉండాలని అన్నారు. సంపద సృష్టికి దోహదపడే పాలసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఐఐటీ, ఐఐఎం, ఐఎస్‌బీ వంటి సంస్థలు, మేధావులు, నిపుణులతో చర్చించి డాక్యుమెంట్ రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు

దాడులు చేసింది టీడీపీ మూకలు కేసులు మాత్రం ఎంపీ, మాజీ ఎంపీపై..

సాక్షి ప్రతినిధి, తిరుపతి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసింది. వీరితో పాటు మరో 71 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనా హత్యాయత్నం కింద అక్రమ కేసులు బనాయించింది. పుంగనూరులో గురువారం రెడ్డెప్ప నివాసానికి వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై టీడీపీ గూండాలు దాడికి యత్నించిన విషయం తెలిసిందే. అల్లరి మూకల విధ్వంస కాండపై ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు తాజాగా బాధితులపైనే కేసులు బనాయించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. సెంటు భూమి కూడా లేని ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రైతులపై దాడి చేశారంటూ కేసులు నమోదు చేయడం గమనార్హం.

మిథున్‌రెడ్డి భద్రత మరింత కుదింపు

విధ్వసకాండ అనంతరం అల్లరి మూకలు పథకం ప్రకారం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా టీడీపీ నేతలు పరామర్శ పేరుతో హడావుడి చేశారు. టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారంటూ ఘటన సమయంలో పట్టణంలో కూడా లేని 71 మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి పోలీసులు స్వామి భక్తి చాటుకున్నారు. మరోవైపు రెడ్డెప్ప నివాసంపై దాడికి సంబంధించి కేవలం ఎనిమిది మందిపై నామమాత్రంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో హత్యాయత్నం సెక్షన్ నమోదు చేయలేదు. ఎంపీ మిథున్ రెడ్డిపై వందల మంది గూండాలు దాడికి తెగబడితే ఆయన భద్రతను పెంచాల్సిన ప్రభుత్వం శుక్రవారం మరింత తగ్గించింది. ఎన్నికల ముందు వరకు ఆయనకు 4 + 4 భద్రత ఉండగా ఎన్నికల తరువాత ప్రభుత్వం 2+2 గన్‌మెన్‌లకు తగ్గించింది. తాజాగా 1+1కి కుదించటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

కార్యకర్తలకు అండగా ఉంటాం..



రాష్ట్రంలో టీడీపీ అరాచక పాలన సాగుతోంది. ఏపీని మరో బిహార్‌లా మార్చి లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. పుంగనూరులో ఎంపీ, మాజీ ఎంపీపై దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉన్నా ఏరోజూ ఇలాంటి నీచ రాజకీయాలు చూడలేదు. చంద్రబాబు పుంగనూరు నియోజకవర్గంపై కక్ష సాధిస్తున్నారు. పోరాటాలు మాకు కొత్త కాదు. ఎన్ని కష్టాలైనా ఎదుర్కొంటాం. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే

మీకు నేనున్నా..



అక్రమ కేసులు పెట్టారని కార్యకర్తలు అధైర్యపడొద్దు. నాపై నాన్ బెయిలబుల్ కేసులు బనాయించారు. టీడీపీ నేతలు మీ ఇళ్లు కూల్చేస్తే నేను కట్టిస్తా. మీ బైక్ ధ్వంసం చేస్తే నేను కొత్తది కొనిస్తా. మీపై కేసులు ఉంటే నేనే ఖర్చులు భరిస్తా. అందరికీ అండగా ఉంటా. మీకు ధైర్యం చెప్పేందుకే వచ్చా. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడితే చూస్తూ ఊరుకోను. ఎవరినీ వదిలి పెట్టను. పోలీసులు ఫిర్యాదును పట్టించుకోకుంటే ప్రైవేట్ కేసులు వేస్తాం. న్యాయ సహాయం కోసం లాయర్లను అందుబాటులో ఉంచా. రెడ్డెప్ప ఇంటిపై దాడి చేసి తిరిగి ఆయనపైనే హత్యాయత్నం కేసులు పెట్టడం దారుణం. నిన్న నాపై దాడి జరిగితే ఈరోజు భద్రత మరింత తగ్గించారు. చంద్రబాబులా దుర్మార్గ రాజకీయాలు మేం ఎప్పుడూ చేయలేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

45 రోజుల్లో 36 రాజకీయ హత్యలా?

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గడికోట ఫైర్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకు 45 రోజుల్లో ఏకంగా 36 రాజకీయ హత్యలు జరిగాయని చెప్పారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ అరాచకాన్ని చూసి దేశం మొత్తం ఆశ్చర్యపోతోందన్నారు. నారా పాలనలో ఇంకేన్ని హత్యలు చేస్తారో అని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. సామాన్యుల ప్రాణాలకు రక్షణ లేదనడానికి పల్నాడుజిల్లా వినుకొండలో నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ గూండా జిలానీ అత్యంత పాశవికంగా హత్య చేయడమే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలాయని, శాంతి భద్రతలు క్షీణించాయని, హత్యాయత్నాలు, హత్యలతో రాష్ట్రం అట్టుడికిపోతోందని అన్నారు. టీడీపీ నేతల వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితులు ఎమర్జెన్సీని తలపిస్తున్నాయన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని సొంత నియోజకవర్గంలోనే హత్య చేసేందుకు టీడీపీ గూండాలు బరితెగించారని అన్నారు. రాష్ట్రంలో కూటమి అరాచకాలపై ఈనెల 24న ఢిల్లీలో ధర్నా చేస్తామని చెప్పారు.

13 రోజులకు పరామర్శకు వస్తారా?

ముచ్చుమర్రి ఘటనలో మృతదేహాన్ని కనిపెట్టలేకపోవడంపై సీపీఎం ఆగ్రహం



మంత్రులను నిలదీస్తున్న సీపీఎం నేతలు

పగిడ్యాల: మైనర్ బాలిక కుటుంబాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల చెక్‌ను అందజేయడానికి శుక్రవారం ముచ్చుమర్రికి వచ్చిన మంత్రులకు భంగపాటు తప్పలేదు. ఘటన జరిగి 13 రోజులైన పరామర్శించడానికి మనస్సు రాలేదా? అంటూ సీపీఎం నేతలు, స్థానికులు మంత్రులను ప్రశ్నించారు. కేసును సీబీఐకి అప్పగించాలని, పోలీసుల వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు.. మంత్రి ఫరూక్‌ను కోరారు. దీంతో మంత్రి ఆగ్రహిస్తూ మాకు తెలుసంటూ చులకన భావంతో మాట్లాడారు. దీంతో సీపీఎం నాయకుల్లో ఒక్కసారిగా ఆవేశం కట్టలు తెంచుకుంది. ఘటన జరిగి 13 రోజులవుతున్నా ఇప్పటి వరకు మృతదేహాన్ని బాధిత తల్లిదండ్రులకు అప్పగించలేకపోయారని నిలదీశారు. దీంతో కమ్యూనిస్టులకు, మంత్రులకు మధ్య మాటామాటా పెరిగింది. ఇది గమనించిన పోలీసు ఉన్నతాధికారులు, రోప్ పార్టీ సిబ్బంది కమ్యూనిస్టులను కట్టడి చేసేందుకు యత్నించారు. సమాధానం చెప్పాలని, లేదంటే వాహనాలను కదలనిచ్చేది లేదని కమ్యూనిస్టులు స్వరం పెంచడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. వెంటనే స్పందించిన రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సీపీఎం నాయకులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా కాకుండా రూ.25 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ఏపీకి హామీల అమలు కేసు త్వరగా విచారించండి'

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై కేంద్రానికి తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను త్వరగా విచారించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు. 2014లో విభజన జరిగిందని పదేళ్ల ఉమ్మడి రాజధాని, చట్టం కాలపరిమితి వంటివి ముగిసిన అంశాలుగా మారాయని పేర్కొన్నారు. విభజన తర్వాత ఏపీలో 3 సార్లు ఎన్నికలు జరిగాయని, విభజన సమయంలో విభజనకు సంబంధించి అనుసరించిన విధానంపై లేవనెత్తిన ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదన్నారు. రాష్ట్ర ప్రజల్లో ఇప్పటికీ రాజధానిపై సందిగ్ధత అలాగే ఉందని తెలిపారు. గత విచారణ సమయంలో ఈ కేసు 10 వారాలు వాయిదా వేశారని తదుపరి విచారణ ఆగస్ట్ 22, 2024న జాబితా అయిందని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా కేసు విచారణ జరపాలని, ఈ మేరకు సీజేఐ ముందు త్వరలో ప్రస్తావిస్తామని రిజిస్ట్రార్ వద్ద దాఖలు చేసిన అప్లికేషన్‌లో పేర్కొన్నారు.

'న్యాయవాదుల సమస్యలను పరిష్కరించండి'

సాక్షి, అమరావతి: సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీవోపీ), ఆరోగ్య బీమా విషయంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా వారు ఆయనకు వినతి పత్రం సమర్పించారు. సీవోపీ, బీమా విషయంలో న్యాయవాదుల ఇబ్బందులను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు విన్న ద్వారకనాథరెడ్డి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీబీఏ కార్యవర్గ సభ్యులు తెలిపారు. బార్ కౌన్సిల్ చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు కొట్టు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగల రాజా, సంయుక్త కార్యదర్శి కె.క్రాంతి కుమార్, కోశాధికారి ఎస్.వి.వి. సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి..

డీఎస్పీకి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సవాల్



తాడిపత్రి రూరల్: 'అల్లర్ల కేసుల్లో బెయిల్‌కు సంబంధించి నాకు పూచీకత్తు ఇచ్చే వారు లేరు. దమ్ముంటే అరెస్టు చేసి జైలుకు పంపండి' అంటూ అనంతపురం జిల్లా తాడిపత్రి డీఎస్పీ జనార్దననాయుడుకు టీడీపీకి చెందిన మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సవాల్ చేశారు. తాడిపత్రి మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తాను ఇంటికి వెళతానని, అక్కడికి వచ్చి అరెస్టు చెయ్యి.. అని అన్నారు. తన కుటుంబానికి అన్యాయం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ ఈనెల 24న అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట అనుచరులతో కలిసి బైఠాయిస్తానని చెప్పారు. గతంలో రవాణా శాఖ కమిషనర్‌గా పనిచేసిన సీతారామాంజనేయులు, డీటీసీ ప్రసాద్‌రావు, మాజీ మంత్రి పేర్ని నాని, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన ఇద్దరు కుమారులపై కేసులు నమోదు చేయడానికి పోలీసులకు ఇంతకుముందే కొంత సమయం ఇచ్చానని, ఇచ్చిన గడువు తీరడంతో ఈ నెల 24న అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట అనుచరులతో కలిసి బైఠాయించనున్నట్లు తెలిపారు. అల్లర్ల ఘటనలకు సంబంధించి తామిచ్చిన ఫిర్యాదు మేరకు మూడు కేసులు నమోదు చేయాలని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. పోలీసు వ్యవస్థ భ్రష్టు పట్టిందని, శాంతి భద్రతలు దెబ్బతినడానికి పోలీసు ఉన్నతాధికారులే బాధ్యులన్నారు. ఇకపై తాడిపత్రి నియోజకవర్గంలో ఏ పండుగకూ అనుమతులు తీసుకోబోమని, అవసరమైతే సమాచారం మాత్రమే ఇస్తామని చెప్పారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు.





"ఎవరిలోనైతే కుటిలతగానీ, కపటంగానీ, అబద్ధంగానీ ఉండవో– అంటే ఎవరైతే రాగద్వేషాలకు దూరంగా ఉంటూ, నిష్కల్మష హృదయులై ఉంటారో వారికి మాత్రమే ఈ విశుద్ధ, నిర్వికార బ్రహ్మలోకం లభిస్తుంది.

– ప్రశ్నోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 20 జూలై 2024

స్తంభించిన ప్రపంచం!

మైక్రోసాఫ్ట్ విండోస్ మొండికేయటంతో శుక్రవారం ఒక్కసారిగా అంతా అస్తవ్యస్తమైన తీరు ఐటీపై ప్రపంచం ఎంతగా ఆధారపడిందో కళ్లకు కట్టింది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలతోపాటు మన దేశంలోనూ అనేక సేవలకు అంతరాయం ఏర్పడింది. మ్యాక్, లైనెక్స్ ఆధారిత సేవలు యథావిధిగా పనిచేశాయి. 1872లో ఆంగ్ల రచయిత శామ్యూల్ బట్లర్ యంత్రాలకు సొంతంగా ఆలోచించే, తిరిగి తమంత తాము చేయగలిగే సామర్థ్యం వస్తే ఎలావుంటుందో చూపుతూ ఎరెవాన్ అనే వ్యంగ్య నవల రాశాడు. అది మరీ అతిగావుందని సమకాలికుల నుంచి విమర్శలొచ్చాయి. బహుశా ప్రపంచంలో అదే తొలి సైన్స్ ఫిక్షన్. ఆ కోవలో తర్వాత చాలా వచ్చాయి. సైబర్ దాడులు జరిగితే ప్రపంచం ఏమవుతుందన్న ఇతివృత్తాలతో చలనచిత్రాలు, టీవీ సీరియళ్లు వచ్చాయి. కానీ మైక్రోసాఫ్ట్ విండోస్‌కు సైబర్ నేరగాళ్లనుంచి కాకుండా అలాంటివారినుంచి రక్షిస్తామని చెప్పే ఒక సైబర్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌వల్ల సమస్యలు తలెత్తి ఇంత పని జరగటం ఒక వైచిత్రి. మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ సేవలందించే క్రౌడ్‌స్ట్రయిక్ అనే అమెరికా సంస్థ తాను రూపొందించిన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ను నవీకరించి కొత్తది విడుదల చేయగానే సమస్య తలెత్తిందంటున్నారు. దీంతో మైక్రోసాఫ్ట్ రూపొందించిన ఇన్‌ట్యూన్, వన్‌నోట్, షేర్‌పాయింట్, మైక్రోసాఫ్ట్ డిఫెండర్ వంటి అనేక యాప్‌లు నిరర్థకమయ్యాయి. ఒక్కొక్కటే మళ్లీ పునరుద్ధరిస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. అయితే ఈలోగా అనేక దేశాల్లో కంప్యూటర్లు ఆగిపోయాయి. రైళ్లు, విమానయాన సేవలు నిలిచిపోవటం మొదలుకొని దుకాణాల్లో చెల్లింపుల ప్రక్రియ వరకూ అన్నిటికన్నీ స్తంభించిపోయాయి. చాలాచోట్ల వాణిజ్య, వ్యాపార లావాదేవీలూ, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలూ, వార్తా ప్రసారాలూ, పోలీసు వ్యవస్థలూ, మెట్రో సర్వీసులూ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లూ నిలిచిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది సంస్థల్లో వినియోగించే టీమ్స్ సాఫ్ట్‌వేర్ సైతం ఆగిపోయింది. విమానాల్లో బోర్డింగ్ పాస్‌లు చేతితో రాసి ఇవ్వటం అందరూ మరిచి దాదాపు మూడు దశాబ్దాలవుతోంది. తాజా సమస్య అదెలా వుంటుందో ఈ తరానికి రుచి చూపింది.

సమాచార సాంకేతికతలు వర్తమాన యుగంలో జీవితాన్ని వేగవంతం చేశాయి. కొన్ని శతాబ్దాలు ఇలాంటివేమీ లేకుండానే ప్రపంచం మనుగడ సాగించిందన్న సంగతినే మరిచేలా చేశాయి. అరచేతిలో ప్రపంచం మొత్తం ఇమిడిపోయింది. ఖండాంతరాల్లోని మారుమూల దేశాల్లోనివారితో సైతం ఎక్కడున్నవారైనా మాట్లాడగలిగే వెసులుబాటు అందుబాటులోకొచ్చింది. మనుష్య సంచారం అసాధ్యమనుకున్న చోటకు సైతం డ్రోన్‌లు వెళ్తున్నాయి. సాధారణ పనులు మొదలుకొని ప్రమాదం పొంచివుండే కార్యాలవరకూ రోబోలు చేస్తున్నాయి. సంక్లిష్ట సమస్యలకు చిటికెలో పరిష్కారం లభిస్తోంది. అందువల్ల ఉత్పాదకత పెరిగింది. చాలా తక్కువ వ్యవధిలో ఎక్కువ పని చేయగలిగే సామర్థ్యం మనుషుల సొంతమైంది. కావలసిన సమాచారం కోసం గూగుల్‌ని ఆశ్రయించేవారే నిమిషానికి 63 లక్షలమంది ఉన్నారంటే పరిస్థితేమిటో అర్థమవుతుంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా సగటు ఆయుఃప్రమాణం 52.5 సంవత్సరాలైతే ఆరోగ్యరంగ సాంకేతికతలవల్ల అది ప్రస్తుతం 72 సంవత్సరాలని ఐక్యరాజ్యసమితి నిరుడు ప్రకటించింది. సమాచార సాంకేతికతలు అనేకచోట్ల మనిషి అవసరాన్ని తగ్గించాయి. అందువల్ల కొందరి ఉద్యోగావకాశాలకు ముప్పు వచ్చిన మాట కూడా వాస్తవం. కానీ ఇదివరకెన్నడూ వినని అనేక రకాల కొత్త అవకాశాలు లభించాయి. వచ్చే ఏడాదికల్లా ప్రపంచవ్యాప్తంగా ఈ సాంకేతికతల్లో 9 కోట్ల 70 లక్షల ఉద్యోగావకాశాలుంటాయని ఒక అంచనా. అయితే ఈ సాంకేతికతల వల్ల సాంఘిక జీవనం అస్తవ్యస్తమవుతున్నదని, మనిషి ఏకాకి అవుతున్నాడని, పర్యవసానంగా సమాజంలో అమానవీయత విస్తరించిందని, వ్యక్తి గోప్యతకు ముప్పు ఏర్పడిందని, పౌరుల జీవితాల్లోకి రాజ్యం చొరబాటు ఊహకందనంత పెరిగిందని కనబడుతూనేవుంది. తప్పుడు సమాచారం వ్యాప్తిచేసి లాభపడే శక్తులున్నట్టే, దానివల్ల నష్టపోతున్నవారూ అధికంగానే ఉన్నారు. ఈ సాంకేతికతల అభివృద్ధి పరుగులో పర్యావరణానికి కలుగుతున్న హాని గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు. పారిశ్రామికీకరణ తర్వాత భవిష్యత్తు స్పృహ కొరవడి అడవుల, ఇతరేతర సహజ సంపదల విధ్వంసం, పర్యవసానంగా ప్రకృతి వైపరీత్యాలు క్రమేపీ పెరిగాయనుకుంటే ఐటీ అభివృద్ధి దీన్ని మరింత వేగవంతం చేసింది. పర్యావరణ అనుకూల సుస్థిరాభివృద్ధి వైపు దృష్టి సారించాలన్న వినతులు అరణ్యరోదనే అవుతున్నాయి.

పాతికేళ్ల క్రితం వై2కె సమస్యతో ప్రపంచం తలకిందులవుతుందన్న ప్రచారం జరిగింది. ఈ సమస్య పరిష్కారానికి వేల కోట్లు ఖర్చుచేయటం తప్పనిసరన్న అంచనాలు వచ్చాయి. తీరా చాలా సులభంగానే దానికి పరిష్కారం దొరికింది. నిజానికి ఆ రోజుల్లో కంప్యూటర్ల వాడకం, వాటిపై ఆధారపడటం ఇప్పటితో పోలిస్తే తక్కువనే చెప్పాలి. కానీ తరచు సైబర్ దాడులతో తల్లడిల్లే సమాచార సాంకేతిక ప్రపంచంలో తాజా ఉదంతం ఒక పెద్ద కుదుపు. అప్రమత్తంగా లేకపోతే, విడుదల చేసేముందు ఒకటికి పదిసార్లు పరీక్షించి చూసుకోనట్టయితే ఒక సాఫ్ట్‌వేర్ ఎంతటి ఉత్పాతం సృష్టించగలదో తాజా ఉదంతం ఒక హెచ్చరిక. ఇంతవరకైతే ఫర్వాలేదు. కానీ దాదాపు అన్ని దేశాల రక్షణ వ్యవస్థలూ ఐటీతో ముడిపడివున్న వర్తమానంలో పొరపాటున సాఫ్ట్‌వేర్ లోపంతో కంప్యూటర్లు తప్పుగా అర్థం చేసుకుంటే పెనుముప్పు ఏర్పడుతుంది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే మారణాయుధాలు భూగోళాన్ని వల్లకాడు చేస్తాయి. ఆ విషయంలో అప్రమత్తత అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** శు.చతుర్దశి సా.5.20 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.25 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.04 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.37నుండి 7.21 వరకు, **అమృతఘడియలు:** రా.9.37 నుండి 11.12 వరకు.

సూర్యోదయం: 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

అమెరికా రాజకీయంలో హింసాపర్వం

విశ్లేషణ



మనోజ్ జోషి

అమెరికా రాజకీయ జీవితంలో హింస ఒక భాగమైందన్నది వాస్తవం. తుపాకుల లభ్యత, వాటి యాజమాన్యంపై నియంత్రణలను సడలించారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగించిన కోల్ట్ ఏఆర్–15 వంటి ఆయుధాలను నిషేధించే ప్రయత్నం పదేళ్లే కొనసాగింది. ఇది కోర్టులో పదేపదే సవాళ్లను ఎదుర్కొంది. ఎక్కువగా ఇటువంటి ఆయుధాలతోనే సామూహిక కాల్పులు జరుపుతారు. 2023లో, 604 కాల్పులు జరగగా 754 మంది మరణించారు. ఇక ట్రంప్ మీద జరిగిన హత్యాయత్నం ఆయనకు రాజకీయంగా లాభిస్తుందనేది సుస్పష్టం. అలాగే ట్రంప్ వాచాలత్వం పెను మంటలు రగిలించేలా ఉందన్నదీ రహస్యం కాదు. ఆయన ఎలా వ్యవహరిస్తారనే దానిపై ప్రస్తుత పరిస్థితి చాలావరకు ఆధారపడి ఉంటుంది.

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి సంబంధించిన రాజకీయ పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అవి ఆయనకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తాయి. తనపై జరిగిన దాడి పట్ల ట్రంప్ సహజమైన, పోరాట ప్రతిస్పందనలకు గొప్ప ప్రాముఖ్యత ఉంది. ఆయనను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు చుట్టుముట్టినప్పుడు, తన ముఖం మీద రక్తపు చారలతో, తన కుడి పిడికిలిని పైకెత్తి, 'ఫైట్, ఫైట్, ఫైట్'(పోరాడు) అంటూ గర్జించారు. రక్తసిక్తమైన, ఆగ్రహోదగ్రుడైన ట్రంప్ పిడికిలి బిగించి ఉండగా, ఆయన వెనుక ఒక అమెరికన్ జెండా రెపరెపలాడుతున్న చిత్రాలు వైరల్‌గా మారాయి. రెండు వారాల క్రితం అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగిన చర్చలో జో బైడెన్ ప్రదర్శన, సమర్థవంతమైన ప్రచారాన్ని నిర్వహించగల ఆయన సామర్థ్యం వల్ల అధ్యక్ష పోటీ ఇప్పటికే గందరగోళంలో పడింది.

తనపై ఉన్న కేసుల కారణంగా తనను తాను అమర వీరుడుగానూ, హింసకు గురైన వ్యక్తిగానూ ప్రదర్శించుకోవడం ట్రంప్ విధానం. కాల్పుల ద్వారా మృత్యువుకు సమీపంగా వెళ్లడం అనేది ఆయనకు అమరత్వ భావనను ఆపాదిస్తుంది. అధ్యక్షుల చర్చలో పరాజయం తరువాత డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్‌ను తొలగించాలనే ప్రచారంపై ట్రంప్ మీద హత్యాయత్నం తప్పక ప్రభావం చూపుతుంది. ట్రంప్ వర్గానికి అంతకంటే కావాల్సింది లేదు.

ట్రంప్‌పై కాల్పుల ఘటన బైడెన్ ప్రచారాన్ని క్లిష్టతరం చేస్తుంది. ఇప్పుడు నేరుగా ట్రంప్‌పై దృష్టి సారిస్తానని అమెరికా అధ్యక్షుడు గత వారంలో అన్నారు. ట్రంప్‌ను ఓడించడానికి తానే ఉత్తమ అభ్యర్థిగా ఉన్నానని ఆయన అభిప్రాయం. 'లక్ష్యానికి సంబంధించిన కేంద్ర స్థానంలో ట్రంప్‌ను ఉంచే సమయం వచ్చింది' అన్న బైడెన్ మాటల్ని, తమ అధ్యక్ష అభ్యర్థిపై హింసకు పిలుపుగా ఇప్పుడు కొంతమంది రిపబ్లికన్లు ఆపాదిస్తున్నారు. ఇది ఒక విడి ఘటన కాదనీ, ట్రంప్ 'ఏ రకంగానైనా అడ్డుకోవలసిన నిరంకుశ ఫాసిస్ట్' అనే డెమోక్రాటిక్ పార్టీ వాచాలత్వపు అనివార్య పరిణామమనీ రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ పోస్ట్ చేశారు.

అమెరికా రాజకీయ జీవితంలో హింస ఒక భాగమైందన్నది వాస్తవం. తుపాకుల లభ్యత, వాటి యాజమాన్యంపై నియంత్రణలను సడలించడం వంటి నిర్ణయాలతో కోర్టులేమీ మేలు చేయలేదు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగించిన కోల్ట్ ఏఆర్–15 వంటి దాడి ఆయుధాలను నిషేధించే ప్రయత్నం కేవలం పదేళ్ల పాటు కొనసాగింది. ఇది కోర్టులో పదేపదే సవాళ్లను ఎదుర్కొంది. ప్రస్తుతం, కొన్ని రాష్ట్రాలు తమ సొంత చట్టాల ద్వారా అటువంటి ఆయుధాలను నిషేధించాయి. కాల్పుల ఘటన జరిగిన పెన్సిల్వేనియా వాటిలో లేదు. ఎక్కువగా ఇటువంటి ఆయుధాలతోనే సామూహిక కాల్పులు జరుపుతారు. జూలైలో ఇప్పటికే మరొక కాల్పుల ఘటన, అయిదు మంది మరణాలకు దారితీసింది. 2023లో, 604 కాల్పులు జరగగా 754 మంది మరణించారు, దాదాపు 2,500 మంది గాయపడ్డారు. అమెరికన్ సుప్రీంకోర్ట్ సహాయకారిగా లేదని చెప్పడం చిన్న మాటే అవుతుంది.



బైడెన్ గెలుపొందిన ఎన్నికల ఫలితాలను ట్రంప్ మద్దతుదారులు 2021 జనవరి 6న తారుమారు చేయడానికి ప్రయత్నించిన కాపిటల్ అల్లర్ల నుండి, అమెరికా ఎన్నికల ప్రక్రియ హింసకు దారితీసింది. తిరుగుబాటును అణిచివేసేందుకు ముందు రేగిన అల్లకల్లోలంలో తొమ్మిది మంది మరణించారు. దీనివల్లనే ట్రంప్ ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత అమెరికన్ రాజకీయాలు లోతుగా విభజనకు గుర య్యాయి. 'ప్యూ రీసెర్చ్ సెంటర్' పోల్ ప్రకారం, ప్రతి రాజకీయ పక్షంలోనూ దాదాపు మూడింట రెండు వంతుల మంది... ఇతర పార్టీలలోని వారు అనైతికులనీ, నిజాయితీ లేనివారనీ, సంకుచిత మనస్తత్వం గలవారనీ నమ్ముతున్నారు.

ట్రంప్ వాచాలత్వం పెను మంటలు రగిలించేలా ఉందన్నది రహస్యం కాదు. తాను వచ్చే నవంబర్ అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోతే 'రక్తపాతం' ఉంటుందని మార్చ్ నెలలో ఒక ఇంటర్వ్యూలో ప్రకటించారు. తరువాత ఒక ర్యాలీలో, 'ఇప్పుడు నేను ఎన్నిక కాకపోతే... అది దేశానికి రక్తపాత కారకం అవుతుంది' అని పునరావృతం చేశారు. 2023 మార్చిలో, ట్రంప్ దోషిగా నిర్ధారించబడిన కేసులో మాన్‌హట్టన్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది తనపై అభియోగాలు మోపినట్లయితే 'సంభావ్య మరణం, విధ్వంసం' జరగొచ్చని మాజీ అధ్యక్షుడు హెచ్చరించారు. తనకు అన్యాయం జరిగితే 'వీధుల్లో అల్లర్లు జరుగుతాయి', 'దేశంలో అల్లర్లు జరుగుతాయి' అని బెదిరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆయన అనుచరులు మరోవైపున వలసదారులు, విదేశీయులు, శ్వేతజాతీయేతర జాతుల ప్రజలపై హింస గురించి మాట్లాడారు. నిజానికి, వ్యాపార లావాదేవీల్లో 34 నేరాలకు ట్రంప్ పాల్పడ్డారని మే నెలలో న్యాయస్థానం ఆయనను దోషిగా ప్రకటించిన తర్వాత, ట్రంప్ అనుకూల వెబ్‌సైట్లు అల్లర్లు, విప్లవం, హింసాత్మక ప్రతీకారం అనే పిలుపులతో నిండిపోయాయి.

ఇటీవలి సంవత్సరాలలోని హింసలో రాజకీయ నమూనా ఉంది. 2017లో, బేస్‌బాల్ గేమ్‌లో రిపబ్లికన్ హౌస్ మెజారిటీ విప్ అయిన స్టీవ్ స్కలైస్ మీద రిపబ్లికన్ వ్యతిరేక గన్‌మ్యాన్ కాల్పులు జరిపాడు (ఆ గన్‌మ్యాన్‌ను అప్పుడే కాల్చి చంపారు). 2018లో, ఫ్లోరిడాకు చెందిన ఒక వ్యక్తి నాటి అధ్యక్షుడు ట్రంప్ విమర్శకులకు పైపు బాంబులను మెయిల్ చేశాడు. అతడు లక్ష్యంగా చేసుకున్నవారిలో బరాక్ ఒబామా, హిల్లరీ క్లింటన్, కమలా హారిస్ ఉన్నారు. 2020 ఎన్నికలకు ముందు, మిషిగన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్‌ను కిడ్నాప్ చేసి, రాజద్రోహ నేరం కింద ఆమెను 'విచారణ'లో నిలబెట్టడానికి ఆరు గురు వ్యక్తులు కుట్ర పన్నారు. 2022లో, మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీని లక్ష్యంగా చేసుకున్నారు; దాడిలో ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారు. దుండగుడు పెలోసీని బందీగా తీసుకోవాలని పథకం వేశాడు.

ఈ పరిస్థితులలో, సగటు అమెరికన్ నిరుత్సాహానికీ, నిరాశకూ గురవుతాడు. రెండు పార్టీలలోని అతివాద శక్తులు అధికారం చేజిక్కించుకుని ఉన్నాయనీ, గతంలో అమెరికన్ రాజకీయాలకు ప్రతీకగా నిలిచిన ద్వైపాక్షికతకు పెద్దగా చోటు లేకుండా చేశాయనీ సగటు అమెరికన్లు భావిస్తున్నారు.

రాబోయే రోజులూ, వారాల్లో బైడెన్ చర్చ వైఫల్యం, దానిపై పోరలుగా, ట్రంప్‌పై హత్యాయత్నం వంటి ఇటీవలి సంఘటనలకు చెందిన పరిణామాల పెరుగుదలను మనం చూస్తాం. చాలామంది సరైన ఆలోచనాపరులు ట్రంప్‌పై కాల్పుల దాడి కలిగించిన షాక్ ప్రభావం ఎంతో కొంత ప్రశాంతతను తెస్తుందని ఆశిస్తున్నప్పటికీ, అలా జరుగుతుందనడానికి ఎటువంటి హామీ లేదు. రష్యన్లు, చైనీయులు తమ వంతు పాత్రను జోడించడంతో ఇప్పటికే తప్పుడు సమాచారం, అతిశయోక్తి, తీవ్రవాదం, జాత్యహంకారం, విభజన, అపనమ్మకం లాంటివి సైబర్ ప్రపంచంలో చెడతిరుగుతున్నాయి.

ట్రంప్ ఎలా వ్యవహరిస్తారనే దానిపై ప్రస్తుత పరిస్థితి చాలావరకు ఆధారపడి ఉంటుంది. తనపై హత్యాయత్నాన్ని ఆయన డెమో క్రాట్‌లపై దాడి చేయడానికి, విభజనలను మరింతగా పెంచడానికి ఉపయోగించవచ్చు లేదా నైతికంగా అత్యున్నత మార్గాన్ని చేపట్టి, పక్షపాత చీలికలను నయం చేయడానికి ఎంచుకోవచ్చు. కానీ ఫిర్యా దులు, ప్రతీకారం చాలాకాలంగా ట్రంప్ ఇతివృత్తాలుగా ఉన్నాయి. ఆయన తక్షణ ప్రతిస్పందన నెమ్మదిగానూ, తెలివిగానూ ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ట్రంప్ ఏ దిశలో వెళ్లగలరనే దానిపై అంచనాలు ఊహకందడం లేదు.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

రెండూ భిన్నం



బానిసత్వం చట్టబద్ధం, వర్ణవివక్ష చట్టబద్ధం, ఆఖరికి వలసవాదం కూడా చట్టబద్ధం. కానీ ఒకటి చట్టబద్ధమైనంత మాత్రాన అది సరైందని కాదు. చట్టబద్ధత అనేది నైతికతకు సంబంధించినది కాదు. అది అధికారానికి సంబంధించినది.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

హిందీ సమస్య



కర్ణాటకలోని కన్నడిగులతో లేదు సమస్య : హిందీ అనేది జాతీయ భాష అనీ, దాన్ని అందరూ నేర్చుకోవాలనీ హిందీవాలాలు అనుకోవడంలో ఉంది. పైగా హిందీయేతరులు తక్కువ భారతీయులు కాబట్టి వాళ్లకు హిందీ 'నేర్పించాలి' అనుకోవడం మరొకటి.

– సంజయ్ హెగ్డే, న్యాయవాది

ఉద్యోగ దాత



ధోతి కట్టుకోవడం వల్ల బెంగళూరు మాల్‌లోకి ప్రవేశానికి నిరాకరించబడిన రైతు ఫకీరప్ప, "నన్ను ఆపిన సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం పోతున్నదని తెలిసింది. దయచేసి ఆయన్ని ఉద్యోగం నుంచి తీసేయొద్దు. ఆయనకు కూడా కుటుంబం ఉంటుంది కదా" అన్నారు. అదీ ఒక రైతు హృదయం.

– ఆదర్శ్ హెగ్డే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కోరుకున్నది తినాలి...



మా ప్రాంతంలో 'హలాల్', 'ఝట్కా' మాంసం దుకాణాలు రెండూ ఉంటాయి. నేను ఎప్పుడూ ఝట్కా దుకాణానికి వెళ్లలేదు, భవిష్యత్‌లో వెళ్లే ఆలోచన లేదు. ఇది నా హక్కు. ఆ కారణంగా నన్నెవరూ తప్పుపట్టరు. అలాగే అందరికీ ఆ ఎంపిక అవకాశం ఉండాలి.

– జాఫర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మాట్లాడలేరా?



78 రోజులు, 11 తీవ్రవాద దాడులు, పదులకొద్దీ పౌరులు, సైనికుల మరణాలు... అయినా నిశ్శబ్దం తాండవిస్తోంది. ఎవరికీ మాట్లాడటానికి మాటల్లేవు. చాలామంది 'నంబర్ వన్, నంబర్ టూ'లతో బాగుంటే చాలనుకుంటున్నారు. మిగతావాళ్లు ట్రోల్స్‌కు భయపడుతున్నారు. ఇదీ ఇప్పటి దేశ పరిస్థితి.

– వైభవ్ సింగ్, మీడియా పర్సనాలిటీ

ప్రదర్శన వద్దన్నప్పుడు...



'కావడ్ యాత్ర' (శివ భక్తుల యాత్ర) సందర్భంగా, ఉత్తరప్రదేశ్‌లో అధికారిక ఆజ్ఞల ప్రకారం, దుకాణ యజమానులు, చిన్న వీధి వర్తకులు తమ పేర్లను ప్రదర్శించాలని మీరు అడుగుతారు(ఇది మతానికి కోడ్). మీరే మళ్లీ హలాల్ ఆహారం, బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ గురించి అరుస్తారు. పూర్తిగా ద్వంద్వ ప్రమాణాలు.

– బర్ఖా దత్, జర్నలిస్ట్

ఏకీకృత నష్టం



మైక్రోసాఫ్ట్ 'గ్లిచ్' (చిన్న సమస్య) వల్ల ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు, ఆర్థిక మార్కెట్లు, విమానాలు ఆగిపోవాల్సి వచ్చింది. అందుకే ఉత్పత్తి సంబంధ వైవిధ్యం చాలా ముఖ్యం. ప్రపంచ వ్యాప్త ఏకీకృత అనుసంధానం అనేది చెడ్డ ఆలోచన. తక్కువ అనుసంధానిత వ్యవస్థ చూడటానికి అంత సమర్థంగా కనబడకపోవచ్చు, కానీ త్వరగా కోలుకుంటుంది.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

పరిశోధనా ఫలితాలు అందరివి!

ఐక్యరాజ్యసమితి 2021లో చేసిన తీర్మానాన్ని అనుసరించి 2022 నుంచి జూలై 20వ తేదీన అంతర్జాతీయ చంద్ర దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుతున్నారు. అంతర్జాతీయ చంద్ర దినోత్సవం ముఖ్య ఉద్దేశం చంద్రునిపై పరిశోధనలు చేయడానికి ప్రపంచ దేశాలు అన్నీ సహకరించుకొని మానవాభివృద్ధికి పరిశోధనా ఫలితాలను వాడుకోవడం. మానవుడు ఈ భూమి మీద జన్మించిన నాటి నుండి ఖగోళ విషయాలు తెలుసుకోవడంలో ఆసక్తి చూపుతూ వచ్చాడు. 1969లో అమెరికా తన పౌరుణ్ణి చంద్రునిపై నడిపించడంతో చందమామపై పరిశోధనలు ఊపందుకున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే అనేక మిషన్‌లను చంద్రుని పరిశోధనకు పంపాయి.

మన భారతదేశం చంద్రునిపై పరిశోధనలు చేయడానికి 'చంద్రయాన్' పేరుతో పలు ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగుతున్నది. ముఖ్యంగా 2023 జూలై 3వ తేదీన 'చంద్రయాన్–3' ప్రయోగం విజయవంతం చేశారు. ఆగస్ట్ 23వ తేదీన చంద్రుని దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండింగ్ సాఫీగా జరగటం ద్వారా భారతదేశం చంద్రుని దక్షిణ ధృవంపై మొట్టమొదటగా ల్యాండ్ అయిన దేశంగా ఘన విజయం సొంతం చేసుకుంది. అందుకే ఈ సంవత్సరం 2024 ఆగస్ట్ 23 నుంచి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆగస్ట్ 23న జరుపుకోవాలని నిర్ణయించారు. ఇంకా మరెన్నో ప్రయోగాలు చేయవలసిన ఆవశ్యకత ఉంది.

భవిష్యత్తులో 'మానవుని నివాసం చందమామే' అన్నట్లుగా పరిశోధనలు చేయవలసిన అవసరం ఉంది. ఇప్పటికే కొన్ని దేశాలు ఈ లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. మన దేశం విషయానికి వస్తే.. నిపుణులైన శాస్త్రవేత్తలు ఉన్నారు. అయితే మౌలిక సదుపాయాలు, వసతులు లేకపోవడంతో కొంత వెనకబడిపోతున్నాము. అయినా మన 'ఇస్రో' శాస్త్రవేత్తలు ఇతర దేశాల రాకెట్లను కూడా అంతరిక్షంలో ప్రవేశపెడుతున్నారు. మరికాస్త సహకారం ప్రభుత్వం అందిస్తే, మరెన్నో అద్భుతాలు సృష్టించడమే కాకుండా దేశ అభివృద్ధికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఆర్జించి పెడతారు.

– ఐ. ప్రసాదరావు; ఉపాధ్యాయుడు, కాకినాడ
(నేడు ప్రపంచ చంద్ర దినోత్సవం)

పాముకాటు మరణాలను ఆపేదెన్నడు?

అభిప్రాయం



ముద్దం నరసింహ స్వామి

సాధారణంగా వర్షాకాలం ఎక్కువగా పాములు సంచరిస్తూ ఉంటాయి. ఆరుబయట గడ్డిదుబ్బులు, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు మొలిచి పాములకు అనువైన ఆవాసంగా మారే సీజన్ ఇది. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ కాలంలోనే ఎక్కువగా ప్రజలు... ముఖ్యంగా రైతులు పాముకాటుకు గురవుతూ ఉంటారు.

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పాము కాటు మరణాలు విపరీతంగా సంభవిస్తున్నాయి. గోదావరి వరదలు వచ్చిన భద్రాచలం వంటి ప్రాంతాల్లో వరద నీటితోపాటు ఇళ్లలోకి పాములు, తేళ్లు వచ్చి చేరడంతో పలువురు వాటి కాటుకు గురయిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి సమయాల్లో పొలాల్లో తిరిగేవారు, పొలంకాడే నిద్రించేవారు అధికంగా పాముకాటుకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

భారతదేశంలో పాము కాటు మరణాలు భారీగా నమోదవుతున్నాయని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఓ నివేదికలో వెల్లడించింది. 2000 సంవత్సరం నుండి 2019 సంవత్సరాల వరకూ గత 20 ఏళ్లలో ఏకంగా 12 లక్షల మంది పాముకాటుతో ప్రాణాలు వదిలారని ఈ సంస్థ నివేదిక పేర్కొంది. అంటే ప్రతి సంవత్సరం సరాసరి పాముకాటుకు 58 వేల మంది చనిపోతున్నారని నివేదిక పేర్కొంది. ఇంకా ప్రభుత్వ లెక్కల్లోకి రాని పాముకాటు మరణాలు దేశంలో పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నట్లు కూడా చెప్పుకొచ్చింది. పెద్ద సంఖ్యలో పాముకాటు మరణాలు సంభవిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని తగ్గించి చూపించే ప్రయత్నం చేస్తున్నాయని డబ్ల్యూహెచ్‌ఓ ఆరోపించింది.

ఒక అంచనా ప్రకారం దేశంలో ఏటా సరాసరి 10 లక్షల మంది పాముకాటుకు గురవుతున్నారు. అయినప్పటికీ వారికి తగినంత పాము కాటు విరుగుడు మందు దేశంలో తయారీలో లేదని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. భారతదేశంలో కట్ల పాము, తాచు పాము, రెండు రకాల రక్తపింజరల వల్ల ఎక్కువగా పాముకాటులు సంభవిస్తున్నాయనీ, మరణాలకు కూడా ఇవే కారణమనీ ఈ సంస్థ పేర్కొంది. అయితే ప్రస్తుతం పాముకాటుకు విరుగుడు యాంటీ వీనం తయారుచేస్తున్న కంపెనీలు నాలుగే ఉన్నాయనీ, వాటి తయారీ ప్రక్రియలో కూడా నాణ్యత ఉండడం లేదనీ డబ్ల్యూహెచ్‌ఓ అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేకాదు భారతదేశంలో అవసరానికి తగ్గట్టుగా మెడిసిన్ ఉత్పత్తి జరగడం లేదని పేర్కొంది. ఇక పాముకాటు మరణాలకు పదిరెట్లు ఎక్కువగా బాధితులు అంగవైకల్యానికి గురవుతున్నారని ఇది గుర్తించింది.



పాము కాటు కేసుల్లో 30 శాతం పూర్తిస్థాయిలో విషం మనిషి శరీరంలోకి వెళ్తుందని, ప్రపంచ సగటు కంటే ఇది ఎక్కువ అని పేర్కొంది. దీనికి ప్రధాన కారణం గ్రామాల నుంచి పాముకాటుకు గురైన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లే సౌకర్యాలు లేకపోవడం అని తెలిపింది.

ఇక ప్రాథమిక చికిత్సా కేంద్రాల్లోని సిబ్బందికి పాము కాటుకు చికిత్స చేయడంలో అనుభవం లేదని అంటోంది. అంతేకాదు, యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నా ప్రాథమిక చికిత్సా కేంద్రాల్లో సరైన పరికరాలు లేకపోవడంతో, ఆ ఇంజెక్షన్లు పాడైపోతున్నాయని గుర్తించింది. మరికొన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లలో యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు కాలం చెల్లిపోవడంతో బాధితులకు సరైన సమయంలో చికిత్స అందక పట్టణాలకు వెళ్లే ప్రయత్నంలో సమయం ఎక్కువ అవ్వడంతో, చాలా మంది దారి మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ చెబుతోంది. ఈ పరిస్థితి ఆఫ్రికన్ దేశాలు, ఆస్ట్రేలియాతో పాటు మన దేశంలో కూడా నెలకొన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం తేల్చింది. ఇప్పటికైనా అధికారులు పాము కాటుకు సరైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలూ అప్రమత్తంగా వ్యవహరించాలి. మొత్తం మీద ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన నివేదికను ప్రజలు, ప్రభుత్వాలు ఒక పాఠంగా స్వీకరించాలి.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99498 39699

పవిత్రహృదయం

ఒక భక్తుడు అడవిలో కఠోర తపస్సు చేస్తున్నాడు. దేవుడు అతని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. దేవుడి చేతిలో ఆయుధాలు ఉన్నాయి. 'భక్తా, నీ భక్తికి మెచ్చాను. నీకు ఏం కావాలో కోరుకో' అన్నాడు దేవుడు. ఆ మాటతో భక్తుడు 'దేవుడా, నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శక్తులను నీ ఆయుధాలతో నాశనం చేసెయ్' అన్నాడు.

భగవంతుడు ఓ నవ్వు నవ్వాడు. 'దానికేం... అలాగే చేసేస్తాను' అని అంతర్ధానమయ్యాడు. కాసేపయింది. భగవంతుని చేతిలో నుంచి ఓ ఆయుధం వేగంగా వచ్చింది. వరం అడిగిన భక్తుడి రొమ్ము మీద దాడి చేసింది. అతను కింద పడిపోయాడు. 'ఇదేమిటీ దేవుడ్ని వరమడగటం తప్పయిపోయిందిగా' అనుకున్నాడు.

'అయ్యో దేవుడా, ఏమిటిది... నా పురోగతికి అడ్డంకిగా ఉన్న శత్రువును తొలగించమన్నాను. కానీ నువ్వు నీ ఆయుధంతో నాపైనే దాడి చేశావు. గురి తప్పిందా?' అని అడిగాడు భక్తుడు.



జ్యోతిర్మయం

అప్పుడు దేవుడు మళ్ళీ ప్రత్యక్షమై 'భక్తా, నువ్వు కోరుకున్నట్టే నేను ఆయుధం సంధించాను. నేనేమీ నువ్వు అడిగింది మరచిపోలేదు. నీ మీదకు నేను ప్రయోగించిన ఆయుధం సరిగ్గానే వచ్చింద'న్నాడు.

'ఇతరులపై దాడి చేయాలి, పడగొట్టాలి, అంతమొందించాలి అని అనుకునే నీ అంతరంగమే నీకు ప్రధాన శత్రువు. అవే నీ ప్రగతికి అడ్డుకట్టలవుతున్నాయి. అందుకే నా ఆయుధం నిన్నే ఢీకొట్టింద'న్నాడు భగవంతుడు. ఆయన మాటలు లీలగా వినిపిస్తూ ఉండగానే భక్తుడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించేవాడు తన భౌతికపరమైన అభివృద్ధికి సంబంధించిన యావ తగ్గించుకొని కైవల్య ప్రాప్తిపైనే దృష్టి పెట్టాలి. హృదయగత దౌర్బల్యాలను వదిలించుకోకుంటే దేవుడు వరమిచ్చినా దాన్ని వినియోగించుకోవడంలో విఫలమవ్వడం తథ్యం. హృదయాన్ని పవిత్రంగా ఉంచుకుంటే అంతా మేలే జరుగుతుంది.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

నేడు అప్పన్న గిరిప్రదక్షిణ

- 32 కిలోమీటర్ల మేర వ్యాపించిన సింహగిరి
- 5లక్షల మంది హాజరవుతారని అంచనా



తొలిపావంచా వద్ద ఏర్పాట్లు

సింహాచలం (విశాఖ జిల్లా): ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని సింహగిరి ప్రదక్షిణ శనివారం అంగరంగ వైభవంగా జరగనుంది. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి విశాఖ నగరంలో 32 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. ఆ గిరి చుట్టూ ఏటా లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ఈ సారి సుమారు ఐదు లక్షల మంది గిరి ప్రదక్షిణ చేస్తారని విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేసింది. కలెక్టర్ హరేంధీర ప్రసాద్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నారు. నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అలాగే 21న ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహగిరిపై తెల్లవారుజామున మూడు గంటల నుంచి జరిగే ఆలయ ప్రదక్షిణకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు.

నకిలీ ఆధార్‌లతో శ్రీవారి సేవా టికెట్లు

పోలీసుల అదుపులో బెంగళూరు వ్యక్తి

తిరుమల: నకిలీ ఆధార్ కార్డుతో శ్రీవారి సుప్రభాత సేవకు వెళ్లిన భక్తుడిని గురువారం విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు చెందిన శ్రీధర్ అనే వ్యక్తి 20 సార్లు లక్కీ డిప్ విధానంలో సుప్రభాత సేవా టికెట్లు పొంది స్వామివారిని దర్శించుకున్నాడు. దీంతో అతనిపై అనుమానం వచ్చి టీటీడీ విజిలెన్స్ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ విచారణలో నకిలీ ఆధార్ కార్డుల ద్వారా లక్కీ డిప్ విధానంలో ఇప్పటివరకు 400 సార్లు సేవా టికెట్ల కోసం శ్రీధర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించారు. అలా వేర్వేరు నకిలీ ఆధార్‌కార్డు నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోగా 20 సార్లు అతనికి లక్కీడిప్ విధానంలో సుప్రభాత సేవా టికెట్లు పొందినట్లు గుర్తించారు. ఇతనిపై కేసు నమోదు చేసి నోటీసును పోలీసులకు పంపించారు. అధికారుల ఫిర్యాదు మేరకు తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో కాలయాపన

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం పంపించారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి నాలుగు నెలల వ్యయానికి అసెంబ్లీ ఆమోదం పొందింది. ఈ నెలాఖరుతో ఈ గడువు పూర్తి కానుంది. సాధారణంగా అధికారంలోకి రాగానే కొత్త ప్రభుత్వాలు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాయి. అయితే కూటమి సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా తప్పించుకునేందుకు పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు సన్నద్ధమైనట్లు స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టగా ఈ నెల 23వ తేదీన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. రాష్ట్రంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేని అసాధారణ పరిస్థితులేమీ లేవు. పైగా కేంద్రం నుంచి రాబడులు, రాష్ట్ర ఆదాయాలు ఎంతనేవి స్పష్టంగా ఉన్నాయి. కేంద్ర తరహాలో రాష్ట్ర బడ్జెట్‌లో పన్నులు వేయడాలు లాంటివి ఉండవు. అయినా సరే చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా కాలయాపనకు సిద్ధమైనట్లు వెల్లడవుతోంది.



కేటాయింపులు చేయకుండా హామీలకు ఎగనామం

గత ప్రభుత్వంపై నిందలు మోపి బురద చల్లేందుకే చంద్రబాబు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఎత్తుగడ వేశారనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తం అవుతోంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఎన్నికల హామీలకు కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ నెలకు రూ.నాలుగు వేల చొప్పున ఇస్తానని చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో ప్రకటించారు. ఇప్పుడు ఆ ఊసే మరిచారు. తల్లికి వందనం, దీపం, ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, యువగళం లాంటి పథకాలకు కేటాయింపులు చేయకుండా ఉండేందుకే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఎంచుకున్నట్లు స్పష్టం అవుతోంది. మరోవైపు ఎక్సైజ్, ఆర్థిక, శాంతి భద్రతలపై శ్వేతపత్రాలను అసెంబ్లీ వేదికగా విడుదల చేయడం ద్వారా వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేయడానికి వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. ఐదు రోజులు పాటు సమావేశాలను నిర్వహించాలని, ఈ నెల 25 లేదా 26వ తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆమోదం పొందాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

సీసీ కెమెరాలన్నీ పని చేయాలి

శాసన సభ సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట బందోబస్తు కల్పించాలని స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, శాసన మండలి అధ్యక్షుడు కె.మోషేన్ రాజు ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై శుక్రవారం అసెంబ్లీ భవనంలో పోలీసు ఉన్నతాధికారులతో వారు చర్చించారు. అన్ని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మండలి చైర్మన్ సూచించారు. అసెంబ్లీ గ్యాలరీల్లోకి ప్రవేశించే వారిని పూర్తిగా తనిఖీ చేశాకే అనుమతించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. ఈసారి 88 మంది కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులు, తొమ్మిది మంది శాసన మండలి సభ్యులు హాజరు కానున్న నేపథ్యంలో వారిని గుర్తించేందుకు ప్రవేశ ద్వారాల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. సమావేశంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- చంద్రబాబు, లోకేశ్‌పై ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ధ్వజం
- దాడులు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలతో రాష్ట్రం అరాచకంగా మారింది
- రషీద్ హత్య టీడీపీ అరాచకాలకు పరాకాష్ఠ
- టీడీపీ దాడులపై ఢిల్లీ స్థాయిలో గళమెత్తుతాం



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ బీహార్‌కంటే ఘోరంగా మారుస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. వారి రెడ్‌బుక్ రాజ్యాంగం మనిషి స్వేచ్ఛగా బతకాలన్న ప్రాథమిక హక్కును హరిస్తోందన్నారు. ఓవైపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు, మరోవైపు అభం శుభం తెలియని చిన్నారులపై అత్యాచారం, హత్యలతో రాష్ట్రం అరాచకంగా మారిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో అరాచకాలపై ఢిల్లీ స్థాయిలో గళమెత్తుతామని తెలిపారు. అవినాశ్ రెడ్డి శుక్రవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలో ఇటీవల అధికార పార్టీ దాడిలో గాయపడిన అబ్బాస్, ప్రతాప్‌రెడ్డి, హాజీవలిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ పిలుపు మేరకు అబ్బాస్, ప్రతాప్‌రెడ్డి, హాజీవలిని పరామర్శించి, వారిలో ధైర్యం కల్పించి, వైఎస్ జగన్ తరపున భరోసా ఇచ్చినట్లు చెప్పారు. వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని చెప్పామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై వరుస దాడులు చేస్తున్నారన్నారు. వినుకొండలో వందల మంది చూస్తుండగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ చేతులు, తల నరకడం టీడీపీ నేతల అరాచకానికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. వేంపల్లిలో వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిని 20 మంది టీడీపీ కార్యకర్తలు హాకీ స్టిక్స్‌తో విచక్షణా రహితంగా కొట్టారని, స్టిక్స్ విరిగిపోతే బండరాళ్లతో తలపై దాడి చేశారన్నారు. బుధవారం పుంగనూరులో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించడానికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపైనా రాళ్లతో దాడులు చేశారన్నారు. తాము గత ఐదేళ్లు ఇదే విధంగా ఆలోచించి ఉంటే తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు ఉండేవారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకత్వం ఏ రోజూ అరాచకాలను ప్రోత్సహించలేదని, ఎంతసేపూ కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించడంపైనే దృష్టి పెట్టిందని తెలిపారు. వినుకొండలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వైఎస్ జగన్‌కు ఉన్న సెక్యూరిటీని 80 శాతం తొలగించారన్నారు. సెక్యూరిటీని తొలగించినా, ఇంకా ఏమి చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆపలేరని ఆయన తెలిపారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ తర్వాత పులివెందులలో 70వేల టన్నుల ఇసుకను టీడీపీ వారు దోచేశారని చెప్పారు. మైన్స్, బార్ల పైనాపడిపోతున్నారని చెప్పారు.

శాకంబరీదేవిగా దుర్గమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో శాకంబరీదేవి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవాలకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన రైతులు, వ్యాపారులు 35 టన్నుల కూరగాయలు, ఆకుకూరలను దేవస్థానానికి విరాళమిచ్చారు. వీటితో ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయాలతో పాటు ఆలయ ప్రాంగణాన్ని, ప్రాంగణంలోని దేవతల ఉపాలయాలను సుందరంగా అలంకరించారు. శాకంబరీదేవిగా ఉన్న దుర్గమ్మను భక్తులు భారీగా దర్శించుకున్నారు. మరోవైపున ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో అమ్మవారికి సారెను పెద్ద ఎత్తున భక్తులు, భక్త బృందాలు సమర్పించగా..భక్తులకు దేవస్థానం కదంబ ప్రసాదాన్ని వితరణ చేసింది. ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణను ఆలయ ఈవో కేఎస్ రామారావు ప్రారంభించారు.

ఏపీలో పొగాకు పరిమాణం 167 మిలియన్ కిలోలు

కొరిటిపాడు (గుంటూరు): ఆంధ్రప్రదేశ్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పొగాకు పంట పరిమాణాన్ని 167 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో 163వ పొగాకు బోర్డు సమావేశం చైర్మన్ యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాంత నేలల వారీగా పంట కాలానికి పొగాకు పంట పరిమాణం 167 మిలియన్ కిలోలుగా నిర్ణయించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ పంచహారతుల సేవకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు వేర్వేరుగా శుక్రవారం హాజరయ్యారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. పంచహారతుల సేవలో పాల్గొన్న సమీరా నజీర్, సాంబశివరావు నాయుడు అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)



జస్టిస్ సాంబశివరావు నాయుడుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్‌బాబు

మా స్థలం రోడ్డుకు తీసుకుంటే మేం ఎలా బతకాలి

కుప్పంలో మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారి

కుప్పం(చిత్తూరు జిల్లా): 'కుప్పంలోని కూర్మాయిపురంలో మాకున్న చిన్న స్థలాన్ని రోడ్డుకు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మాకు ఆధారమైన ఆ స్థలం ఇచ్చి ముగ్గురు పిల్లలతో నేను ఎలా బతకాలి..' అంటూ ఓ మహిళ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... కుప్పం కూర్మాయిపురంలో కుమారి అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. ఆమెకు స్థానికంగా చిన్న స్థలం (28 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవు) ఉంది. ఆమె స్థలం మీదుగా రోడ్డు సదుపాయం కల్పించాలని చుట్టుపక్కల ప్రజలు అధికారులను కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ స్థలం యజమాని కుమారికి నోటీసులు జారీచేశారు. దీంతో తమ పరిస్థితి ఏమిటని మనస్తాపానికి గురైన కుమారి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆమెను బంధువులు కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించారు. 'నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నాం. 30 ఏళ్లుగా మాకు ఉన్న చిన్న స్థలంలో రోడ్డు ఎలా వదలాలి. మా గోడు వినేవారు లేరు...' అంటూ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు.

శ్మశానం కబ్జాకు యత్నం..తిరగబడిన దళితులు

- పోలీసుల రంగప్రవేశం

రాజంపేట: శ్మశానస్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నించిన టీడీపీ వర్గీయులపై దళితులు తిరగబడిన ఘటన అన్నమయ్య జిల్లా ములక్కాయపల్లెలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..సర్వే నంబరు 1,713లో 0.20 సెంటు భూమిని దళితవాడకు శ్మశానస్థలంగా కేటాయిస్తూ గత సంవత్సరం ప్రభుత్వ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులుగా ఉన్న కొందరు ఈ స్థలంపై కన్నేశారు. శుక్రవారం స్థలానికి ముళ్లకంచె వేసి కబ్జాకు యత్నించారు. ఇది తెలుసుకున్న దళితులు మూకుమ్మడిగా స్థలం వద్దకు చేరుకుని టీడీపీ వర్గీయులు వేసుకున్న ముళ్లకంచెను తొలగించారు. దీంతో టీడీపీ వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోయారు. దళితులపై బెదిరింపులకు దిగారు. సమాచారం తెలుసుకున్న మన్నూరు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలకు సర్ది చెప్పడంతో ప్రస్తుతానికి గొడవ సద్దుమణిగింది. అయితే తమ శ్మశానవాటికను కబ్జా చేసేందుకు టీడీపీకి చెందిన కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఇప్పటికే ములక్కాయపల్లె దళితులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. స్థలాన్ని కబ్జా కానివ్వమని, జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లి పోరాడుతామని వెల్లడించారు



శ్మశానం వద్ద దళితులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు



టీడీపీ వర్గీయులు కబ్జా చేయడానికి పూనుకున్న దళితుల శ్మశానవాటిక ఇదే

టీడీపీ నేత అండతో శ్మశానం కబ్జా

- కూటమి ప్రభుత్వం వచ్చాక యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- తిరుపతి అర్బన్ తహశీల్దార్‌కు తిమ్మి నాయుడుపాలెం గ్రామస్తుల ఫిర్యాదు

తిరుపతి మంగళం: 'మా తాతముత్తాల నుంచి తిరుపతి తిమ్మినాయుడుపాలెం గ్రామంలో దళితవాడ ఎదురుగా సర్వే నంబర్ 199లోని 1.49 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికగా వినియోగించుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా గ్రామంలోని టీడీపీ నాయకుడు వెంకటరత్నం అండతో కొందరు శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారు. అక్రమంగా షెడ్లు నిర్మించారు. వెంటనే అడ్డుకోండి..' అని తిమ్మినాయుడుపాలెం గ్రామస్తులు శుక్రవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన శ్మశాన స్థలంలోని ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తిమ్మినాయుడుపాలెం ప్రజలు వందేళ్లుగా వినియోగించుకుంటున్న శ్మశాన స్థలంలో ఇటీవల కొందరు టీడీపీ నాయకులతో కలసి ఆక్రమించుకుని అందులో షెడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. దీంతో తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే ఖననం చేయడానికి స్థలం లేక నానా అవస్థలు పడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్నవారు కొత్తగా అటవీశాఖ భూమిని శ్మశానం కోసం కేటాయించాలని కోరుతున్నారని తెలిపారు. మరోవైపు ఆక్రమణదారులు మళ్లీ నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కొత్త నిర్మాణాలను అడ్డుకోవడంతోపాటు ఉన్న వాటిని తొలగించి తమ గ్రామానికి శ్మశాన స్థలాన్ని అప్పగించాలని కోరారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తిమ్మినాయుడుపాలెం గ్రామస్తులు



శ్మశాన స్థలంలో నిర్మించిన రేకుల షెడ్ల పక్కన మరిన్ని రేకుల షెడ్లు నిర్మించేందుకు గాడులు తీసిన ఆక్రమణదారులు

ఎంపీడీవో అదృశ్యంపై వీడని మిస్టరీ



ఇన్‌చార్జి ఎంపీడీవో నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు అదృశ్యం కేసులో మిస్టరీ ఇంకా వీడలేదు. ఎంపీడీవో అదృశ్యమై శుక్రవారం నాటికి ఐదు రోజులు గడిచినా.. కేసులో ఎటువంటి పురోగతి సాధించలేదు. కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన పోలీసు అధికారులు శుక్రవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీడీవో అదృశ్యానికి సంబంధించి ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, ఎంపీపీ మైలాబత్తుల సోని, కార్యాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. మాధవాయిపాలెం ఫెర్రీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫెర్రీ లీజుదారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తం ఎంత, ఆ మొత్తం బకాయి పడటానికి గల కారణాలేమిటనే వివరాలను పోలీసు అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. ఈ కేసు విషయంలో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుపై కావాలని కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోయారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దుష్ప్రచారాన్ని పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎంపీడీవో అదృశ్యం కేసును ఛేదించాలని కోరారు.

బాల్యం 'సెల్'లో బందీ



బాల్యం 'సెల్'లో బందీ అయిపోతోంది. ప్రపంచం అరచేతిలో ఇమిడిపోయేంతగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని ఆనందపడాలో.. దీనికి బాల్యం బందీ అయిపోతోందని బాధపడాలో తెలియని దుస్థితిలోకి సమాజాన్ని నెట్టేస్తోంది. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో ఆరుగురు పిల్లలు వర్షంలోనూ ఆరుబయట సెల్‌ఫోన్‌తో ఇలా కాలక్షేపం చేస్తూ కనిపించారు. 'రేపటి పౌరులు ఇలా తమను తాము మైమరచి.. అందమైన బాల్యాన్ని బలి పెడుతోంది. ఇది ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో'నని ఆందోళన చెందటం చూపరుల వంతైంది.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి మంగళం/కొమరోలు : ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలో 28 ఎర్రచందనం దుంగలతో పాటు, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన స్మగ్లర్లను తిరుపతి కపిలి తీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకొచ్చి కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం, అటవీ సిబ్బంది సహకారంతో గురువారం ప్రకాశం జిల్లా కొమరోలు మండలం వైపు నుంచి తనిఖీలు నిర్వహించింది. గురువారం అర్ధరాత్రి ఆ బృందం సభ్యులు ప్రకాశం టెరిటోరియల్ ఫారెస్ట్ డివిజన్ బెస్తవారిపేట రేంజి తాటిచెర్ల సెక్షన్, నల్లకుంట్ల అటవీ బీటు పరిధిలోని అక్కాపల్లి చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ కొందరు ఓ కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండటాన్ని గమనించి వారిని చుట్టుముట్టారు. వారు వాహనం వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా.. వెంబడించి ముగ్గురిని పట్టుకోగలిగారు. కింద 11 దుంగలు, కారులో 17 దుంగలు లభించాయి. వాటి విలువ రూ.25 లక్షల వరకూ ఉంటుంది. వాటిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. పట్టుబడిన వారు ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పేరం రామరాజు, రాచకొండ రామయ్య, షేక్ ఖాసింలుగా గుర్తించారు. రామరాజుకు తమిళనాడుకు చెందిన స్మగ్లర్లతో సంబంధాలున్నట్లు తేలింది. సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ నిందితులతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

స్వర్ణాల చెరువులో జనకెరటం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు జనం పోటెత్తారు. శుక్రవారం ఉదయం నుంచి స్వర్ణాల చెరువు జనసంద్రంగా మారింది. రొట్టెల ఘాట్లు భక్తులతో కిటకిటలాడాయి. రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం తెల్లవారుజామున వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి లక్షమందిపైగానే భక్తులు హాజరయ్యారు. కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్‌గా రొట్టెల పండుగను వీక్షించి మాట్లాడారు. దర్గా అభివృద్ధికి రూ.5.కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు హాజరయ్యారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల/శ్రీకాళహస్తి: సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లి శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున కుటుంబసభ్యులతో కలసి ఆమె అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆమెకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాన్ని, ఆలయాధికారులు ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.అలాగే, కాగా, జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని కూడా జస్టిస్ హిమ కోహ్లి దర్శించుకుని రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. శ్రీవారిని ఇండియాస్ ఫిట్‌నెస్ ఎక్స్‌పర్ట్ డినాజ్ వెర్వట్‌వాల, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, టీటీడీ మాజీ చైర్మన్ టి.సుబ్బరామిరెడ్డి కూడా దర్శించుకున్నారు.

21న పౌర్ణమి గరుడసేవ.. పెద్దజీయర్‌స్వామి చాతుర్మాస దీక్ష

గురు పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో జూలై 21న ఆదివారం గరుడ సేవ జరుగనుంది. ఆ రోజు రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు. అలాగే, 21న తిరుమల పెద్దజీయర్ స్వామి నేతృత్వంలో చాతుర్మాస దీక్ష సంకల్పం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెద్దజీయంగారు తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కన ఉన్న జీయంగారి మఠం నుంచి చిన్నజీయంగారు, శిష్య బృందంతో కూడి వరాహ స్వామి ఆలయాన్ని, స్వామి పుష్కరిణిని సందర్శించి..శ్రీవారి ఆలయానికి విచ్చేస్తారు. వీరిని ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో, ఇతర ఆలయాధికారులు ఆహ్వానిస్తారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత రంగనాయకుల మండపంలో తిరుమల పెద్దజీయంగారికి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయంగారికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరిస్తారు.

భారత్-యూఏఈల మధ్య బలమైన ఆర్థిక సంబంధాలు

యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ రవికుమార్‌రెడ్డి



ఒప్పంద సమావేశానికి హాజరైన ఇరువర్గాల ప్రతినిధులు

పటమట (విజయవాడతూర్పు): భారత్-యూఏఈల మధ్య బలమైన ఆర్థిక సంబంధాలు కొనసాగుతాయని అసోచామ్ ఆంధ్రప్రదేశ్-తెలంగాణ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ రవికుమార్‌రెడ్డి కటారు తెలిపారు. విజయవాడలోని ఓ హోటల్‌లో అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), షార్జా ప్రభుత్వం, యూఏఈ సహకారంతో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వాణిజ్య-పరిశ్రమల సమాఖ్య మద్దతుతో 'యూఏఈ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించడం' అంశంపై ఈనెల 17 నుంచి జరుగుతున్న బీ2బీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించినట్టు రవికుమార్ రెడ్డి తెలిపారు. యూఏఈ ఇతర మధ్యప్రాచ్య దేశాల్లో కార్యకలాపాలు చేయడానికి అందుబాటులో ఉన్న అనేక ప్రయోజనాలు, ప్రోత్సాహకాల పట్ల భారతీయ వ్యాపారాలకు అవగాహన కల్పించే లక్ష్యంగా ఈ సమావేశాలు జరిగాయని పేర్కొన్నారు. యూఏఈలో వ్యాపార/పెట్టుబడి అవకాశాలు, అక్కడ కంపెనీల్లో పెట్టుబడి పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, విదేశీ కంపెనీలకు లభించే ప్రోత్సాహకాలతో పాటుగా భారతీయ కంపెనీలు తమ మార్కెట్ పరిధిని ఎలా విస్తరించుకోవచ్చో నిపుణులు వెల్లడించారని పేర్కొన్నారు.



బగ్ దెబ్బకు 'విండోస్' క్లోజ్!

విశ్వవ్యాప్తంగా స్తంభించిన మైక్రోసాఫ్ట్ సేవలు

- విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థల సేవల్లో తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు పడ్డ కోట్లాది మంది యూజర్లు, ప్రయాణికులు
- 'క్రౌడ్‌స్ట్రయిక్' అప్‌డేట్ వల్లే ఇదంతా: మైక్రోసాఫ్ట్ వివరణ

వాషింగ్టన్/వెల్లింగ్టన్/న్యూఢిల్లీ/ఫ్రాంక్‌ఫర్ట్: టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఒక చిన్న అప్‌డేట్ పెద్ద సమస్యను సృష్టించింది. విండోస్‌కు సెక్యూరిటీ సేవలు అందించే 'క్రౌడ్‌స్ట్రయిక్' సైబర్ సెక్యూరిటీ సంస్థ చేసిన ఫాల్కన్ సెన్సార్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో లోపం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌తో పనిచేసే కంప్యూటర్లలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పలు విమానయాన, బ్యాంకింగ్, మీడియా సంస్థలుసహా రైల్వే, టీవీ, రేడియో, ఆస్పత్రి సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో కోట్లాది మంది జనం, యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసెస్ స్తంభించడంతో ఈ సమస్య తలెత్తింది. అయితే అవిశ్రాంతంగా శ్రమించి సమస్యను దాదాపు పరిష్కరించామని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. ''ఇది భద్రతాలోపం, సైబర్ దాడి కాదు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తప్పుడు అప్‌డేట్‌ను రన్ చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని గుర్తించాం. సమస్యను 'ఫిక్స్' చేసేందుకు ప్రయత్నిస్తున్నాం''అని క్రౌడ్‌స్ట్రయిక్ సీఈఓ జార్జ్ కుర్జ్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

ఆగిన సేవలు.. మొదలైన కష్టాలు


అమెరికాలోని బాల్టిమోర్ ఎయిర్‌పోర్టులో

విమానయాన సంస్థలు తమ కంప్యూటర్లు/పీసీ స్క్రీన్‌లను యాక్సెస్‌చేయలేకపోవడంతో ప్రయాణికులు తమ టికెట్ల బుకింగ్/చెక్ ఇన్ సేవలను పొందలేకపోయారు. విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికులు కౌంటర్‌ల వద్ద చాంతాడంత లైన్లలో బారులుతీరారు. అమెరికా, భారత్, బ్రిటన్, న్యూజిలాండ్, హాంకాంగ్, జర్మనీ, కెన్యా, స్విట్జర్లాండ్, ఇటలీ, ఆస్ట్రేలియాలోని విమానయాన సంస్థలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. శుక్రవారం గంటల తరబడి విమానాలు ఆలస్యం/క్యాన్సిల్ కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే నిద్రించారు. అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్, అమెరికన్ ఎయిర్‌లైన్స్, డెల్టా, అలీజియంట్ విమానయాన సంస్థలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాయి. వారాంతం ఆనందంగా గడుపుదామనుకున్న శుక్రవారం పలు దేశాల ప్రజలను చేదు అనుభవంగా మిగిలిపోయింది. భారత్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాల విమానయాన సంస్థలు మ్యాన్యువల్‌గా బోర్డింగ్ పాస్‌లు ఇచ్చి సమస్యను ఒకింత పరిష్కరించుకున్నాయి.

రైల్వే, టెలివిజన్ సేవలకూ అంతరాయం

బ్రిటన్‌లో రైల్వే, టెలివిజన్ స్టేషన్లు కంప్యూటర్ సమస్యలతో ఇబ్బందులు పడ్డాయి. తమ దేశంలోని పోస్టాఫీసులు, ఆస్పత్రుల సేవలు ఆగిపోయాయని ఇజ్రాయెల్, బ్రిటన్, జర్మనీ తెలిపాయి. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోని రెగ్యులేటరీ న్యూస్ సర్వీస్ అనౌన్స్‌మెంట్స్, నేషనల్ హెల్త్ సర్వీస్‌లు ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోయాయని బ్రిటన్ ప్రకటించింది. ఆస్ట్రేలియాలో ఏబీసీ, స్కైన్యూస్ వంటి టీవీ, రేడియో చానళ్ల ప్రసారాలు ఆగిపోయాయి.

బ్యాంకింగ్ సేవలకూ దెబ్బ

తమ దేశంలో దేశవ్యాప్తంగా ప్రధాన బ్యాంక్ సేవలు స్తంభించిపోయాయని దక్షిణాఫ్రికా తెలిపింది. బ్యాంక్‌ల వద్దే కాదు, గ్యాస్‌స్టేషన్లు, సరకుల దుకాణాల వద్ద క్రెడిట్, డెబిట్ కార్డులు పనిచేయడం మానేశాయి. ఏఎస్‌బీ, కివిబ్యాంక్ సేవలు ఆగిపోయాయని న్యూజిలాండ్ తెలిపింది. పేమెంట్ వ్యవస్థలు, వెబ్‌సైట్లు, యాప్స్ పనిచేయడం లేదని న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తెలిపాయి.

భారత్‌లో పరిస్థితి ఏంటి?


చేతితో రాసిచ్చిన బోర్డింగ్ పాస్

భారత్‌లో ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఆకాశ ఎయిర్ విమానయాన సంస్థలు ఆన్‌లైన్ చెక్ ఇన్ సమస్యలను ఎదుర్కొన్నాయి. చాలా ఎయిర్‌పోర్ట్‌ల వద్ద పలు విమానాల సర్వీస్‌లు రద్దయ్యాయి. దాదాపు 200 ఇండిగో విమానసర్వీస్‌లు రద్దయ్యాయి. ఆఫ్‌లైన్‌లో మ్యాన్యువల్‌గా లగేజ్ 'చెక్ ఇన్', బోర్డింగ్ పాస్‌లు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. లగేజీ చెక్ చేసి బోర్డింగ్ పాస్ రాసివ్వడానికి ఒక్కో వ్యక్తికి 40 నిమిషాలు పట్టిందని కొందరు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 29 విమానాలు రద్దయ్యాయి.ఇందులో ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కత్తాతో పాటు వివిధ నగరాలకు రాకపోకలు సాగించే విమానాలూ ఉన్నాయి. కొన్ని విమానాలు 1–2 గంటలు ఆలస్యంగా నడిచాయి. విమానాల రద్దయినప్పటికి విమాయనయాన సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రకటనలు చేయకపోవడంతో ప్రయాణికులు వెనుదిరిగారు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వంటి స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లు, బ్రోకరేజ్ సంస్థలు, బ్యాంక్‌ల వంటి ఆర్థికరంగ సంస్థల కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం పడలేదు. దేశంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) నెట్‌వర్క్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని కేంద్ర ఐటీ మంత్రి ప్రకటించారు.

పేలిన జోకులు

కంప్యూటర్లు మొరాయించడంపై సామాజిక మాధ్యమాల్లో జోకులు పేలాయి. శుక్రవారం ఉదయం నుంచే ఐటీ ఉద్యోగులకు వారాంతం మొదలైందని నెటిజన్లు వ్యాఖ్యానించారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మైక్రోసాఫ్ట్ సంస్థ పెద్ద తలనొప్పి సంస్థ అంటూ కొత్త భాష్యం చెప్పారు. '' ఇది మైక్రో'సాఫ్ట్' కాదు. మాక్రో'హార్డ్'. మైక్రోసాఫ్ట్ వాళ్ల అన్ని సర్వీస్‌లు ఆగిపోయాయి ఒక్క నా 'ఎక్స్' తప్ప' అని తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యంగ్యంగా పోస్ట్‌చేశారు.

ఏమిటీ బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్?:

కంప్యూటర్లపై బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ దర్శనమిచ్చింది. ఈ ఎర్రర్ కనిపించాక కంప్యూటర్ రీస్టార్ట్ అవడంగానీ షట్‌డౌన్ అవడంగానీ జరుగుతోంది. విండోస్ అప్‌డేట్ అడిగితే చేయొద్దని, పొరపాటున చేస్తే ఆపరేటింగ్ సిస్టమ్‌ను తొలగించి మళ్లీ ఇన్‌స్టాల్ చేయాల్సిన పరిస్థితి వస్తుందని నిపుణులు తెలిపారు. మైక్రోసాఫ్ట్ సంస్థ ఈ సమస్యకు పరిష్కారం కనుక్కున్నాకే కంప్యూటర్లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ ఉల్లంఘనలు, హ్యాకింగ్‌ను రియల్‌టైమ్‌లో అడ్డుకునేందుకు క్రౌడ్‌స్ట్రయిక్ సంస్థ తమ సైబర్‌సెక్యూరిటీ సేవలను మైక్రోసాఫ్ట్‌కు ఇస్తోంది. సొంతంగా మ్యాన్యువల్‌గా సమస్య పరిష్కారానికి ప్రయత్నించేవాళ్లకు క్రౌడ్‌స్ట్రయిక్ ఒక చిట్కా చెప్పింది. విండోస్10లో బ్లూస్క్రీన్ ఎర్రర్‌ను ఎలా ట్రబుల్ షూట్ చేయాలో వివరించింది. సిస్టమ్‌ను సేఫ్ మోడ్‌లో లేదా విండోస్ రికవరీ ఎన్విరోన్‌మెంట్‌లో ఓపెన్ చేయాలి. తర్వాత C:/W indowsystem32/d rivers/C rowdStrikeలోకి వెళ్లాలి. అందులో C-00000291•. sys అనే ఫైల్‌ను డిలీట్ చేయాలి. తర్వాత సాధారణంగా సిస్టమ్‌ను బూట్ చేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

దేవుడు నా వైపే.. గెలుపు నాదే

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ధీమా

తూటాల దాడి జరిగినా నా సంకల్పం చెక్కుచెదరలేదు	అధికారం అప్పగించండి మిమ్మల్ని తలెత్తుకొనేలా చేస్తా

- అమెరికాను సురక్షితమైన, బలమైన దేశంగా మార్చడమే ధ్యేయం
- మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ సదస్సులో ట్రంప్ ప్రసంగం


గురువారం రాత్రి రిపబ్లికన్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తున్న డొనాల్డ్ ట్రంప్

మిల్వాకీ: హత్యాయత్నం నుంచి త్రుటిలో తప్పించుకున్న అమెరికా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్(78) సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. భగవంతుడు తనవైపు ఉండడం వల్లే పెద్ద ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డానని చెప్పారు. భగవంతుడి దయతోనే మళ్లీ జనం ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మరో నాలుగు నెలల్లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. హత్యాయత్నం ఘటన తర్వాత తొలిసారిగా మిల్వాకీలో గురువారం రాత్రి జరిగిన రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో ట్రంప్ భావోద్వేగంతో ప్రసంగించారు. రిపబ్లికన్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను లాంఛనంగా ఆమోదించారు. తూటాల దాడి జరిగినా తన సంకల్పం చెక్కుచెదరలేదని, అమెరికా ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడాలన్న నా తపనను ఏ ప్రమాదం, ఏ అవరోధం అడ్డుకోలేవని తేల్చిచెప్పారు. హత్యాయత్నం తర్వాత తనపై ప్రేమాభిమానాలు కురిపించి, మద్దతు ప్రకటించిన ప్రజలకు ట్రంప్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆత్మవిశ్వాసం, ఆశ, బలం అనే సందేశాన్ని మోసుకొని ఈరోజు అమెరికన్ల ముందుకు సగర్వంగా వచ్చానని అన్నారు. పార్టీ సదస్సులో ట్రంప్ ఇంకా ఏం మాట్లాడారంటే...

నూతన యుగానికి ఆరంభం

''మరో నాలుగు నెలల్లో మనం అద్భుతమైన విజయం సొంతం చేసుకోబోతున్నాం. అమెరికా చరిత్రలో నాలుగు అతిగొప్ప సంవత్సరాలకు శ్రీకారం చుట్టబోతున్నాం. మతం, రంగు, జాతితో సంబంధం లేకుండా ప్రజలందరికీ భద్రత, సౌభాగ్యం, స్వేచ్ఛ కల్పించే నూతన యుగాన్ని మనమంతా కలిసికట్టుగా ఆరంభిద్దాం. మన సమాజంలో ప్రజల మధ్య అడ్డుగోలకు తావు లేకుండా చేద్దాం. అమెరికన్లుగా మనది ఒకేబాట, ఒకేమాట. మనం ఐక్యమత్యంగా ఉండాలి. అందరం కలిసి పైకి ఎదగాలి. కలిసి ఉండలేకపోతే నష్టపోతాం. సగం అమెరికాకు కాదు, మొత్తం అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు బరిలో నిల్చున్నా.

మనం ఒకే దేశం బిడ్డలం

నాపై హత్యాయత్నం జరిగిన సంగతి అందరికీ తెలుసు. అసలేం జరిగిందని చాలామంది అడుగుతున్నారు. నా శరీరం నుంచి అంగుళంలో మూడోవంతు దూరంలో తుపాకీ తూటా దూసుకెళ్లింది. నా తల రక్తంతో తడిసిపోయింది. దేవుడి దయతో ప్రాణాలతో బయటపడ్డా. ఈ విషయం మరోసారి నేను పంచుకోలేను. ఎందుకంటే అది చాలా బాధాకరమైన అనుభవం. మాటల్లో చెప్పలేనిది. నాపై క్రూరమైన దాడి జరిగిన తర్వాత మన ఐక్యత మరింత పెరిగింది. మన సంకల్పం, ఉద్దేశం ఏమాత్రం మారలేదు. అమెరికాను మరోసారి గెలిపించాలి. అమెరికాను మళ్లీ సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన గొప్పదేశంగా మార్చాలి. మనం ఒకే దేశం బిడ్డలం. రాజకీయపరమైన అంశాలు మన మధ్య విభజన రేఖలు గీయకూడదు.

ఈ ఎన్నికలు అత్యంత కీలకం

యావత్తు దేశానికి ఒక దార్శనికతను నిర్దేశించడానికి ఇక్కడికి వచ్చా. ఈ సందర్భంగా దేశంలో ప్రతి పౌరుడికీ స్నేహ హస్తం అందిస్తున్నా. వారికి విధేయత ప్రకటిస్తున్నా. ప్రపంచం ఎన్నడూ చూడని విధంగా అమెరికాను నూతన శిఖరాల వైపు నడిపిద్దాం. నా నాయకత్వంలో అమెరికా మళ్లీ గౌరవం పొందుతున్న విశ్వాసం ఉంది. మన బల సంపన్నతను ఏ దేశమూ ప్రశ్నించలేదు. మన శక్తి సామర్థ్యాలను ఏ శత్రువూ అనుమానించలేరు. మన సరిహద్దులు భద్రంగా ఉంటాయి. మన ఆర్థిక వ్యవస్థ ఉజ్వలంగా మారుతుంది. మన భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవాలంటే విఫలమైన నాయకత్వం నుంచి దేశాన్ని తొలుత రక్షించుకోవాలి. అమెరికా చరిత్రలో ఈ ఎన్నికలు అత్యంత కీలకం.

శత్రుదుర్భేద్యంగా మారుస్తా

అక్రమ వలసలు అమెరికాకు పెద్ద సమస్యగా మారాయి. దక్షిణ సరిహద్దు నుంచి పోటెత్తుతున్న వలసలు, చొరబాట్లు దేశమంతటా కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అక్రమ వలసల కారణంగా నేరాలు, పేదరికం, వ్యాధులు, విధ్వంసం పెరుగుతున్నాయి. ప్రపంచమంతటా ఇలాంటి వలసల సంక్షోభం కనిపిస్తోంది. మరోవైపు యూరప్, మధ్యప్రాచ్యంలో యుద్ధాలు కొనసాగుతున్నాయి. తైవాన్, కొరియా, ఫిలిప్పైన్స్‌లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. కేవలం ఆసియా ఖండమే కాదు, మొత్తం భూగోళం నేడు మూడో ప్రపంచ యుద్ధం అనే అంచుపై ఉందని చెప్పక తప్పదు. ఈ పరిస్థితి మారాలన్నదే నా ఆశ. తైవాన్‌ను చైనా చుట్టుముడుతోంది. అమెరికా సమీపంలో రష్యా యుద్ధ నౌకలు, అణు జలాంతర్గాములు చెక్కర్లు కొడుతున్నారు. ఈ విషయాలు ప్రస్తావించేందుకు మీడియా ఇష్టపడడం లేదు. నేను అధికారం చేపట్టిన తర్వాత మన భూభాగాలను శత్రు దుర్భేద్యంగా మారుస్తా.

మార్పునకు సమయమిదే

అమెరికాలో మార్పునకు సమయం ఆసన్నమైంది. ఇప్పుడున్న పరిపాలనను మరో నాలుగేళ్లు మనం భరించలేం. అందుకే మార్పునకు పట్టం కట్టాలి. అమెరికా పౌరుల ఎదుట ఈ క్షణాన ప్రతిజ్ఞ చేస్తున్నా. ద్రవ్యోల్బణ సంక్షోభాన్ని అంతం చేస్తా. వడ్డీ రేట్లను తగ్గిస్తా. మన సరిహద్దును మూసివేస్తా. గోడ నిర్మాణం పూర్తిచేస్తా. అక్రమ వలసలకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తా. ఉక్రెయిన్–రష్యా యుద్ధం, ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి శుభం కార్డు వేసేస్తాం. నేను అధికారంలో ఉండి ఉంటే ఈ యుద్ధాలు అసలు జరిగేవే కాదు. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో నా విజయానికి సహరించాలని అందరినీ సవినయంగా కోరుతున్నా. మిమ్మల్ని తలెత్తుకొనేలా, గర్వపడేలా చేయడమే నా ధ్యేయం.

బైడెన్ కంటే కమల బెటర్

మెజారిటీ డెమొక్రాట్ల అభిప్రాయం

వాషింగ్టన్: అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని బైడెన్‌పై ఒత్తిళ్లు తీవ్రమవుతున్న వేళ ఆయన కంటే కమలా హారిస్ మంచి అధ్యక్షురాలు అవుతారని మెజారిటీ డెమొక్రాట్లు భావిస్తున్నారు. ప్రతి 10 మంది డెమొక్రాటిక్ పార్టీ సభ్యుల్లో ఆరుగురు కమలా హారిస్ అగ్ర రాజ్యాధినేతగా రాణించగలరని అభిప్రాయపడ్డారు. ఇద్దరు ఆమె సామర్థ్యంపై అపనమ్మకం వెలిబుచ్చగా, మరో ఇద్దరు ఎటూ చెప్పలేమని, తమకు అంతగా తెలియదని చెప్పుకొచ్చారు. ఏపీ–ఎన్ఓఆర్‌సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్ నిర్వహించిన పోల్‌లో డెమొక్రాట్లు ఈ మేరకు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ట్రంప్‌తో జూన్ 27న జరిగిన తొలి అధ్యక్ష చర్చలో బైడెన్ తడబడటం, మతిమరపుతో పేలవ ప్రదర్శన కనబర్చిన విషయం తెలిసిందే. అప్పటినుంచి ట్రంప్‌ను ఓడించాలంటే అది కమలకే సాధ్యమవుతుందని, బైడెన్ స్థానంలో ఆమె తమ అధ్యక్ష అభ్యర్థి కావాలని డెమొక్రాట్లు డిమాండ్లు వినిపిస్తున్నారు. ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ.. బైడెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడమే పార్టీకి మేలని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. బైడెన్ కొనసాగితే వైట్‌హౌస్‌ను కోల్పోవడమే కాకుండా ప్రతినిధుల సభ, సెనేట్‌లోనూ డెమొక్రాటిక్ పార్టీకి ఎదురుదెబ్బ తగులుతుందని సీనియర్లు ఆందోళన చెందుతున్నారు.

వైదొలగడం లేదు: ప్రచార సారథి

జో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగడం లేదని ఆయన ప్రచారబృందం సారథి జెన్ ఒమాలీ డిల్లాన్ శుక్రవారం స్పష్టం చేశారు. అయితే బైడెన్‌కు మద్దతు తగ్గుతున్న విషయాన్ని అంగీకరించారు. 'ఆయనకు 81 ఏళ్లనేది నిజమే.. కానీ ఆయన గెలవగలరని అమెరికా ప్రజల్లో తిరిగి నమ్మకాన్ని పాదుకొల్పడానికి మేము చేయాల్సింది ఎంతో ఉంది' అని డిల్లాన్ అన్నారు. బైడెన్ ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నప్పటికీ ఓటర్లు ట్రంప్‌కు ఓటు వేసేందుకు మొగ్గు చూపడం లేదని ఆమె పేర్కొన్నారు.

అమెరికా విలేఖరికి 16 ఏళ్ల జైలు శిక్ష



యెకటెరిన్‌బర్గ్ (రష్యా): అమెరికా కోసం రహస్య పత్రాలు సేకరిస్తూ గూఢచర్యానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ప్రఖ్యాత వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు చెందిన 32 ఏళ్ల రిపోర్టర్ ఇవాన్ గెర్ష్‌కోవిచ్‌కు రష్యా న్యాయస్థానం 16 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీనిని పూర్తిగా కల్పిత సాక్ష్యాలతో సృష్టించిన తప్పుడు కేసుగా అమెరికా అభివర్ణించింది. శుక్రవారం రష్యాలోని సెవెర్డ్‌లోవోస్క్ ప్రాంతీయ కోర్టు జడ్జి ఆంద్రీ మినియేవ్ ఈ తీర్పు చెప్పారు. తీర్పుకు ముందు నీవేమైనా చెప్పేది ఉందా? అని జడ్జి ప్రశ్నించగా లేదు అని ఇవాన్ సమాధానమిచ్చారు. ఇవాన్‌కు 18 ఏళ్ల శిక్ష విధించాలని ప్రభుత్వ లాయర్లువాదించగా జడ్జి 16 ఏళ్ల శిక్ష వేశారు. శిక్ష ఖరారుపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పందించారు. '' జర్నలిస్ట్, అమెరికన్ పౌరుడు అయినందుకే ఇవాన్‌ను బంధించి జైలుపాలుచేశారు. ఐరాస కూడా ఇదే మాట చెప్పింది. అతడిని విడిపించేందుకు అమెరికా తన ప్రయత్నాలు ఇకమీదటా కొనసాగిస్తుంది. పాత్రికేయ వృత్తి నేరం కాబోదు' అని అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక అమెరికా జర్నలిస్టును రష్యా అరెస్టుచేయడం ఇదే తొలిసారి. యురాల్యాగోన్జవోడ్ సిటీలో రష్యా యుద్ధట్యాంకుల తయారీ, రిపేర్ల రహస్య సమాచారాన్ని ఇవాన్ సేకరిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడని ఆరోపిస్తూ 2023 మార్చి 29న ఇవాన్‌ను అరెస్ట్‌చేయడం తెల్సిందే.

పూజపై డిబార్ వేటు!

ట్రైనీ ఐఏఎస్‌పై కఠిన చర్యలకు సిద్ధమైన యూపీఎస్‌సీ
నకిలీ పత్రాలు, అఫిడవిట్లపై క్రిమినల్ కేసు నమోదు



సాక్షి, న్యూఢిల్లీ: అధికార దర్పం ప్రదర్శించేందుకు ప్రయత్నించి వివాదాలకు కేంద్రబిందువుగా మారిన ప్రొబెషనరీ మహిళా ఐఏఎస్ పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్ విషయంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ) సీరియస్‌గా స్పందించింది. 2022 సివిల్ సర్వీసెస్ పరీక్షల నిబంధనల ప్రకారం భవిష్యత్ పరీక్షలు, నియామకాల నుంచి మిమ్మల్ని ఎందుకు డిబార్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసు పంపించింది. ''పరీక్ష రాసే 'అవకాశాలు' ఆమె గతంలోనే దాటేశారు. అయినాసరే అర్హత లేకపోయినా గుర్తింపును దాచి తప్పుడు పత్రాలు సమర్పించి సివిల్స్ రాసి అర్హత సాధించారు'' అని యూపీఎస్‌సీ శుక్రవారం తెలిపింది. ''పాత వివరాలతో అదనంగా ఇంకోసారి పరీక్ష రాయలేనని తెల్సుకుని ఉద్దేశపూర్వకంగా తన పూర్తి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఫోటోగ్రాఫ్, సంతకం, ఇ–మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్, చిరునామా మార్చేసి గుర్తింపు దాచారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినట్లు మా దర్యాప్తులో తేలింది'' అని యూపీఎస్‌సీ ప్రకటించింది. తర్వాత ఆమెపై క్రిమినల్ కేసు మోపి సమగ్ర దర్యాప్తు చేయాలని ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఫోర్జరీ, చీటింగ్, వైకల్య కోటా దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడ్డారంటూ ఐపీసీ, ఐటీ, డిజబిలిటీ చట్టాల కింద ఢిల్లీ నేరవిభాగ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తును మొదలెట్టారు. 2023 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్ అయిన పూజ మహారాష్ట్రలోని పుణె జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణలో ఉన్నపుడు అదనపు సౌకర్యాలు కావాలని, సొంత కారుకు ఎర్రబుగ్గ తగిలించుకుని తిరిగారు. దీంతో ఆమె సివిల్స్‌లో అర్హత సాధించేందుకు చేసిన నేరాలను మీడియా బహిర్గతంచేసింది. దీంతో ఆమెను పుణె నుంచి వాసిమ్ జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా బదిలీచేసింది. యూపీఎస్‌సీ షోకాజ్ నోటీసు నేపథ్యంలో శుక్రవారం ఆమె వాసిమ్ కలెక్టరేట్‌లో పదవిని వదిలి వెళ్లిపోయారు. యూపీఎస్‌సీకి వచ్చే దరఖాస్తుల పరిశీలన సమగ్రస్థాయిలో, మరింత సునిశితంగా ఉండాలని పూజా ఉదంతం చాటుతోంది.

పూజ తండ్రికి తాత్కాలిక ఉపశమనం

భూ వివాదంలో తుపాకీతో బెదిరించిన కేసులో జూలై 25వ తేదీదాకా అరెస్ట్ నుంచి పూజ తండ్రి దిలీప్‌కు రక్షణ కల్పిస్తూ పుణె సెషన్స్‌కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఇదే కేసులో దిలీప్ భార్య మనోరమను మహారాష్ట్ర పోలీసులు ఇప్పటికే అరెస్ట్‌చేసి 20వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. మరోవైపు మనోరమ భార్యకు చెందిన నిర్వహణలోలేని థర్మోవెరిటా ఇండియా అనే ఇంజనీరింగ్ సంస్థను పింప్రి–ఛింద్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీల్‌చేశారు. రూ.2.77 లక్షల ఆస్తి పన్ను బాకీ కట్టనందుకు అధికారులు ఇలా చర్యలకు ఉపక్రమించారు. వైకల్య సర్టిఫికెట్ తీసుకునేటపుడు ఈ సంస్థ చిరునామానే పూజ తన ఇంటి అడ్రస్‌గా పేర్కొన్నారు.

బిల్కిస్ బానో దోషులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో రేప్ కేసులో ఇద్దరు దోషులకు శుక్రవారం సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. శిక్ష తగ్గింపును కొట్టివేస్తూ ఈ ఏడాది జనవరి 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుభాయ్ బాబూలాల్ సోనిలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. సమాన సంఖ్యలో జడ్జీలు ఉన్న ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తామెలా విచారణ చేపట్టగలమని (రెండు ధర్మాసనాల్లోనూ సమంగా ఇద్దరేసి జడ్జీలు ఉన్నందువల్ల) ప్రశ్నించింది. 2002లో గోద్రా అల్లర్ల అనంతర ఘటనల్లో గర్భవతి బిల్కిస్ బానో సామూహిక అత్యాచారానికి గురయ్యారు. ఆమె కుటుంబ సభ్యులు ఏడుగురు హత్యకు గురయ్యారు. ఈ కేసులో మొత్తం 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. భగవాన్‌దాస్ షా పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం 2022 మే 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ క్షమాభిక్ష విధానానికి అనుగుణంగా షాను విడుదల చేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దాంతో గుజరాత్ ప్రభుత్వం అదే ఏడాది ఆగస్టు 15వ తేదీన బిల్కిస్ బానో కేసుల యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్న 11 మందిని సత్ప్రవర్తన కలిగి ఉన్నారనే కారణంతో క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా తీవ్ర విమర్శలు తలెత్తాయి. వివిధ రంగాలు చెందిన మేధావులు, ప్రముఖులు ఆరు వేల మంది దోషులకు శిక్ష మినహాయింపును రద్దు చేయాల్సిందిగా సుప్రీంకోర్టును ఒక లేఖలో కోరారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 8న వారికి శిక్ష మినహాయింపు సరికాదని తీర్పునిచ్చింది. రెండు వారాల్లోగా దోషులందరూ జైలులో లొంగిపోవాల్సిందిగా ఆదేశించింది. విచక్షణాధికారాలను తప్పుగా వాడారని, అనైతిక పద్ధతుల ద్వారా దోషులకు అనుకూలంగా వ్యవహరించారని గుజరాత్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేసింది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగింది కాబట్టి క్షమాభిక్షను ప్రసాదించే అధికార పరిధి కూడా ఆ రాష్ట్రానిదేనని, గుజరాత్ ప్రభుత్వం మహారాష్ట్ర అధికారాన్ని చట్టవిరుద్ధంగా లాక్కుందని పేర్కొంది. సమానబలం కలిగిన సుప్రీంకోర్టు ధర్మాసనాలు (రెండూ ద్విసభ్య ధర్మాసనాలే) శిక్ష మినహాయింపుపై పరస్పర విరుద్ధ తీర్పులు ఇచ్చాయని, విస్తృత ధర్మాసనానికి ఈ కేసును రిఫర్ చేయాలని పిటిషనర్లు కోరారు. 'ఇదేం పిటిషన్. ఇది ఎలా విచారణార్హం అవుతుంది? ఇది పూర్తిగా తప్పుగా అర్థం చేసుకొని వేసిన పిటిషన్. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎలా వేస్తారు? సమాన సంఖ్య ఉన్న ధర్మాసనం ఇచ్చిన తీర్పును మేము సమీక్షించలేం' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లు శుక్రవారం స్పష్టం చేశారు. దీంతో పిటిషన్ల తరపున న్యాయవాది రిషి మల్హోత్రా తమ వ్యాజ్యాన్ని ఉపసహరించుకోవడానికి అనుమతి కోరారు. ధర్మాసనం దీనికి సమ్మతించింది. భగవాన్‌దాస్ షా మధ్యంతర బెయిల్‌ను కూడా కోరారు.

పాలస్తీనాను అధీనంలో ఉంచుకోవడం చట్టవిరుద్ధం

అంతర్జాతీయ న్యాయస్థానం

ది హేగ్: పాలస్తీనా ఆక్రమిత ప్రాంతాలను ఇజ్రాయెల్ తమ అధీనంలో ఉంచుకోవడం చట్ట విరుద్ధమని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ న్యాయస్థానం శుక్రవారం స్పష్టం చేసింది. ఆక్రమిత ప్రాంతాల నుంచి వైదొలగాలని, అక్కడ స్థిర నివాసానికి కాలనీల నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలని సూచించింది. 57 ఏళ్ల కిందట ఆక్రమించిన పాలస్తీనా ప్రాంతాలపై ఇజ్రాయెల్ అజమాయిషీని తప్పుపడుతూ అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఇవ్వడం అసాధారణ విషయంగా పేర్కొంటున్నారు. వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెంలలో ఇజ్రాయెల్ సెటిల్మెంట్లను నిర్మించడం, విస్తరించడం, ఆక్రమిత ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం, వాటిపై నియంత్రణ, అక్కడి సహజ వనరులను వినియోగించుకోవడం, పాలస్తీనియన్లపై వివక్షతో కూడిన విధానాలను అమలు చేయడం.. ఇవన్నీ అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని జడ్జీల ప్యానెల్ అభిప్రాయపడింది. ఆక్రమిత ప్రాంతాలపై ఇజ్రాయెల్‌కు సార్వభౌమాధికారం లేదని, పాలస్తీనాలోని ప్రాంతాలను బలవంతంగా ఆక్రమించడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని పేర్కొంది. అయితే అంతర్జాతీయ న్యాయ స్థానం ఇచ్చిన ఈ తీర్పుకు కట్టుబడి ఉండాల్సిన, పాటించాల్సిన అవసరం ఇజ్రాయెల్‌కు లేదు. ఇదొక అభిప్రాయం మాత్రమే. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు దీనిపై స్పందిస్తూ.. ఆ ప్రాంతాలు యూదు ప్రజల చారిత్రక మాతృభూమిలో భాగమన్నారు.

పాక్‌లో లాడెన్ సన్నిహితుడి అరెస్ట్



లాహోర్: అల్ ఖైదా సీనియర్ నేత, ఒసామా బిన్ లాడెన్‌కు సన్నిహితుడిగా భావిస్తున్న అమీనుల్ హక్‌ను పాక్ ఉగ్రవాద వ్యతిరేక విభాగం అరెస్ట్ చేసింది. దేశంలో భారీ ఉగ్రదాడులకు పాల్పడేందుకు అతడు చేస్తున్న ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకోగలిగామని ఉగ్రవాద వ్యతిరేక విభాగం డీఐజీ ఉస్మాన్ అక్రమ్ చెప్పారు. నిఘా వర్గాల సమాచారం మేరకు పంజాబ్ ప్రావిన్స్‌లోని గుజ్రాత్ జిల్లా సరాయ్ ఆలంగిర్ పట్టణంలో దాగున్న అతడిని పట్టుకున్నట్లు అక్రమ్ తెలిపారు. ఉగ్రవాదంపై జరుపుతున్న పోరాటంలో ఇదో కీలక విజయమని పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో చల్లారని ఉద్రిక్తతలు

- 64కు పెరిగిన మృతుల సంఖ్య
- ఢాకాలో ప్రదర్శనలు, సభలపై ప్రభుత్వం నిషేధం
- జైలుపై ఆందోళనకారుల దాడి
- ఖైదీల విడుదల

ఢాకా: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ఆందోళనలు తీవ్రంగానే కొనసాగుతున్నాయి. పోలీసులు, అధికార పార్టీ అనుబంధ విద్యార్థి సంఘాలతో ఆందోళనకారులు బాహాబాహీ తలపడుతున్నారు. దేశవ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో శుక్రవారం నాటికి 64 మంది వరకు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. గాయపడిన వారి సంఖ్య వందల్లోనే ఉంటుందని పేర్కొంది. అయితే, మరణాలు, క్షతగాత్రుల సంఖ్యపై యంత్రాంగం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. రాజధాని ఢాకా పరిధిలోని నర్సింగ్డి జిల్లాలో ఉన్న జైలుకు శుక్రవారం రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ముందుగా వారు జైలుపై దాడి చేసి, అందులోని వారందరినీ విడిచిపెట్టారు. 'ఖైదీలంతా పరారయ్యాక ఆందోళనకారులు జైలు భవనానికి నిప్పుపెట్టారు. వెళ్లిపోయిన ఖైదీలు ఎంతమంది అనేది తెలియదు. కానీ, వారి సంఖ్య వందల్లోనే ఉంటుంది' అని ఓ పోలీస్ అధికారి చెప్పినట్లు ఏఎఫ్‌పీ వార్తాసంస్థ వెల్లడించింది. శుక్రవారం ఢాకాలోని ప్రభుత్వ టీవీ కార్యాలయాన్ని సుమారు 1,000 మంది ఆందోళనకారులు ముట్టడించినట్లు ఏఎఫ్‌పీ తెలిపింది. వీరిని చెదరగొట్టేందుకు సరిహద్దు భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. వీధుల్లో పెద్ద సంఖ్యలో బుల్లెట్లతోపాటు రక్తం మరకలు కనిపించాయని తెలిపింది. ఆందోళనకారులు గురువారం టీవీ కార్యాలయంలో కొంతభాగాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న వాహనాలకు నిప్పుపెట్టారు.

రెండు రైళ్లను రద్దు చేసిన భారత్

ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు శని, ఆదివారాల్లో వెళ్లాల్సిన కోల్‌కతా–ఢాకా మైత్రీ ఎక్స్‌ప్రెస్, కోల్‌కతా –ఖుల్నా బంధన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆందోళనలు హింసాత్మక రూపం దాల్చినందున అత్యవసరమైతే తప్ప, బయటకు రావొద్దని బంగ్లాదేశ్‌లోని భారత పౌరులను భారత విదేశాంగ శాఖ కోరింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 20 : జూలై : 2024


సండూరు సమీపంలో ఏర్పాటు చేసిన భారీ గాలిమర శుక్రవారం వీచిన పెను గాలులలకు ఒరిగిపోయింది. దీంతో సమీపంలోని పంటలు దెబ్బతిన్నాయి. ఈ భారీ టర్బైన్ కూలి పోవడం ఇది రెండోసారి.

న్యూస్‌రీల్

రైలు ఢీకొని ముగ్గురు యువకుల మృతి


మృతి చెందిన ముగ్గురు యువకులు వీరే(ఫైల్)

హొసపేటె: మద్యం మత్తులో తమాషా కోసం పట్టాలపై నిద్రించిన ముగ్గురు యువకులపై నుంచి రైలు దూసుకెళ్లడంతో మృతి చెందిన ఘటన కొప్పళ జిల్లా గంగావతిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. నగరంలోని కిల్లా ప్రాంతానికి చెందిన మౌనేష్ శ్రీనివాస్(23), గౌరమ్మ క్యాంపునకు చెందిన సునీల్ తిమ్మన్న(23), హిరేజంతకల్‌కు చెందిన వెంకట భీమరాయ(20)లు రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి డిన్నర్ పార్టీ చేసుకున్నారు. సరదాగా ట్రాక్‌పైకి వెళ్లి అక్కడే నిద్రించారు. ఆ సమయంలో గంగావతి మార్గంలో వచ్చిన హుబ్లీ–సింధనూరు ప్యాసింజర్ రైలు ముగ్గురినీ బలితీసుకుంది. గదగ్ డివిజన్ రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

దర్శన్‌ను కలిసిన ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య

దొడ్డబళ్లాపురం: పరప్పన అగ్రహార జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌ను ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య శుక్రవారం కలిశారు. దర్శన్‌ను కలిసి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ యోగక్షేమం తెలుసుకునేందుకు మాత్రమే దర్శన్‌ను కలిశానన్నారు. రోజూ వ్యాయామం చేసి త్వరగా నిద్రపోతున్నట్లు దర్శన్ తెలిపాడన్నారు.

పెళ్లి డేట్ మార్చవద్దు

నటుడు తరుణ్ సుధీర్ శుక్రవారం దర్శన్‌ను కలిశారు. కొన్ని రోజుల్లో తరుణ్ వివాహం ఉండడం వల్ల వివాహానికి దర్శన్‌ను ఆహ్వానించడానికి వెళ్లినట్టు తరుణ్ తెలిపాడు. వివాహం డేట్ రద్దు చేసుకోవద్దని, తాను ఆలోపు బయటకు వస్తానని దర్శన్ చెప్పినట్టు తెలిపారు. కాసేపు సినిమా ఇండస్ట్రీ గురించి మాట్లాడుకున్నామన్నారు.

ఉద్యోగ రిజర్వేషన్ల ఉపసంహరణ

- జయ కర్ణాటక ఆగ్రహం

శివాజీనగర: రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవడంపై కన్నడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీల సీ, డీ శ్రేణిలో ఉద్యోగాల్లో కన్నడిగులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు మంత్రి మండలి అనుమతి లభించిన విషయంపై ముఖ్యమంత్రి ప్రకటించినపుడు కన్నడిగులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ప్రైవేట్ సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ప్రైవేట్ సంస్థల ఒత్తిళ్లకు పెద్దలు తలొగ్గినట్లు కనిపిస్తోందని జయ కర్ణాటక సంఘం అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రైవేట్ కంపెనీల్లో కన్నడిగులకు రిజర్వేషన్ కల్పించే విషయమై బిల్లు రూపొందించి దానిని అమల్లోకి తేవటం కాకుండా ప్రైవేట్ సంస్థలకు తలొగ్గి బిల్లును నిలుపుదల చేసిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య చర్యలు ఖండనీయమని రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ బీ.ఎన్.జగదీశ్ అన్నారు.

యడియూరప్ప, బొమ్మై హయాంలో అక్రమాలు

- రూ.300 కోట్ల వరకు నిధులు స్వాహా
- డీసీఎం డికే శివకుమార్ తీవ్ర ఆరోపణ

శివాజీనగర: బీజేపీనేతలు అవినీతి పితామహులు, మాజీ సీఎంలు యడియూరప్ప, బొమ్మై హయాంలో పలు మండళ్లలో సుమారు రూ.300 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని డీసీఎం డీ.కే.శివకుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విధానసౌధ వద్ద మీడియాతో మాట్లాడారు. బీజేపీ హయాంలో భోవి మండలిలో రూ.87 కోట్లు, ఏపీఎంసీలో రూ.47 కోట్లు, 2019లో దివ్యాంగుల సంక్షేమ శాఖలో రూ.22 కోట్లు, అంబేడ్కర్ మండలికి సంబంధించి జూన్ 2018లో రూ.5 కోట్లు, దేవరాజ్ అరసు మండలిలో రూ.47 కోట్లు, కాలుష్య నియంత్రణ మండలిలో రూ.10 కోట్లు స్వాహా అయ్యాయన్నారు. కేఐడీబీ సొమ్ము సేలంకు అక్రమంగా బదిలీ అయిందని తెలిపారు. ఈ అక్రమాలపై తనిఖీ చేయిస్తామని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అక్రమాల వెనుక వారి వివరాలు విధానసభ ద్వారా ప్రజలకు తెలియజేస్తామని డీసీఎం తెలిపారు. ముఖ్యమంత్రి స్థానానికి రూ.2500 కోట్లు, మంత్రి స్థానానికి రూ.100 కోట్లు ఇవ్వాలని బసవనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపణ చేశారని, భోవి మండలి అక్రమాలపై గూళిహట్టి శేఖర్ చేసిన ఆరోపణలపై ఎందుకు బీజేపీ తనిఖీ చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. వాల్మీకి మండలిలో రూ.86 కోట్ల నగదు తెలంగాణకు అక్రమంగా బదిలీ అయిన దానిపై తనిఖీ చేసేందుకు సిట్‌ను నియమించామన్నారు. తనిఖీ బృందం సుమారు రూ.36 కోట్ల వరకు సొమ్మును స్వాధీనం చేసుకుందన్నారు.

అక్రమార్కులపై లోకాయుక్త కొరడా

- 12 మంది అధికారుల ఇళ్లు, కార్యాలయాల్లో దాడులు
- మొత్తం 54 ప్రాంతాల్లో ఏక కాలంలో తనిఖీలు
- కళ్లు బైర్లు కమ్మే అక్రమాస్తులు
- కిలోల కొద్దీ బంగారు నగలు
- దాడుల్లో పాల్గొన్న 300 మంది అధికారులు



అధికారి అత్తర్ అలీ నివాసంలో లభించిన నగదు, బంగారు, ఖరీదైన చేతి గడియారాలు, సోదాలు జరిగిన పలువురు అధికారుల నివాసాలు

బనశంకరి: అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులపై లోకాయుక్త కొరడా ఝుళిపించింది. లోకాయుక్త ఎస్పీ డాక్టర్ కే.వంశీకృష్ణ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది అధికారులు శుక్రవారం వేకువజామునుంచే దాడులు మొదలు పెట్టారు. బెంగళూరు, మైసూరు, శివమొగ్గ, యాదగిరి జిల్లాల్లో 12 మంది అధికారుల ఇళ్లు, కార్యాలయాలు మొత్తం 54 ప్రాంతాల్లో సోదాలు చేశారు. కోట్ల రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు, ఇళ్ల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మైసూరులోని కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ చేతన్‌కుమార్ కార్యాలయం, శారదాదేవినగరలోని ఇంటిలో జరిపిన సోదాల్లో ఆదాయానికి మించి అక్రమాస్తులు వెలుగుచూశాయి. తుమకూరు కేఐఏడీబీ అదనపు డైరెక్టర్ సీటీ.ముద్దుకుమార్ కార్యాలయం, నాగరబావి రెండో స్టేజ్‌లోని ఇల్లు, రేస్‌కోర్సు రోడ్డు ఖనిజ భవన్‌లోని కార్యాలయం, తుమకూరు బనశంకరిలోని ఇల్లు, చిక్కనాయకనహళ్లి నివాసం, శెట్టికెరెహోబళి రంగనాథపురలోని ఫాంహౌస్, అంతరసనహళ్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో ప్లాస్టిక్ బాటిల్స్ తయారీ ఫ్యాక్టరీలో ఏకకాలంలో దాడులు జరిగాయి. కోట్లాదిం "రూపాయల అక్రమాస్తులు గుర్తించారు. బెంగళూరు నగరంలో ముగ్గురు ప్రభుత్వ అధికారుల ఇళ్లపై జరిపిన సోదాల్లో కిలోలకొద్దీ బంగారు ఆభరణాలు, వెండి, లక్షలాదిరూపాయలు నగదు లభ్యమైంది. కొలతలు తూనికలు శాఖ డిప్యూటీ నియంత్రణాధికారి అత్తర్ అలీ ఇంటిలో 2.2 కిలోల బంగారు ఆభరణాలు, 4 కిలోల వెండి వస్తువులు, విలువైన చేతిగడియారాలు, డైమండ్ నెక్లెస్, రూ.25 లక్షల నగదు లభ్యమైంది. వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ రమేశ్‌కుమార్ , కేఐఏడీబీ భూస్వాధీన అధికారి బీవీ.రాజా ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు.

నగల బ్యాగ్‌ను పక్కింట్లో వేసిన అధికారి

తనిఖీల సమయంలో తూనికలు, కొలతల అధికారి అత్తర్‌అలీ తన ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను పక్కింట్లోకి పడేసే ప్రయత్నం చేశారు. శబ్దం విని అప్రమత్తమైన అధికారులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో బంగారు ఆభరణాలు, నగదు లభించినట్లు లోకాయుక్త ఎస్పీ వంశీకృష్ణ తెలిపారు.



తూనికులు, కొలతల శాఖ అధికారి అత్తర్ అలీ ఇంటిలో శుక్రవారం జరిగిన లోకాయుక్త దాడిలో స్వాధీనం చేసుకున్న నగలు, నగదు, బంగారు నెక్లెస్‌లు

దాడులకు గురైన అధికారులు

- తుమకూరు వాణిజ్య పారిశ్రామిక శాఖ అదనపు డైరెక్టర్ ముద్దుకుమార్
- యాదగిరి జిల్లా పంచాయత్ పథకం డైరెక్టర్ బలవంత్
- దొడ్డబళ్లాపుర సీనియర్ పశువైద్యుడు డాక్టర్ సిద్దప్ప
- హెబ్బగోడి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ కమిషనర్ నరసింహమూర్తి
- కేఐఏడీబీ ఫస్ట్‌గ్రేడ్ అసిస్టెంట్ బీవీ.రాజా
- వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రమేశ్‌కుమార్
- కొలతలు తూనికల శాఖ డిప్యూటీ నియంత్రణాధికారి అత్తర్‌అలీ
- భద్రావతి అంతరగంగ గ్రామపంచాయతీ అధ్యక్షుడు సీ.నాగేశ్
- ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాశ్
- కార్మికశాఖ అధికారి మండ్య విభాగం చేతన్‌కుమార్
- మంగళూరు మహానగర పాలికె కమిషనర్ ఆనంద్
- సీఎల్, ఫస్ట్‌గ్రేడ్ అసిస్టెంట్ ఉత్తరవిభాగ బెంగళూరు టీఆర్ మంజునాథ్

ఏడుగురి మృతదేహాలు లభ్యం

- మరో ముగ్గురి కోసం గాలింపు


శిరూరు వద్ద కొండచరియలు విరిగిపడిన స్థలంలో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

బనశంకరి: ఉత్తరకన్నడ జిల్లా శిరూరు వద్ద కొండచరియలు విరిగి పదిమంది గల్లంతైన ఘటనలో ఏడు మంది మృతదేహాలు లభించాయి. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. మృతుల్లో ఇద్దరిని గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్లు తమిళనాడు నామకల్‌కు చెందిన చిన్నన్(56), మురగన్(46)గా గుర్తించారు. ఐదుగురి పేర్లు తెలియలేదు. గల్లంతైనవారిలో సణ్ణీగౌడ, జగన్నాథనాయక్ ఉన్నారు. వీరి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు. గంగావళి నదిలోకి కొట్టుకుపోయిన హెచ్‌పీ గ్యాస్ ట్యాంకర్ కోసం కోస్ట్‌గార్డ్స్, కంపెనీ నిపుణులు బృందాలు గాలిస్తున్నాయి. ఉత్తరకన్నడ జిల్లాలో భారీవర్షాలతో కుమటా తాలూకా బర్గి వద్ద జాతీయ రహదారి– 66లో కొండచరియలు విరిగిపడ్డాయి. అక్కడ మట్టి తొలగించే పనులు జరుగుతున్నాయి. శిరూరు వద్ద కొండచరియలు విరిగినప్రదేశంలో మట్టిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది.

చాముండేశ్వరికి విశేష పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

మైసూరు : ఆషాఢ మాసం రెండవ శుక్రవారం చాముండేశ్వరి కొండ భక్తులతో నిండిపోయింది. రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒక వైపు వర్షం, మరో వైపు ఈదురుగాలులు వీస్తున్నా భక్తులు లెక్క చేయలేదు. అమ్మవారి దర్శనం కోసం తండోపతండాలుగా కొండకు తరలివచ్చారు. వేకువజామున 3గంటలనుంచే అమ్మవారికి పూజలు నిర్వహించి నాగలక్ష్మిగా అలంకరణ చేశారు. అమ్మవారి సన్నిధిని వివిధ పుష్పాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని కూడా ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కన్నడ సినీ నటి సుధారాణి, కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తన కుటుంబంతో కలిసి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎం రాజీనామా చేయాల్సిందే

- విధానసభలో ప్రతిపక్షాల పట్టు
- మీకు రాజకీయాలే ముఖ్యం
- మండిపడిన సీఎం సిద్దరామయ్య
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలో గందరగోళం
- అసెంబ్లీ సోమవారానికి వాయిదా
- ఆందోళనల మధ్యనే మూడు బిల్లులకు ఆమోదం


అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం

సాక్షి బెంగళూరు: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం విధానసభలో ఆందోళనకు దిగింది. విపక్షం ఆందోళన, అధికారపక్షం ఎదురు దాడితో సభ సజావుగా జరిగేందుకు వీలు పడలేదు. ఈ నేపథ్యంలో అసెంబ్లీని స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమయ్యాక మళ్లీ బీజేపీ నేతలు ఆందోళన కొనసాగించారు. వీరి ఆందోళన మధ్యలోనే కొన్ని బిల్లులకు ఆమోదం లభించింది. ఆ తర్వాత అసెంబ్లీని స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రారంభమైన తర్వాత బీజేపీ సభ్యులు గురువారం నాటి తమ ఆందోళనను కొనసాగించారు. మీ స్థానాల్లో కూర్చోవాలని సభాపతి ఎంత సూచించినా సభ్యులు మాట వినలేదు. సీఎం రాజీనామా చేసి, కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. ఈ గందరగోళం మధ్యలోనే స్పీకర్ అసెంబ్లీని పది నిమిషాల పాటు వాయిదా వేశారు. పది నిమిషాల తర్వాత సభ ప్రారంభమయ్యాక కూడా ప్రతిపక్షం తమ పట్టును వీడలేదు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. బీజేపీ సభ్యుల ఆందోళన మధ్యలోనే సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని, వారికి రాజకీయాలు మాత్రమే ముఖ్యమని, వాల్మీకి మండలి కేసులో నిందితులపై ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోందని ప్రకటించారు. సీఎం మాట్లాడుతుండగానే బీజేపీ సభ్యులు ఆయన ప్రసంగానికి అడుగడుగునా అడ్డు తగిలారు. ఈసమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. ఆరోప, ప్రత్యారోపణలతో సభ యుద్ధభేరిని తలపించింది. ఈ గందరగోళం మధ్యలోనే ప్రతిపక్షనాయకుడు ఆర్.అశోక్ మాట్లాడుతూ తమ డిమాండ్‌ను అంగీకరించే వరకు తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు. కాగా, ఈ అల్లర్ల మధ్యలోనే మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

వాల్మీకి మండలిలో అక్రమాలు నిజం

- సీఎం సిద్దరామయ్య

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలిలో అక్రమాలు జరిగింది వాస్తవమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ అక్రమాలు జరగలేదని తాము చెప్పడంలేదని, అక్రమాలు ఎవరు చేశారు? ఎవరు బాధ్యులు అన్న అంశంలో విచారణ జరుగుతోందన్నారు. డబ్బు విషయంలో ఎక్కువ జవాబుదారీ వహించాల్సింది ఎండీ అని తెలిపారు. మంత్రి పాలసీ మేకర్ అని తెలిపారు. బసనగౌడ దద్దల్‌ను వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా చేశామని, నాగేంద్ర మంత్రిగా ఉన్నారన్నారు. ఆయన హయాంలో అక్రమాలు జరిగాయని సీఎం స్పష్టం చేశారు. మండలికి చెందిన నగదును యూనియన్ బ్యాంక్ వసంతనగర శాఖలో పెట్టారని, శోభన అనే మేనేజర్ ఎంజీ రోడ్డులోని బ్రాంచ్‌కు నగదు బదిలీచేశారన్నారు. వేర్వేరు చోట్ల నుంచి రూ.187 కోట్లు ఎంజీ రోడ్డు శాఖకు బదిలీచేశారన్నారు. ఎంజీరోడ్డు శాఖకు చెందిన దీపా, కృష్ణమూర్తి, మరో అధికారి ఇందులో భాగస్వామి అయ్యారన్నారు. ఈ శాఖ నుంచి రూ.187 కోట్లలో రూ.89.63 కోట్లు తెలంగాణలోని 18 అకౌంట్లకు బదిలీ అయ్యిందన్నారు.


నయన మనోహరం : శుక్రవారం చామరాజనగర జిల్లాలో కొండల నుంచి దుముకుతున్న భరచుక్కి జలపాతం. జలపాతం వద్ద సందర్శకుల సందడి.

తెలంగాణ ఎన్నికలకు వాల్మీకి మండలి నిధులు

- విధాన పరిషత్‌లో విపక్షాల ఆరోపణ

సాక్షి బెంగళూరు: తెలంగాణ ఎన్నికల్లో వినియోగించేందుకు వాల్మీకి మండలి నిధులు బదిలీ అయ్యాయని బీజేపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై విధాన పరిషత్‌లో శుక్రవారం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈక్రమంలోనే సమావేశాలను పరిషత్ డిప్యూటీ చైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు. శుక్రవారం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాల సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల కోసం వాల్మీకి మండలి నిధులు ఉపయోగించారని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు భగ్గుమన్నారు. ఈక్రమంలో పరస్పరం ఆరోప, ప్రత్యారోపణలు చేసుకున్నారు. సభ్యుల తీరుపై పరిషత్ డిప్యూటీ చైర్మన్ ప్రాణేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రవర్తన ద్వారా బయటకు ఎలాంటి సందేశం పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సభా నాయకుడు బోసురాజు మాట్లాడుతూ ఎలాంటి తారతమ్యాలు లేకుండా మూడు పార్టీలకు ఒకరి తర్వాత ఒకరికి అవకాశాలు ఇవ్వాల్సి ఉందని, కానీ ఇక్కడ అలా జరగడం లేదని పరిషత్ పీఠంపై ఆరోపణలు చేశారు. దీనిపై ప్రాణేశ్ స్పందిస్తూ సహజంగా అంశాన్ని లేవనెత్తిన వారికి అవకాశం ఇవ్వాలని, అందులో భాగంగానే ఇచ్చినట్లు, ఎవ్వరికీ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. అనంతరం సీటీ రవి మాట్లాడుతూ ప్రభుత్వానికి సమాధానం ఇచ్చే ధైర్యం లేదని, అందుకే సభను అడ్డుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. సీటీ రవి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సభ్యులు సలీం అహ్మద్, రవికుమార్ తోసిపుచ్చారు. సీటీ రవి వ్యాఖ్యలు సరిగ్గా లేవని వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చే శారు. ప్రతిపక్ష నాయకుడు సునీల్ వెల్యాపుర స్పందిస్తూ అవినీతి చేసేది మీరు.. క్షమాపణలు మాత్రం మేము చెప్పాలా అంటూ ఎద్దేవా చేశారు. సలీం అహ్మద్ మాట్లాడుతూ పదేపదే తెలంగాణ ఎన్నికలను ఉల్లేఖిస్తూ తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ప్రతి ఒక్క సభ్యుడికి హక్కు ఉందని, విమర్శలు వచ్చినప్పుడు సమర్థంగా ఎదుర్కొని బదులివ్వాలని సూచించారు. అయితే ప్రాణేశ్ వ్యాఖ్యలను సభ నాయకుడు బోసురాజు తోసిపుచ్చుతూ తమకు అవకాశం ఇవ్వకూడదనే ప్లాన్ వేసినట్లు ఉన్నారని, తాము ఏ అంశానికైనా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇలా అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతుండగానే సమావేశాలను సోమవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ చైర్మన్ వాయిదా వేశారు.

ఎడతెరిపి లేని వర్షాలు.. ప్రజలకు ఇబ్బందులు



చిక్కమగళూరులో వరదనీటిలో కొట్టుకుపోతున్న ఆవు, మాదాపురలో కూలిన ఇల్లు


మాదాపురలో కూలిన ఇల్లు, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు అందజేస్తున్న మాజీ సీఎం, హావేరి ఎంపీ బసవరాజబొమ్మై

- హావేరి జిల్లా మాదాపురలో కూలిన ఇంటి కప్పు
- ఇద్దరు కవలలు, మహిళ మృతి
- అనేక గ్రామాల్లో కూలిన విద్యుత్ స్తంభాలు
- గ్రామాలకు రాకపోకలు బంద్


కుశాలనగరలో చెరువు తెగిపోయిన దృశ్యం

బనశంకరి: రాష్ట్రంలో వరుణుడి ఆర్భాటం కొనసాగుతోంది. కుండపోత వర్షాలతో అనేక జిల్లాల్లో వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లు తెగిపోయాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. హావేరి జిల్లా సవణూరుతాలూకా మాదాపుర గ్రామంలో ఇంటి పైకప్పు కూలి ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. మృతులు చిన్నమ్మ(30), ఏడాది వయసున్న కవలపిల్లలైన అనుశ్రీ, అమూల్యగా గుర్తించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిద్దె తడిసిపోయి శుక్రవారం తెల్లవారుజామున పైకప్పు కూలింది. ఆరు మందిపై మట్టి, తీర్లు పడిపోయాయి. స్థానికులు వచ్చి అందరినీ వెలికి తీసి సవణూరు ఆస్పత్రికి తరలించగా చిన్నమ్మ, కవలపిల్లలు మృతి చెందారు. వృద్ధురాలు యల్లమ్మ, కుమారుడు, కోడలు చికిత్స పొందుతున్నారు. మాజీ సీఎం, హావేరి ఎంపీ బసవరాజబొమ్మై మాదాపుర గ్రామానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి రూ.2 లక్షలు పరిహారం అందజేశారు. జిల్లా ఎస్పీ మహమ్మద్ అజీజ్ చేరుకుని పరిశీలించారు. మాజీఎమ్మెల్యే అజ్జంపీరాఖాద్రి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. హాసనలో సకలేశపుర, ఆలూరు, బేలూరులో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. చెరువులు పొంగి పొర్లుతున్నాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సకలేశపుర తాలూకాలోని బీస్లే, కట్టేపుర, మాగేరి, బేలూరు తాలూకా బిక్కోడుతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జాతీయ రహదారి–75లో శిరాడీఘాట్ రోడ్డులో భూమికుంగిపోయింది. హేమావతి నదిలో నీటి ఉధృతి పెరగడంతో ఏక్షణంలోనైనా నీటిని కాలువల్లోకి విడుదలచేయనున్నారు. నదీపరివాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాఫీనాడు చిక్కమగళూరులో భారీ వర్షాలతో హెబ్బాళ వంతెనపై 2–3 అడుగులకు పైగా ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. కొడగు జిల్లావ్యాప్తంగా వర్షాలు కొనసాగుతుండగా కావేరినది ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. ఉపనదుల్లో నీటి మట్టం పెరగడంతో భాగమండల, త్రివేణిసంగమ నిండుకుండలా మారింది. భాగమండల–నాపోక్లు రోడ్డు జలదిగ్బంధమైంది. దక్షిణకన్నడ జిల్లా బంట్వాళలో నేత్రావతినది ఉధృతంగా ప్రవహిస్తోంది. 12 ఇళ్లలోకి నీరు చొరబడింది. ఉడుపిలో ఓ ఇల్లు కూలిపోయింది.


మాదాపురలో ఇంటి పైకప్పు కూలి మృతి చెందిన చిన్నమ్మ, కవలలు అనుశ్రీ, అమూల్య (ఫైల్)


ఉధృతంగా ప్రవహిస్తున్న కపిలా నది

మలెనాడులో శాంతించని వరుణుడు

- కొనసాగిన కుంభవృష్టి
- జనజీవనం అస్తవ్యస్తం
- బొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

శివమొగ్గ: మలెనాడులో జలాశయాల పరిధిలో వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇక పశ్చిమ కనుమల్లో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వరద భయం వెంటాడుతోంది. మరోవైపు మరి కొన్ని రోజుల వరకు వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ సూచనలతో శుక్రవారం కూడా జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా హొసనగర, తీర్థహళ్లి, సాగర తాలూకాల్లో వర్షాల జోరు ఎక్కువగా ఉంది. శుక్రవారం ఉదయానికి గత 24 గంటల్లో పశ్చిమ కనుమల్లోని యడూరులో 175 మి.మీ., సావేహక్లులో 182, మాణిలో 205, హులికల్‌లో 231, మాస్తికట్టెలో 235, చక్రాలో 280 మిమీల చొప్పున వర్షపాతం నమోదైంది. సాగర తాలూకాలో వరదా నది పరవళ్లు తొక్కుతోంది. తాళగుప్ప తాలూకాలోని కాన్లె, సైదూరు, తడగళలె గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. గేరుబీస్ గ్రామం వద్ద వంతెన పైగుండా నది నీరు పారుతోంది. దీంతో గ్రామంతో రాకపోకల సంబంధాలు నిలిచిపోయాయి. నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో శివమొగ్గ నగరంతో పాటు జిల్లాలో పలు చోట్ల ఇళ్లు ధ్వంసమయ్యాయి. హొసనగర, తీర్థహళ్లి, సాగర తాలూకాల్లో పలుచోట్ల కొండచరియలు, చెట్లు కూలిన ఘటనలు జరిగాయి. గాజనూరు డ్యాం (తుంగా డ్యాం) నుంచి


తాళగుప్ప తాలూకాలో నీటమునిగిన పంటలు

వరద పోటెత్తుతుండటంతో శివమొగ్గలో నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది.

భద్రా డ్యాంకు పోటెత్తిన వరద

భద్రా నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో మధ్య కర్ణాటకలోని ప్రముఖ జలాశయమైన భద్రా డ్యాంకు వరద పోటెత్తుతోంది. 24 గంటల్లో డ్యాంలో 4 అడుగుల మేర నీరు చేరింది. శుక్రవారం ఉదయం డ్యాంకు 49,555 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వస్తోంది. 181 క్యూసెక్కుల నీటిని మాత్రమే బయటకు వదులుతున్నారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 186 అడుగులు కాగా ప్రస్తుతం డ్యాంలో 157.11 అడుగుల నీరు నిల్వ చేరింది. గత ఏడాది ఇదే సమయానికి డ్యాంలో 141.70 అడుగుల నీరు ఉండేది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డ్యాంలో సుమారు 16 అడుగుల నీరు ఎక్కువగా నిల్వ చేరింది. తుంగా డ్యాంకు 68,895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోండగా, డ్యాం ఇప్పటికే పూర్తిగా నిండినందున 64,312 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం జిల్లాలోని భద్రావతిలో 27.10 మిమీ, శివమొగ్గలో 37.80, శికారిపురలో 52.60, సొరబలో 77.40, తీర్థహళ్లిలో 83.60, సాగరలో 97.20, హొసనగరలో 102 మిమీల వర్షపాతం నమోదైంది.

లింగనమక్కికి భారీ వరద

హొసనగర తాలూకాలో వర్షాల జోరు కొనసాగుతుండటంతో లింగనమక్కి జలాశయానికి భారీ వరద పోటెత్తుతోంది. ఒకే రోజులో మూడున్నర అడుగులకు పైగా నీరు నిల్వ చేరడంతో పాటు సగం మేరకు జలాశయం నిండిపోయింది. ప్రస్తుతం 87,496 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో ఉంది. గరిష్ట నీటిమట్టం 1819 అడుగులకు గాను ప్రస్తుతం 1791.50 అడుగుల మేర నీరు నిల్వ చేరింది. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 151.64 టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


వంతెన గుండా పొంగి ప్రవహిస్తున్న వరదా నది


కూడల సంగమం వద్ద కృష్ణా, మలప్రభ పరవళ్లు


బెళగావి జిల్లాలో నీట మునిగిన పంటలు

మీరు తిని చూడండి మంత్రిగారు !

- అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యత లేని ఆహారం సరఫరాపై సభాపతి అసంతృప్తి

బొమ్మనహళ్లి: అంగన్‌వాడీల్లో పిల్లలకు సరఫరా చేస్తున్న నాసిరకం ఆహారాన్ని మంత్రి కోడిగుడ్డు తిని చూస్తే పరిస్థితి అర్థమవుతుందని స్పీకర్ బసవరాజ్ హొరట్టి అన్నారు. ఈ ఘటన విధాన పరిషత్‌లో చోటుచేసుకుంది. వివరాలు...శుక్రవారం శాసనసభ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యురాలు హేమలతా నాయక్ మాట్లాడుతూ... అంగన్‌వాడీల్లో అందజేస్తున్న కోడిగుడ్లతో పాటు ఆహారంలో నాణ్యత లేదని, అటువంటి ఆహారం చిన్నారులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి మాట్లాడుతూ...అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందుతోందని, ఈ మేరకు ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు ముఖ్యమంత్రి జారీ చేశారని హెబ్బాళ్కర్ ప్రభుత్వ చర్యను సమర్థించారు. వెంటనే స్పీకర్ బసవరాజు జోక్యం చేసుకుని 'మీరు గుడ్లు తింటారా, ఒక్కసారి తింటే' తెలుస్తుందని అన్నారు. దానికి మంత్రి మాట్లాడుతూ...తాను ఇప్పటి వరకు కోడిగుడ్డు తినలేదని సమాధానమిచ్చారు. స్పీకర్ బసవరాజ్ హొరట్టి మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు పరిష్కరించి సమస్యలున్న ప్రాంతాలపై దృష్టి సారించాలని మంత్రికి సూచించారు.


మండలిలో హేమలతా నాయక్‌కు సమాధానమిస్తున్న మంత్రి హెబ్బాళ్కర్

విమానాలు, రైళ్లలో వచ్చి చోరీలు

- పట్టుబడిన పశ్చిమ బెంగాల్ ముఠా
- రూ.27 లక్షల విలువైన 450 గ్రాముల బంగారం స్వాధీనం

యశవంతపుర: విమానం, రైల్లో బెంగళూరుకు వచ్చి చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠా పట్టుబబడింది. పశ్చిమ బెంగాల్‌లోని దుబుల్య నగరానికి చెందిన శుబిన్‌కర్, హరిదాస్, సోహన్, పీంకులతోపాటు మరో ఇద్దరిని బెంగళూరు పీణ్య పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.27 లక్షల విలువైన 450 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నగర పోలీసు కమిషనర్ బీ దయానంద్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ ముఠా సభ్యులు గతంలో బెంగళూరులో సెక్యూరిటీగార్డు పనులు చేసేవారు. సొంత గ్రామాలకు వెళ్లి మరికొంతమందితో కలిసి ముఠాగా ఏర్పడి బెంగళూరుకు విమానం, రైల్లో వచ్చి లాడ్జిలో బస చేసేవారు. చుట్టుపక్కల ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేసి బంగారం, డబ్బుతో పశ్చిమ బెంగాల్‌కు ఉడాయించేవారు. గృహలక్ష్మి లేఔట్‌లోని ఓ వ్యక్తి అమెరికా వెళ్లగా ఈ ముఠా లోపలకు చొరబడి చోరీ చేసింది. ఆనవాళ్లు లేకుండా సీసీకెమెరాల వైర్లను కత్తిరించింది. పీణ్య పోలీసులు దర్యాప్తు చేపట్టి హెచ్ఎంటీ లేఔట్‌లోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా ఈ ముఠా వ్యవహారం బయట పడింది. సొత్తును పశ్చిమ బెంగాల్‌కు తీసుకెళ్లి విక్రయించినట్లు తేలింది.


చోరీ సొత్తును పరిశీలిస్తున్న కమిషనర్

ఘనంగా గురుపూజా సంగీతోత్సవాలు



చింతామణి: తాలూకాలోని ప్రసిద్ధ క్షేత్రం కైవార శ్రీ యోగినారేయణ మఠంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగే గురుపూజా, సంగీతోత్సవ కార్యక్రమాలను ధర్మాధికారి డా.జయరాం ప్రారంభించారు. దేశ నలమూలల నుండి ప్రఖ్యాత సంగీత విద్యాంసులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరింపబడిన తాతయ్య విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కైవారంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ధర్మాధికారి జయరాం ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు.

రాష్ట్రంలో అవినీతి పాలన : సీటీ

శివాజీనగర: ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రంలో పారదర్శక అవినీతి పరిపాలన అమలు చేస్తున్నారని బీజేపీ విధాన పరిషత్ సభ్యుడు సీ.టీ.రవి ఆరోపించారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, పారదర్శక నిజాయితీ పరిపాలన కాదు, పారదర్శక అవినీతి పాలన ఇది. ఆయన 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ ఒక్క కళంకం లేదు. అయితే పరిపాలనలో పూర్తిగా ఉన్నది అవినీతి మాత్రమేనని ఎద్దేవా చేశారు. నేడు బీజేపీ, జేడీఎస్ విధాన పరిషత్ సభ్యులు గాంధీ విగ్రహం వద్ద ఈ అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వ రేట్ కార్డు ప్రదర్శించామని తెలిపారు. మీరు ఎవరైనా గాని దీనిని పరిశీలించవచ్చు. ఇది 100 శాతం పక్కాగా ఉన్న కాంగ్రెస్ రేట్ కార్డు అని తెలిపారు. కులం బలం ఉంటే 10 శాతం తక్కువ చేయవచ్చు. లేనిచో మరో 10 శాతం అధికం చేయాలని రావచ్చని విశ్లేషించారు. అయితే ఈ రేట్ కార్డ్ ఎలాగుందని సమాచారం అందించారు. బెంగళూరులో నగరాభివృద్ధి శాఖ రేట్ కార్డు అనుగుణంగా ఎఫ్ఏఆర్ (ఫ్లోర్ ఏరియా రేషియో) ఒక చదరపు అడుగుకు రూ.1000, సీఎల్‌యు (చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూస్‌–భూ పరివర్తనకు) ఒక ఎకరాకు 27 లక్షలు ఫిక్స్ అయింది. హోం శాఖలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ బదిలీకి రూ.50 లక్షల నుంచి రూ.ఒక కోటి ధర ఉందని వివరించారు.

వృద్ధాప్యంలోనూ గొప్ప సంకల్పం

- సైకిల్‌పై దేశవ్యాప్త పర్యటన
- డ్రగ్స్, మద్యపానం నుంచి యువతను కాపాడటమే ధ్యేయం
- 2008 నుంచి కొనసాగుతున్న యాత్ర

మాలూరు : వృద్ధాప్యం మీద పడినా ఆయన జనజాగృతికి నడుం బిగించాడు. మాదకద్రవ్యాల బారిన పడి చెడుదారి పట్టిన యువతలో మార్పు తెచ్చేందుకు సైకిల్‌పై దేశవ్యాప్తంగా సంచరిస్తున్నాడు. తాలూకాలోని జగదేణహళ్లి గ్రామానికి మాధవరెడ్డి 10వ తరగతి చదివిన తరువాత ఇంటి నుంచి వెళ్లిపోయి పంజాబ్‌లోని జలంధర్‌కు చేరుకున్నాడు. గురుచరణ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించాడు. తన పేరును అమన్‌దీప్ సింగ్ అని మార్చుకున్నాడు. పాటియాలాలో డిగ్రీ చదివిన అనంతరం ఇంటి యజమాని తన కుమార్తె మన్‌ప్రీత్ సింగ్‌ను ఇచ్చి వివాహం చేశాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శర్వణ్ సింగ్ అమెరికాలో వైద్య వృత్తిలో ఉన్నాడు.

ఇది ప్రేరణ...

మద్యపానం వల్ల తన బంధువు మృతి చెందడంతో విచలితుడైన అమన్‌దీప్ సింగ్ సైకిల్ యాత్రతో దీనిపై ప్రజలను జాగృతం చేయాలని నిర్ణయించాడు. 64 సంవత్సరాల వయస్సులో 2008 జనవరి 1వ తేదీ నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించి 16 సంవత్సరాల పాటు నిరంతరంగా కొనసాగిస్తున్నాడు. ఇతను ఇప్పటికే 25 రాష్ట్రాల్లో పర్యటించాడు. అమన్ దీప్ సింగ్ తనతో పాటు వంట సామగ్రి, ల్యాప్‌టాప్, కెమెరా, ఫైళ్లు ఉంచుకున్నాడు. మార్గ మధ్యంలో పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులను జాగృతం చేస్తూ వెళుతున్నాడు.

3లక్షల కిలోమీటర్ల ప్రయాణం

అమన్‌దీప్ సింగ్ మట్లాడుతూ ఇప్పటికే దేశ వ్యాప్తంగా 3 లక్షల కిలోమీటర్ల దూరం సంచరించినట్లు తెలిపారు. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు కలిసి లక్ష డాలర్లు ఇచ్చారన్నారు. ఈ డబ్బుతో పంజాబ్‌లోని తన స్వగ్రామం కెరాలో విద్యార్థుల కోసం పాఠశాలను ప్రారంభిస్తానని తెలిపాడు. ఇంతవరకు 8 వేల మందిని మద్యపానం నుంచి విముక్తి చేసినట్లు అమన్‌దీప్ సింగ్ తెలిపాడు.


సైకిల్ యాత్రలో అమన్ దీప్ సింగ్

ఎన్ని కష్టాలున్నా పిల్లలను చదివించండి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

విజయపుర: ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించాలని శరణ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర హడపద్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. నారాయణపుర లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాలూకా శరణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. హెచ్ఎం కొట్రేష్, ఎం.సురేష్‌బాబు, భారతీ జగదీష్, ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు రూప పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పార్లమెంట్


ఓటు వేస్తున్న విద్యార్థి

కోలారు : అరాభికొత్తనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు ఆధార్ కార్డులతో వచ్చి ఓటు వేశారు. ఎన్నికల విధి విధానాలు అయిన ఎన్నికల ప్రకటన, నామినేషన్ దాఖలు , వాపస్సు తీసుకోవడం, ఎన్నికల్లో బరిలో ఉన్న వారి పేర్లు ప్రకటించడంపై అవగాహన కలిగించారు. హెచ్ఎం తాహేరా నుస్రత్, ఉపాధ్యాయురాలు ఫరీదా, రమాదేవి పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హుండీలోని నగదు గల్లంతు

కెజీఎఫ్ : హుండీలోని నగదు గల్లంతైన ఘటన నగరంలోని ప్రసిద్ధ శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటరమణ స్వామి ఆలయంలో జరిగింది. శ్రావణమాసంలో దేవాలయానికి వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ఏటా దాతలనుంచి విరాళాలు సేకరించేందుకు హుండీ ఏర్పాటు చేశారు. శ్రావణ మాసం ముగిసిన తరువాత హుండీని దేవాలయ పేష్కార్‌కు అప్పగించారు. హుండీ ద్వారా లభ్యమైన నగదు వివరాలు తెలపాలని సేవాకర్త బాబు అధికారులను కోరారు. అయితే హుండీకి చుట్టిన వస్త్రాన్ని తొలగించినట్లు, అందులో నగదు లేనట్లు కనిపించింది. దీనిపై తనిఖీ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

స్కౌట్స్, గైడ్స్ కమిషనర్‌గా నవీన


నవీనకు ఆదేశ పత్రాలు అందిస్తున్న దృశ్యం

కోలారు : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సమితి గైడ్స్ విభాగం నూతన కమిషనర్ గా మహిళా సమాజ విద్యా సంస్థ పాలనాధికారి ఎం.నవీనాను నియమిస్తూ ముఖ్య కమిషనర్ కేవీ శంకరప్ప ఆదేశాలు జారీ చేశారు. ఎం.నవీనకు నియామక పత్రాలను శుక్రవారం రాష్ట్ర ముఖ్య కమిషనర్ పీజీఆర్ సింధియా అందజేశారు.

తామర పూలతో అలంకరణ



బనశంకరి: ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా బనశంకరీదేవి తామర (కమలం) పూలతో దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ బనశంకరీదేవి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన చేపట్టి తామరపూలతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలి

శ్రీనివాసపురం: మౌల్యవర్ధిత జీవనం కోసం స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు, రచనలు, గ్రంథాలు చదవాలని తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షురాలు పీఎస్ మంజుల సూచించారు. పట్టణంలోని రచయిత్రి మాయా బాలచంద్ర నివాసంలో శుక్రవారం నిర్వహించిన జ్ఞానవికాస అభియాన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోయిందని, మరో వైపు విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిస అయ్యారన్నారు. ఈ పరిస్థితుల్లో వారిలో మార్పు తీసుకొని వచ్చేందుకు మన్వంతర ప్రకాషన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం జ్ఞానార్జనకు ఎంతో ఉపయుక్తమని అన్నారు. సీనియర్ సాహితీవేత్త ఆర్ చౌడరెడ్డి మాట్లాడుతూ పిల్లలు, యువతలో పఠనాసక్తిని పెంచేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాక్షించారు. మన్వంతర ప్రకాషన ప్రముఖుడు అనంతరాం, సంచాలకుడు ఎన్ఎన్ ప్రకాష్, మాయా బాలచంద్ర, మమతారాణి, ఆరతి, గీతా తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందించడం ద్వారా అభియాన్‌ను ప్రారంభించిన దృశ్యం

కైవార క్షేత్రానికి నిత్యావసరాల సరఫరా

కోలారు : కై వార క్షేత్రంలోని సద్గురు యోగి నారాయణ మఠంలో గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించే అన్న దాసోహం కోసం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ నుంచి శుక్రవారం కూరగాయలను, నిత్యావసర వస్తువులను పంపించారు. నగరసభ సభ్యుడు కేఏ అశ్వథ్, నగరసభ మాజీ సభ్యుడు రౌత్ శంకరప్ప మాట్లాడుతూ కైవార క్షేత్రానికి ఏటా గురుపౌర్ణమి సందర్భంగా భక్తులనుంచి నిత్యావసరాలు సేకరించి పంపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కైవార తాతయ్య భక్తులు కోచిముల్ డైరెక్టర్ కాడేనహళ్లి నాగరాజ్, సమాజ సేవకుడు పుష్టి నారాయణస్వామి, వెంకటకృష్ణయ్య, గోకుల్ చలపతి, గాంధీనగర సునీల్ తదితరులు పాల్గొన్నారు.


సరుకులతో నగరసభ అధికారులు, సభ్యులు

రోడ్డు ప్రమాదంలో 8 మందికి తీవ్ర గాయాలు

తుమకూరు: జిల్లాలోని తురువేకెరె తాలూకా దొడ్డశెట్టికెరె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. హొసదుర్గ నుంచి మైసూరుకు వెళుతున్న కేఎస్ఆర్టీసీ బస్సు, మైసూరు నుంచి తురువేకెరె వైపునకు వస్తున్న ఇన్నోవా కారు ముఖాముఖిగా ఢీకొన్నాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా అందులోని 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు బెళ్లూరు ఆదిచుంచనగిరి ఆస్పత్రికి తరలించారు. మైసూరు నుంచి తిపటూరు తాలూకా మణకికెరె గ్రామానికి వెళుతున్న ఇన్నోవా కారు, హొసదుర్గ వైపు నుంచి మైసూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న లావణ్యసింగ్, గోపాల్‌సింగ్, శివకుమార్ సింగ్, లక్ష్మీబాయి, సరస్వతిబాయి, తులసిబాయి, సహనాబాయి, నాలుగేళ్ల చిన్నారి స్నేహ గాయపడ్డారు. జిల్లా ఎస్పీ కేవీ అశోక్, తురువేకెరె సీఐ లోహిత్, ఎస్ఐ సంగప్ప మేటి ఘటన స్థలాన్ని పరిశీలించారు.


ప్రమాదంలో నుజ్జయిన కారు, బస్సు

ఫీవర్ క్లినిక్ ప్రారంభం

శివాజీనగర: రాజధాని బెంగళూరు నగరం తూర్పు జోన్ రామస్వామి పాళ్య మురికివాడ ప్రాంతంలో ఫీవర్ క్లినిక్‌ను శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండురావు ప్రారంభించారు. డెంగీ కేసులను నియంత్రించే నేపథ్యంలో మురికివాడల ప్రాంతాల్లో ఫీవర్ క్లినిక్‌లను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.

స్వతహాగా ఫాగింగ్ చేసిన మంత్రి:

రామస్వామి పాళ్య మురికివాడ ప్రాంతంలో దోమల నియంత్రణ కోసం ఆరోగ్య మంత్రి స్వతహాగా ఫాగింగ్ చేశారు. దోమలు ఉత్పత్తి కాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలకు చేరుకున్న మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. డెంగీ నియంత్రణకు ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

హాట్ స్పాట్‌గా గుర్తింపు:

నగరంలో 100 మీటర్ల పరిధిలో రెండు కంటే అధికంగా డెంగీ కేసులు ఉంటే ఆ ప్రాంతాన్ని హాట్‌స్పాట్‌గా గుర్తించాలన్నారు. నగరంలో రోజు 130 నుంచి 150 కేసులు బయటపడుతునాయన్నారు. వసంతనగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే ఉచిత డయాలిసిస్ కేంద్రం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య మంత్రి దినేశ్ గుండురావు అధికారులకు సూచించారు.ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్, ఆరోగ్య శాఖ కమిషనర్ డీ. రందీప్, జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ భట్, చీఫ్ ఆరోగ్యాధికారులు డాక్టర్ సయ్యద్ సిరాజుద్దీన్ మదని, డాక్టర్ నిర్మలా బుగ్గి, పశ్చిమ జోన్ ఆరోగ్యాధికారులు డాక్టర్ భాగ్యలక్ష్మీ తదితర అధికారులు పాల్గొన్నారు.

శిరాడి మార్గంలో రాత్రి సంచారంపై నిషేధం

యశవంతపుర: కొండ చరియలు విరిగి పడుతుండటంతో దక్షిణ కన్నడ జిల్లా నుంచి రాజధాని బెంగళూరుకు వెళ్లే మార్గం శిరాడి ఘాట్ మార్గంలో అన్ని వాహనాల సంచారాన్ని, సంపాజె ఘాట్‌లో సంచారాన్ని రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున ఆరు గంటల వరకు నిషేధించారు. బెంగళూరుకు వెళ్లే దక్షిణకన్నడ జిల్లా వాసులు రాత్రి సమయంలో చార్మడీ ఘాట్ మార్గంలో సంచారించాలని అధికారులు సూచించారు. 22వ తేదీ రాత్రి 8 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి.

సాంకేతిక విప్లవంతో తగ్గిన మీడియా పాత్ర

తుమకూరు: సాంకేతిక పరిజ్ఞానంతో సంభవించిన విప్లవంతో మీడియా పాత్ర పతనమైందని అసోం కేంద్రీయ విశ్వవిద్యానిలయం మాజీ కో–చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ నాగరాజ్ అన్నారు. వికసిత్ భారత్ సమగ్ర అభివృద్ధిలో డిజిటలీకరణ, మీడియా పాత్ర అనే అంశంపై తుమకూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. న్యూస్18 కన్నడ సంపాదకుడు హరిప్రసాద్, కొప్పళ విశ్వవిద్యాలయ చాన్సలర్ ప్రొఫెసర్ బీకే రవి, చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు, పశ్చిమ బెంగాల్ విశ్వభారతి విశ్వవిద్యాలయం పత్రికారంగ ప్రొఫెసర్ బిప్లబ్ లోహో పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

గౌరిబిదనూరు: అన్ని దానాలలోకన్నా అన్నదానం గొప్పదని బలిజ యువ ఘర్జన జిల్లా ధ్యక్షుడు జీపీ ప్రదీప్, సభ్యుడు రమేష్ అన్నారు. కై వారంలో వెలసిన నారేయణ తాతయ్య ఆరాధన మహోత్సవం సందర్భంగా జరిగే అన్నదానానికి బలిజ నాయకులు భక్తులనుంచి సేకరించిన 103 ప్యాకెట్ల బియ్యం, 60 కెజీల కంది పప్పు, 5 పాకెట్ల బెల్లం, కూరగాయలు గురువారం రాత్రిపంపారు. అశ్వత్థనారాయణ, పరమేశ్, రమేశ్ బాబు, రవి, అనిల్, ఎల్ఐసీ రవి, సుధాకరరెడ్డి, విజమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మారెమ్మదేవికి అలంకరణ



బొమ్మనహళ్లి : ఆషాఢ మాసం సందర్భంగా పరంగిపాళ్యలో మారెమ్మ దేవి అమ్మవారిని శుక్రవారం వివిధ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

లక్ష్మీనారాయణస్వామికి పూజలు



మాలూరు : తాలూకాలోని లక్కూరు గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం రెండో శుక్రవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సురేష్ చేతన్య నేతృత్వంలో లక్ష్మీనారాయణ స్వామి మూల విగ్రహానికి అభిషేకం, సుప్రభాతం, పంచామృత అభిషేకం, వేదమంత్ర పారాయణం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సిగ్నల్ జంప్ చేయొచ్చు

బనశంకరి: ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనం నిలిపినప్పుడు అంబులెన్స్ వస్తే దారి వదలిపెట్టడం లేదా సిగ్నల్ జంప్ చేయవచ్చని, ఎటువంటి జరిమానా విధించబోమని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సిగ్నల్స్‌లో వాహనాలు నిలిపినప్పుడు అంబులెన్స్ వస్తే మానవతా దృక్పథంతో రెడ్‌సిగ్నల్ ఉన్నప్పటికీ వాహనాలు సిగ్నల్ జంప్ చేస్తారు. ఇంకా కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసు కానుందనే భయంతో అంబులెన్స్ దారికి అడ్డుగా ఉంటారు. ఈ గందరగోళానికి తెరదించిన ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ వచ్చినప్పడు ప్రాధాన్యతమేరకు సంచారానికి అవకాశం కల్పించడానికి ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసినప్పటికీ కేసు నమోదు కాదని పోలీసులు తెలిపారు.

ఆశ్రమంలో 21న పూజలు

బనశంకరి: గురుపౌర్ణమి సందర్భంగా జేపీ నగర మూడోస్టేజ్‌లోని శ్రీశివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని శివ బాల యోగి మహారాజ్ ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. శివ బాలయోగి మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

కోచిముల్ పాలక మండలిని రద్దు చేయాలని ధర్నా

కోలారు : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కోచిముల్ పాలక మండలిని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని రైతు సంఘం పదాధికారులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగర సమీపంలోని కోచిముల్ కార్యాలయం ముందు శుక్రవారం ప్రతిఘటన నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్ మాట్లాడుతూ అవసరం లేకున్నా లక్షల వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు సృష్టించి కోచిముల్ నిధులను లూటీ చేశారన్నారు. కోచిముల్ పాలక మండలిని రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తాలూకా అధ్యక్షుడు మూరాండహళ్లి శివారెడ్డి, మంగసంద్ర తిమ్మణ్ణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవులు మృతి

మైసూరు: చామరాజనగర జిల్లా కొళ్లెగాల తాలూకా జాగేరి శాంతినగర గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గాలి వానకు కరెంట్ వైరు తెగి పడిన కరెంట్‌వైర్ తొక్కి మూడు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. ఆవులు మృతి చెందడంతో తన జీవనాధారం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చామరాజనగర జిల్లా గుండ్లుపేటె తాలూకా బెరటెహళ్లి క్రాస్ వద్ద వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేశ్ (68) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఆటో ప్రయాణికులతో వస్తుండగా ప్రైవేట్ బస్సు ఢీకొంది. మహేశ్ మృతి చెందగా ఆటో డ్రైవర్ లింగరాజు, మరికొంత మందికి గాయాలయ్యాయి.

యూట్యూబర్ ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: యూట్యూబ్ చానల్ నడుపుతున్న టీ.దాసరహళ్లి నివాసి మంజునాథ్ (35) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోలదేనహళ్లి వద్ద అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకుని ఇతను విగతజీవిగా కనిపించాడు. అంతకుముందు ఫేస్‌బుక్‌లో లైవ్‌లో మాట్లాడాడు. కాగా మంజునాథ్ కొన్ని రోజులుగా మానసికంగా కుంగిపోయి ఉన్నాడని బంధువులు తెలిపారు. సోలదేనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మరొకరితో వెళ్లిందని..

తుమకూరు: భార్య పరాయి వ్యక్తితో పారిపోవడంతో పరువు పోయిందని మనస్తాపం చెందిన భర్త విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాలూకాలోని హొసహళ్లిలో జరిగింది. దేవరాజ్, మాధవి దంపతులు కాగా వీరికి 18 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి 16, 12 ఏళ్ల వయస్సుగల ఇద్దరు కుమార్తెలున్నారు. గ్రామంలో అంగడి పెట్టుకుని జీవిస్తున్నారు. అయితే తరచూ అంగడి వద్దకు వస్తూ మాయమాటలు చెప్పి సాన్నిహిత్యం పెంచుకున్న అదే గ్రామానికి చెందిన ఆనంద్‌కుమార్ అనే వ్యక్తితో మాధవి పరారైంది. ఈ విషయం తెలుసుకున్న దేవరాజ్ డెత్‌నోట్ రాసి పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

క్లుప్తంగా

ఎఫ్ఐఆర్‌పై స్టే

యశవంతపుర: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంగళూరు బీజేపీ ఎమ్మెల్యే వై భరత్‌శెట్టిపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌పై కోర్టు స్టే విధించింది. అక్షేపణలుంటే దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేసింది. భరత్‌శెట్టి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కృష్ణ ఎస్ దీక్షిత్ ఎఫ్ఐఆర్‌పై స్టే విధిస్తూ ఆదేశించారు. ఎమ్మెల్యే భరత్‌శెట్టి తరపున సీనియర్ న్యాయవాది అరుణ్ శ్యామ్ వాదించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జులై 8న కావూరు జంక్షన్‌లో ఆందోళన చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను ఖండించిన ఎమ్మెల్యేపై కేసును నమోదు చేసినట్లు న్యాయమూర్తికి వివరించటంతో ఎఫ్ఐఆర్‌పై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విద్యుదాఘాతంతో సీఏ విద్యార్థిని మృతి

యశవంతపుర: తెగి పడిన కరెంట్ తీగ తగిలి సీఏ చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన ఘటన దక్షిణకన్నడ జిల్లా మంగళూరుకు సమీపంలోని గురుపురంలో జరిగింది. కల్లకలంబికి చెందిన హరీశ్‌శెట్టి కుమార్తె అశ్విని శెట్టి(21) మంగళూరు కాలేజీలో సీఏ చదువుతుంది. భారీ వర్షాల కారణంగా ఆమె ఇంటి వద్ద ఉంటోంది. బయటకు వెళ్లిన పెంపుడు శునకాలను ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లిన సమయంలో అప్పటికే తెగిపడిన కరెంట్ తీగ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.

దర్శన్ రిట్ పిటిషన్ వాయిదా

దొడ్డబళ్లాపురం: ఇంటి భోజనం కోసం అనుమతి ఇప్పించాలని కోరుతూ దర్శన్ పెట్టుకున్న రిట్ పిటిషన్ విచారణ, తీర్పు ఈనెల 29కి వాయిదా వేశారు. పిటిషన్ విచారణకు తీసుకున్న జడ్జి ఎస్ఆర్ క్రిష్ణమూర్తి ఈ కేసులో మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేనన్నారు. వాదోపవాదాలు విన్న తరువాతే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఖైదీలకు తమ హక్కులు అడిగే హక్కు ఉందని, దర్శన్‌కు కూడా ఇదే వర్తిస్తుందన్నారు. దీంతో విచారణ ఈనెల 29న తీర్పు ఇస్తామన్నారు.

డెంగీ నివారణపై జాగృతి జాతా


జాతాలో పాల్గొన్న కమిషనర్, అధికారులు, విద్యార్థులు

గౌరిబిదనూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ప్రాణాంతక డెంగీ తదితర వ్యాధులకు దూరంగా ఉండాలని నగరసభ కమిషనర్ గీత పిలుపు ఇచ్చారు. డెంగీ నివారణలో భాగంగా పట్టణ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు శుక్రవారం విద్యార్థులు, అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ సంతబైలులో పర్యటించారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పూల కుండీలు, డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిలో డెంగీకి కారణమయ్యే దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదని సూచించారు. తాలూకాలో 21 డెంగీ కేసులు నమోదయ్యాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, తాలూకా ఆరోగ్య అధికారి చంద్రమోహన రెడ్డి, అటవీ అధికారి హంసవి పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడు దర్శన్ నాయక్

యశవంతపుర: గంజాయి విక్రయిస్తూ మరో వైపు చోరీలకు పాల్పడుతున్న విరాజపేట తాలూకా అర్జి గ్రామానికి చెందిన ఎస్.దర్శన్ నాయక్(26) అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. హుణసూరు, హనగోడు, బిళికెరె, రామనాథపుర ప్రాంతాల్లో బైక్‌లు చోరీ చేసినట్లు విచారణలో తెలిసింది. అర్జీ గ్రామంలో నాలుగు రోజుల క్రితం గంజాయి అమ్ముతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే తనను ఏమి చేయలేరానే ధీమాతో దర్శన్ నాయక్ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు.

అట్టహాసంగా తిండిపోటీలు


రాగి ముద్ద, అరటిపండ్లు లాగిస్తున్న పోటీదారులు

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరంలోని కెవి వెంకటప్ప శిక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పంచగిరి బోధనాశాల ఆవరణంలో తిండి పోటీలు నిర్వహించారు. రాగి ముద్ద, అరటి పండ్లు తినే పోటీలలో మహిళలు సైతం పాల్గొని సుష్టుగా ఆరగించారు. శ్రీనివాస్ అనే వ్యక్తి రెండు కేజీల రాగి ముద్దను తిన్నారు. అదే విధంగా కేజిన్నర అరటిపండ్లు తినే పోటీలలో మహిళలు కూడా పాల్గొని ఆరగించారు. ఈ మనోరంజన కార్యక్రమంలో పోటీదారులను చూసి విద్యార్థులు బౌరా అంటూ నోరెళ్లబెట్టారు.

మహిమాన్వితం

- శంకరాచార్యులకు అమ్మవారు పరీక్షపెట్టిన స్థలం
- అమ్మవారిని దర్శిస్తే అంతా విజయమే

కొల్లూరు మూకాంబికా ఆలయం


కొల్లూరు మూకాంబికాదేవి ఆలయం


మూకాంబికాదేవి రథోత్సవం (ఫైల్)


సొపర్ణిక నది

బనశంకరి: కొల్లూరు మూకాంబికాదేవి ఆలయం కర్ణాటక, కేరళ రాష్ట్ర ప్రజలకు అత్యంత ప్రాచుర్యం కలిగిన ఆలయంగా ప్రత్యేకత సంతరించుకుంది. ఉడుపి జిల్లా మంగళూరుకు 147 కిలోమీటర్ల దూరంలో సౌపర్ణికనది ఒడ్డున కొల్లూరు మూకాంబికాదేవి ఆలయం వెలసింది. పచ్చని కొడచాద్రి పర్వతాల మధ్య ఉన్న ఈ ఆలయానికి ఏటా లక్షల మంది భక్తులు వస్తారు. పురాణాల ప్రకారం పూర్వం ఈ ప్రాంతాన్ని పాలించే బలవంతుడైన కౌమాసుర అనే రాక్షసరాజు తపస్సు చేసి తనకు చావు లేకుండా వరం ఇవ్వాలని కోరుతాడు. తన మనోబలంతో రాక్షసరాజు కోరికను పసిగట్టిన కోల మహర్షి విజయాన్ని సరస్వతికి తెలియజేస్తారు. దీంతో ఆమె శివుడు ప్రత్యక్షమయ్యే సమయంలో కౌమాసుర ఏమీ కోరుకోలేని విధంగా అతడిని మూగవాడిని చేస్తుంది. అప్పటి నుంచి ఈ రాక్షసరాజును అందరూ మూకాసురా అనే పేరుతో పిలుస్తారు. ఇంత జరిగినా ఆ రాక్షసరాజు తన గర్వం వీడక దేవతలను, యక్షులను హింసించేవాడు. దేవతలను కాక తనను పూజించాలని ఆజ్ఞాపించాడు. యజ్ఞ యాగాదులను నిర్వహించే వారిని హింసించి చంపేవాడు. దీంతో చలించిన మునీశ్వరులు కోలమహర్షి ఆధ్వర్యంలో పార్వతీదేవి వద్దకు వెళ్లి తమ బాధలను చెప్పుకున్నారు. దీంతో పార్వతీదేవి దైవగణంతో వచ్చి మూసాసురుడిని అంతమొందిస్తుంది.

కొడచాద్రి కొండల్లో

ఇది జరిగిన చాలా ఏళ్లకు ఆదిశంకరాచార్యులు కొడచాద్రి కొండల్లో ధ్యానం చేస్తున్నప్పుడు దేవి ఆలయన ఎదుట ప్రత్యక్షమై కోరిక అడగమని చెప్పింది. ఆయన దేవిని కేరళలోని ఒక ప్రాంతంలో తాను చెప్పిన చోట వెలిసి పూజలు అందుకోవాలని కోరారు. తద్వారా కేరళ సుభిక్షమవుతుందని ఆ ప్రాంతాన్ని సందర్శించిన వారికి వారు ఎన్నుకున్న రంగాల్లో విజయం సాధించేలా వరాలు ఇవ్వాలని అడుగుతాడు. దీనికి అంగీకరించిన దేవి మొదట మీరు వెళ్లాలని నేను మిమ్మల్ని వెంబడిస్తానని గమ్యం చేరేవరకు తిరిగి చూడరాదని ఒక పరీక్ష పెడుతుంది. గతంలో మూకాసురుడిని వధించిన ప్రాంతానికి వచ్చిన వెంటనే దేవి ఆగిపోతుంది. దేవి గజ్జల శబ్దం వినబడకపోవడంతో, శంకరాచార్యులు హఠాత్తుగా తిరిగి చూశాడు. వెంటనే దేవి శంకరను వెంబడించడం నిలిపి అక్కడ మూకాంబికాగా వెలుస్తుంది.

మూకాంబికాను దర్శిస్తే విజయం...

శంకరాచార్యులు విచారిస్తుండగా పార్వతిదేవి జరిగిన కథ మొత్తం చెప్పి ఇక్కడ తన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరుతుంది. ఇక్కడికి వచ్చిన వారికి నీవు కోరినట్లు వారు ఎంచుకున్న రంగంలో విజయం వరిస్తుందని వరమిస్తుంది. అప్పటి నుంచి నేటి వరకు చాలామంది రాజులు, రాజకీయనేతలు మూకాంబికాదేవిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తుంటారు.

ఏడు ముక్తి స్థలాల్లో ఒకటి...

కర్ణాటకలోని ఏడు ముక్తిస్థల యాత్రా స్థలాలైన కొల్లూ, ఉడుపి, సుబ్రమణ్య, కుంభాషి, కోటేశ్వర, శంకరనారాయణ, గోకర్ణతో పాటు మూకాంబికాదేవి ఆలయం ఒకటి. ఈ దేవస్థానం కేవలం కర్ణాటక ప్రజలే కాకుండా ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రజలకు ప్రాముఖ్యత కలిగిన ఆలయాల్లో ఒకటి. మంగళూరుకు 147 కిలోమీటర్ల దూరంలో సొపర్ణికనది ఒడ్డున వెలసింది.


కొల్లూరు మూకాంబికాదేవి

కొండ శిఖరంపై

మూకాంబికా దేవత మొట్టమొదటి స్థానం కొడచాద్రి శిఖరంపై ఉందని సామాన్య ప్రజలకు కొండపైకి వెళ్లడం చాలా కష్టతరంకావడంతో శంకరాచార్యులు దేవస్థానాన్ని కొల్లూరులో తిరిగి స్థాపించారని ప్రజలు నమ్ముతారు. ఇక్కడ పంచముఖ గణేశ యొక్క శిల్ప నిర్మాణం విశిష్టంగా ఉంటుంది. మూకాంబికాదేవిని శక్తి, సరస్వతి, మహాలక్ష్మీ స్వరూపంగా భావించడంతో భక్తులకు మూకాంబికా దేవిపై అపార విశ్వాసం ఉంది.

పంచలోహ విగ్రహం...

శ్రీచక్ర మీద ఉన్న దేవత యొక్క పంచలోహ మూర్తిని (ఐదులోహ మిశ్రమం) ప్రతిష్ఠించారు. ఆ దేవత జ్యోతిర్లింగ రూపంలో శివ మరియు శక్తి ఇద్దరిని కలిపి ఉంటుంది. ఇక కొల్లూరు శ్రీమూకాంబికా ఆలయంలో శ్రీసుబ్రమణ్య, శ్రీపార్థేశ్వర, శ్రీ పంచముఖ గణపతి, శ్రీచంద్రమౌళీశ్వర, శ్రీప్రాణలింగేశ్వర, శ్రీనంజుండేశ్వర, శ్రీ ఆంజనేయ, శ్రీవెంకటరమణ, శ్రీతులసి గోపాలకృష్ణ తదితర విగ్రహాలు వీక్షించవచ్చు. నవరాత్రి ఉత్సవాల్లో మూకాంబికా ఆలయం భక్తులతో పోటెత్తుతుంది. భక్తులకు ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తారు. కొల్లూరు మూకాంబికా మెటల్ రోడ్డు ద్వారా చేరుకునే వీలు కలిగి ఉంది. మంగళూరు, ఉడుపి, కుందాపుర నుంచి నేరుగా బస్సులు సౌలభ్యం కలిగి ఉంది. కొంకణ్ రైల్వేదారిలోని కుందాపుర లేక మూకాంబికారోడ్డు, బైందూరు అత్యంత చేరువలో ఉన్న రైల్వేస్టేషన్లు. బెంగళూరు నుంచి ఇక్కడకు రైలు సౌకర్యం ఉంది.


కొడచాద్రి పర్వత ప్రకృతి రమణీయ దృశ్యం


కొడచాద్రి పర్వతంపై ట్రెక్కింగ్

సీఎం రాజీనామా చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ సుధాకర్

చిక్కబళ్లాపురం: వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని ఎంపీ సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కబళ్లాపురం నగరంలోని ఒక్కలిగ కల్యాణ మంటపంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలిలో రిజర్వుచేసిన నిధులను తెలంగాణా రాష్ట్ర ఎన్నికల్లో వినియోగించుకున్నారని సుధాకర్ మండిపడ్డారు.

బస్సు ఢీకొని బైకిస్టు మృతి

మైసూరు : బస్సు ఢీకొని బైకిస్టు మృతి చెందాడు. ఈఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా గోతకాళదహుండి గ్రామంలో చోటు చేసుకుంది. హలసురు గ్రామానికి చెందిన శివు(24), లోకేష్(30)లు బైక్‌లో స్వగ్రామం నుంచి వేరే ఊరికి వెళ్తుండగా గోతాళకాలదహుండి గ్రామం వద్ద ఉన్న చెరువుకట్టపైకి రాగానే యడియాల వైపు నుంచి వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన శివు మృతి చెందగా లోకేష్ గాయపడ్డాడు. సరగూరు పోలీసులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

స్నేహితుడి దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

మైసూరు: స్నేహితుడు చాకుతో పొడవడటంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటన మైసూరులోని ఎంచలగుడిలో చోటుచేసుకుంది. మైసూరు తాలూకా డి.సాలుండి గ్రామానికి చెందిన నాగేగౌడ కుమారుడు విజయ్‌భాస్కర్(32) తన స్నేహితుడు అతిన దేవరాజుతో కలిసి ఆదివారం రాత్రి కెంచలగూడు సమీపంలోని బార్ ముందు ఏదో విషయంపై గొడవ పడ్డారు. స్థానికులు కలగజేసుకొని సర్దిచెప్పి పంపించారు. విజయభాస్కర్ తనబైకులో మరో స్నేహితుడు కార్తీక్‌తో కలిసి డి.సాళుండిలోఉన్న ఇంటికి వెళ్తుండగా కెంచలగూడు గేట్ వద్దకు రాగానే వెనుకాల బైక్‌పై వచ్చిన దేవరాజు చాకుతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విజయభాస్కర్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని జయనగర పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మైముల్ అధ్యక్షుడి రాజీనామాకు ఆమోదం

మైసూరు: మైసూరు పాల సమాఖ్య(మైముల్) అధ్యక్ష స్థానానికి పీఎం ప్రసన్న ఇచ్చిన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. జూన్ 30న రాజీనామా పత్రం సమర్పించారు. నిబంధనల మేరకు 18 రోజుల్లోగా రాజీనామా పత్రాన్ని వాపసు పొందేందుకు గడువు ఉంటుంది. ఆ సమయంలోపు వాపసు పొందనందున రాజీనామాను ఆమోదించారు. ఎండీ రాజీనామా అంగీకారం గురించి జిల్లాధికారికి సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత సహకార సంఘాల జాయింట్ కంట్రోలర్‌కు పంపిన తర్వాత కొత్త అధ్యక్షుడి ఎంపికకు ఎన్నికల తేదీని నిర్ణయిస్తారని అధికారులు తెలిపారు. ప్రసన్న రాజీనామాతో ఖాళీ పడిన అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేసేందుకు అప్పుడే పలువురు పోటీ పడుతున్నారు. ఇప్పటికే కొందరు చాముండేశ్వరి నియోజకవర్గ జేడీఎస్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ ఇంటికి వెళ్లి కలుస్తున్నారు. ప్రభుత్వ ప్రతినిధులు, నామినేటెడ్ సభ్యుల బలంతో అధికార పగ్గాలు చేపట్టేందుకు మంత్రి కే.వెంకటేష్ ఆశీస్సులు పొందే ప్రయత్నం చేస్తున్నారు.

మూడేళ్ల తర్వాత మళ్లీ లోకాయుక్త దాడి

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా రామేశ్వర గ్రామం పశువుల ఆస్పత్రి సీనియర్ అధికారి ఆర్ సిద్దప్ప ఇంటిపై శుక్రవారం లోకాయుక్త అధికారులు దాడి నిర్వహించారు. సిద్దప్ప ఇంటిపై మూడేళ్ల క్రితం లోకాయుక్త దాడి జరిగింది. సస్పెన్షన్‌లో ఉన్న సిద్దప్ప రెండేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించి మళ్లీ ఉద్యోగంలో చేరారు. తాజాగా మరోమారు సిద్దప్ప ఇంటిలో సోదాల జరిగాయి. దొడ్డబళ్లాపురం తాలూకా నాగేనహళ్లిలోని సిద్దప్ప ఇల్లు, అతడి బంధువు ఇంట్లో సోదాలు నిర్వహించారు. అనంతరం రామేశ్వరం పశువుల ఆస్పత్రిలో కూడా సోదాలు చేశారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న

దొడ్డబళ్లాపురం: తమ్ముడిని అన్న దారుణంగా హత్య చేసిన సంఘటన నెలమంగల తాలూకా ఎలెక్యానహళ్లిలో చోటుచేసుకుంది. చిన్నాన్న కుమారుడైన నవీన్.. నాగేశ్‌ను కత్తితో పొడిచి హత్య చేసాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకున్న దాబస్‌పేట పోలీసులు నవీన్‌ను అరెస్టు చేసారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చింతామణి: డెంగీ వంటి అంటు వ్యాధుల నియంత్రణకు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తాలూకా ఆరోగ్య అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో ఆరోగ్య అధికారులు పర్యటించి డెంగీపై ప్రజలను జాగృతం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షబ్బీర్, అధికారులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంకణీకోట తాలూకాలో కలెక్టర్ పర్యటన


ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కెలమంగలం: ప్రజల వద్దకే ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ శరయు డెంకణీకోట తాలూకాలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. మొదటగా కెలమంగలం పట్టణ పంచాయతీలోని తెలుగు ప్రాథమిక పాఠశాల, మల్లసంద్రం గ్రామపంచాయతీ అటకలాపురం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న ప్రాథమిక పాఠశాల, తళి సమితిలోని మరదనపల్లి పంచాయతీ క్రిస్తుపాళ్యంలోని ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. అక్కడి పిల్లలకు అందజేసే అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం డెంకణీకోట పట్టణ పంచాయతీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను, కెలమంగలం సమితి ఉణిసెట్టి గ్రామంలోని ప్రాథమిక ఆస్పత్రిలో రోగులకు అందజేసే వైద్య పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. డెంకణీకోట పట్టణ పంచాయతీలో చెత్త విభజన కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంత వీధిలో హాస్టల్ వసతి పాఠశాల సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధికార్లు స్వామినాథన్, గిరీష్, పరిమేల్‌అళగన్, సుబ్రమణి, శాంతి, సతీష్‌బాబు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

వైద్య కళాశాలకు ఉపకరణాల వితరణ


ఉచిత వైద్య సేవలను వివరిస్తున్న తంబిదురై

హోసూరు: హోసూరులోని ప్రైవేట్ వైద్య కళాశాల ఆస్పత్రికి లయన్స్ క్లబ్ రూ. 31 లక్షల విలువ చేసే ఉపకరణాలను శుక్రవారం అందజేసింది. హోసూరు సమీపంలోని సెయింట్ పీటర్ ప్రైవేట్ వైద్య కళాశాల ఆస్పత్రిలో రోగులకు ఉచిత వైద్య సేవలందజేయడంతో పాటు అటవీ ప్రాంత గ్రామాల ప్రజలకు ఉచిత బస్సు వసతులు కల్పించి అక్కడి నుంచి రోగులను తీసుకొచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రితో సమానంగా రోగులకు సేవలందజేస్తుంది. దీంతో ఆస్పత్రికి అవసరమైన రోగులకు ఉత్తమ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఆస్పత్రి యంత్రాంగం చర్యలు చేపట్టింది. వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ వైద్య కళాశాల ఆస్పత్రికి స్వచ్ఛందంగా ఉపకరణాలందజేస్తున్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆస్పత్రి డైరక్టర్ తంబిదురై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... ఆర్థికంగా వెనుకబడిన సూళగిరి, డెంకణీకోట, అంచెట్టి తాలూకా ప్రజలకు సేవలందజేసే ఉద్దేశంతోనే ఈ హోసూరులో వైద్య కళాశాల ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు, ఈ ఆస్పత్రిలో మందుల ఖర్చులు మాత్రమే రోగులు భరించవలసి వస్తుందని, వైద్య పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందజేస్తూ ఓ ప్రభుత్వ ఆస్పత్రి అందజేస్తున్న సేవల కంటే ఎక్కువ సేవలు అందజేస్తున్నామని తెలిపారు. మరో వైపు గిరిజన ప్రాంతాల్లో ఉంటున్న రోగులకు ఉచితంగా బస్సు వసతి కల్పించి ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య చికిత్సలందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్య ఉపకరణాలను అందజేశారు.

రైల్వే అండర్ పాస్‌లో వర్షపు నీరు

- వాహనదారుల అవస్థలు


అండర్‌పాస్ సమీపంలో నిలిచిపోయిన వాహనదారులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో డ్రైయినేజీ వ్యవస్థ ఆధునీకరించకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే వర్షపునీరు రోడ్లపైకి వస్తోంది. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి వర్షపునీరు రోడ్లపైకి నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా హోసూరు రింగ్ రోడ్డు ఆర్సీ చర్చ్ సమీపంలో వరదనీరు రోడ్డుపైకి రావడంతో వాహనాలు వెళ్లలేక కిలోమీటర్ల తరబడి వాహనాలు స్తంభించి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అదే సమయంలో రైల్వే అండర్‌పాస్‌లో కూడా వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో వాహనదారులు వెళ్లలేక నిలిచిపోయారు. ఎక్కడ చూసినా వర్షపు నీరు ఉండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడవి పందులు అడ్డు రావడంతో....


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మురుగేషన్

హోసూరు: ద్విచక్ర వాహనంలో వెళ్తున్న సమయంలో అడవి పందులు అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాలు...డెంకణీకోట సమీపంలోని బాలతోటనపల్లి గ్రామానికి చెందిన మురుగేషన్ (42) గురువారం రాత్రి ద్విచక్ర వాహనంలో బాలతోటనపల్లి వైపు వెళ్లుతుండగా గెండగానపల్లి వద్ద అడవి పందుల మంద అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వ ఆస్పత్రి బిల్డింగ్‌పై నుండి దూకి రోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆనేకల్‌లో చోటుచేసుకుంది. మునియల్లప్ప (45) ఆత్మహత్య చేసుకున్న రోగి. అనారోగ్యంతో ఈనెల 16న ఆస్పత్రిలో చేరిన మృతుడు ఒకే రోజులో డిశ్చార్జ్ అయ్యి వెళ్లిపోయాడు. గురువారం మళ్లీ ఆరోగ్య సమస్యతో వచ్చి చేరిన మునియల్లప్ప శుక్రవారం ఉదయం బిల్డింగ్ పైకెక్కి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి అస్తమా, కడుపునొప్పి, జ్వరం ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఆనేకల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

ధాబా హోటళ్లపై పోలీసుల దాడి


ఓ హోటల్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: అనుమతి లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్న రెండు డాబా హోటళ్లను పోలీసులు సీజ్ చేశారు. వివరాలు... హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న డాబా హోటళ్లలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని జిల్లా ఎస్పీ తంగదురైకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్ నేతృత్వంలో సూళగిరి, కురుబరపల్లి పోలీసులు, అధికారులు డాబా హోటళ్లలో ఆకస్మిక దాడులు చేశారు. అళగుబావి వద్ద నిర్వహిస్తున్న డాబా హోటల్లో, కురుబరపల్లి సమీపంలో నిర్వహిస్తున్న ఓ హోటల్లో మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. హోటళ్ల యాజమానులను అరెస్ట్ చేసి సీజ్ చేశారు.

ఆలయంలో విశేష పూజలు



క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి బజార్ వీధిలో వెలసిన ప్రసిద్ధి పొందిన పేటమారియమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు జరిగింది. ఆషాడ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయంలోని ఓం శక్తి, పేటమారియమ్మ తదితర దేవతామూర్తులకు అభిషేకం, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సూళగిరి, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హోసూరు: భార్య విడిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని దేవీరపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు నాగరాజ్ (52)కు తాగుడు అలవాటుండడంతో కుటుంబంలో తరచూ గొడవలేర్పడుతుండేది. దీంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన నాగరాజ్ మద్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గమనించిన స్థానికులు క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందాడు. బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

నిందితులపై గూండా యాక్ట్


గూండా కేసులో అరెస్టైన నిందితులు

కెలమంగలం: పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరిపై కలెక్టర్ గూండా యాక్ట్ నమోదుకు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు... డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని గుడియూర్ గ్రామానికి చెందిన రుద్రన్ (28), అదే గ్రామానికి చెందిన మల్లేష్ (30)లపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో గత మే నెలలో గంజాయి విక్రయిస్తూ కెలమంగలం పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై గూండా కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ తంగదురై కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. ఆ మేరకు గూండా కేసు నమోదుకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఇరువురిపై కేసులు నమోదు చేసి సేలం జైలుకు తరలించారు.

తల్లీ కూతుళ్లు ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకొన్న తల్లీ కూతుళ్లు

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలో తల్లితో పాటు ఇద్దరు కూతుళ్లు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. వివరాల మేరకు బర్గూరు సమీపంలోని చిన్నబర్గూరు గ్రామానికి చెందిన కూలికార్మికుడు రమేష్ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఉదయం పాఠశాలకెళ్లే సమయంలో తల్లితో పాటు పెద్ద కూతురు ప్లస్టూ విద్యార్థిని నివేద (17), చిన్న కూతురు 8వ తరగతి షర్మిల (13)లు ఆత్మహత్య చేసుకొన్నారు. విషయం తెలుసుకొన్న బర్గూరు పోలీసులు ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేపట్టారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకొన్న ఘటన బర్గూరు ప్రాంతంలో తీవ్ర సంచలనం సృష్టించింది.

క్లుప్తంగా...

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడండి

- జిల్లా కలెక్టర్లు, అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

సాక్షి, అమరావతి: భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని, అధికారులంతా పూర్తి అప్రమత్తతతో ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వర్షాలు అధికంగా ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 31 శాతం అదనంగా వర్షపాతం నమోదైందన్నారు. వాతావరణ శాఖ ద్వారా వర్షాలు, వరదలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు చెప్పారు. ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారం ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల వల్ల గోదావరి కట్టలు బలహీన పడ్డాయని, వాటి పటిష్టతపై దృష్టిపెట్టాలని చెప్పారు. ఫ్లడ్ మాన్యువల్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విపత్తులు వచ్చినప్పుడే పనితీరు, సమర్థత బయటపడుతుందని, అధికారులు డైనమిక్ గా పనిచేయాలని అన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

మేలైన వంగడాలను సిద్ధం చేయండి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండి రైతులకు అండగా నిలవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు వ్యవసాయాధికారులను ఆదేశించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన జిల్లా వ్యవసాయ, సహాయ, మండల వ్యవసాయ శాఖాధికారులతో మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైతులు సాగు చేసేందుకు వీలుగా అధిక దిగుబడులనిచ్చే మేలైన వంగడాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలపై రైతులకు అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా విస్తరణ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. పంట తొలిదశల్లో వ్యాపించే రసం పీల్చు పురుగులు, పచ్చ పురుగు ఉధృతిని ముందుగానే గుర్తించి వాటి నివారణకు రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

యాజమాన్య పద్ధతులతో 'ముంపు' నుంచి వరికి రక్షణ

ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి

సాక్షి, అమరావతి: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురవుతున్న వివిధ దశల్లో ఉన్న వరి పంటను తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే కాపాడుకోవచ్చునని మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. జూన్‌లో విత్తిన పొలాలు పిలకలు దశలో, జూలైలో విత్తిన పొలాలు నారుమడి దశలో, నేరుగా విత్తిన పొలాలు మొలకదశ నుంచి మొక్క దశకు చేరుకుంటున్నాయని తెలిపారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2–3 రోజుల వయసులో మూడు రోజుల కన్నా ఎక్కువ సమయం నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. అందువల్ల ఈ పొలాల్లో వీలైనంత త్వరగా ముంపు నీరు బయటకు తీసివేయాలని పేర్కొన్నారు. విత్తిన ఏడు నుంచి 30 రోజుల మధ్యలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువ సమయం మునిగితే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మునిగిన నారుమడిలో నుంచి నీరు ఐదు రోజుల లోపు పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు. ఆ తర్వాత ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, కిలో పొటాష్ కలిపి వేయాలని చెప్పారు. ఒక గ్రాము కార్బెండిజమ్ లేదా 2 గ్రాముల కార్బెండిజమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకలు దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరాకు 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ అదనంగా వేసుకోవల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పెద్దారెడ్డి పూచీకత్తులు తీసుకోని పోలీసులు

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కేతిరెడ్డి సిద్ధం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఎన్నికల వేళ జరిగిన అల్లర్ల కేసుల్లో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వచ్చిన బెయిల్‌కు సంబంధించి పూచీకత్తులు తీసుకోవడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు. ఈ కేసుల్లో హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తులను తీసుకుని తాడిపత్రికి వచ్చేందుకు పెద్దారెడ్డి సిద్ధమవగా.. పోలీసులు అడ్డుకుంటున్నారు. తాము చెప్పే వరకు తాడిపత్రికి రాకూడదంటూ హుకుం జారీ చేస్తున్నారు. మూడు రోజులుగా పోలీసులకు సమాచారం చేరవేస్తున్నా.. వారి వైఖరిలో మార్పు రావడం లేదు. హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి సిద్ధమవుతున్నారు.



ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో గండిపడిన పెదవాగు ఆనకట్ట



భోగాపురంలో కొట్టుకుపోయిన విమానాశ్రయం రేకుల ప్రహరీ



తూర్పు గోదావరి జిల్లా యర్నగూడెంలో పొంగి ప్రవహిస్తున్న గండి చెరువు

ముంచిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం ● వేలాది ఎకరాల్లో పంట నీటమునక

పట్టించుకోని ప్రభుత్వం.. పునరావాస కేంద్రాలు నిల్

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. దీంతో పలు జిల్లాల్లో వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏజెన్సీ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా వరద నీరు చేరడంతో గోదావరి, కృష్ణా నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వాడ, ఎర్ర కాలువలు ఉగ్రరూపం దాల్చాయి. జిల్లాలో చేపలవేటకు వెళ్ల ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు జిల్లాలో పెద్దవాగు ఆయకట్టు తెగిపోవడంతో పలు గ్రామాల్లో వందలాది ఇళ్లు కొట్టుకుపోయాయి.



ఏలూరు జిల్లా అల్లూరినగర్ గ్రామంలో పెదవాగు ప్రవాహానికి దెబ్బతిన్న ఇళ్లు



ఏలూరు జిల్లా కొమ్మరగూడెంలో కూలిపోయిన గుడిసెలు

సాక్షి నెట్‌వర్క్: తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు నియోజకవర్గం మద్దూరులంక గ్రామం నీట మునిగింది. కొవ్వాడ కాలువ ఉగ్రరూపం దాల్చింది. తాళ్లపూడి మండలం పోచవరం, తాడిపూడి, గజ్జరం, అన్నదేవరపేట, పెద్దేవం, తిరుగుడుమెట్ట, మలకపల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. ఎర్రకాలువ ఉగ్రరూపం దాల్చడంతో నిడదవోలు మండలంలోని 12 గ్రామాలు వరద నీటితో వణుకుతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 48,605 హెక్టార్లలో వరి నాట్లు పూర్తవగా 7,965 హెక్టార్లలో పంట నీట మునిగింది. 18 మండలాల్లోని 178 గ్రామాల్లో 9,613 మంది రైతులకు చెందిన వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. నిడదవోలు పట్టణం తీరిగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు ఎర్ర కాలువలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వందలాది ఎకరాల్లో వరి నారుమడులు, నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. కొబ్బరితోటల్లో ముంపునీరు చేరింది. వర్షాలతో ఇటుక బట్టీలకు గట్టిదెబ్బ తగిలింది. గోదావరి ఉధృతికి జిల్లాలో పి.గన్నవరం, ముమ్మిడివరం మండలాల్లో లంక గ్రామాలకు వెళ్లే తాత్కాలిక రహదారులు కొట్టుకుపోయాయి.

ఉధృతంగా కట్టలేరు..

పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు రూరల్ దువ్వ రెగ్యులేటర్ వద్ద గల కొత్తపేట కాలనీ ముంపునకు గురైంది. తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ సమీప గ్రామాలను ముంపు భయం వెంటాడుతోంది. భీమవరంలోని యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో పట్టణంలోని పలు ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. జిల్లా వ్యాప్తంగా 13,500 ఎకరాల్లో తొలకరి పంట పొలాలు నీట మునిగాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలో భారీ వర్షాలకు తోటమూల–వినగడప గ్రామాల మధ్య కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కల్వర్టుకు రెండు వైపులా ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాకపోకలు నిలిపివేశారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రేకుల ప్రహరీ కొట్టుకుపోయింది. శ్రీకాకుళం జిల్లాలో గొట్టా బ్యారేజీలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. గుంటూరు జిల్లాలో 1,304 హెక్టార్లలోని వరి సాగు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తుండడం, వాగులు, కాలువలు పొంగుతుండడంతో విపత్తుల నిర్వహణ సంస్థ అత్యవసర సహాయక చర్యల కోసం ఏలూరు జిల్లాకు రెండు ఎస్డీఆర్ఎఫ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఒక ఎస్డీఆర్ఎఫ్, తూర్పుగోదావరి జిల్లాకు రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పంపింది.

పెద్ద వాగు ఉధృతితో కొట్టుకుపోయిన ఇళ్లు..

ఏలూరు జిల్లాలో పెద్ద వాగు ప్రాజెక్టు ఆయకట్టు గురువారం రాత్రి తెగిపోవడంతో ఈ వాగు వెంబడి ఉన్న ఊళ్లన్నీ కకావికలమయ్యాయి. రహదారి సౌకర్యం లేక బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వేలేరుపాడు మండలం మేడేపల్లి మొదలుకొని పాత పూచిరాల వరకు ఇళ్లన్నీ పెద్దవాగు ప్రవాహ ఉధృతిలో కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటపడ్డారు. మేడేపల్లిలో సుమారు 60 ఇళ్ల వరకు పాక్షికంగా దెబ్బతినగా మరికొన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక రేకుల షెడ్లు కూలిపోయాయి. కమ్మరగూడెంలో 240 కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ప్రస్తుతం ఈ గ్రామస్తులు అశ్వారావుపేట మండలం కోయరంగాపురం సమీపంలో గుట్టపై తలదాచుకుంటున్నారు. అల్లూరినగర్‌లో 80 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాత పూచిరాల, గుండ్లవాయి, రామవరం, ఉదయనగర్, రామవరం ఊటగుంపు, ఒంటిబండ, కోయ మాధవరం గ్రామాల్లో సుమారు 80 ఇళ్ల వరకు నేలమట్టమయ్యాయి. విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కనీసం కొవ్వొత్తులు, బియ్యం కూడా ఇవ్వలేదు. నీట మునిగిన గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఏలూరు జిల్లాలోని పోలవరం ఏజెన్సీ ఏరియా జలదిగ్బంధంలో చిక్కుకుంది. పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

విజయనగరం జిల్లా గోవిందపురంలో 20.3 సెంటీమీటర్ల వర్షం

నేడు ఒడిశాలోని పూరీ సమీపంలో వాయుగుండం తీరం దాటే అవకాశం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం వాయవ్య దిశగా పయనించి శనివారం తెల్లవారుజామున ఒడిశాలోని పూరీ సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. ఇప్పటికే కోస్తాంధ్రలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో శనివారం విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం సాయంత్రానికి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజుల పాటు వర్షాలకు కొంత విరామం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే.. వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 55 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపారు. ఈ నెల 20 వరకు మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. వాయవ్య బంగాళాఖాతంలో ఈ నెల 23న మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయన్నారు.

గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకూ వర్షపాతం వివరాలు..

ప్రాంతం	జిల్లా	వర్షపాతం (సెం.మీ)
గోవిందపురం	విజయనగరం	20.3
పాతకొప్పెర్ల	విజయనగరం	16.5
పైడి భీమవరం	శ్రీకాకుళం	13.9
బయ్యనగూడెం	ఏలూరు	12.5
తాడువాయి	ఏలూరు	12.4
కాకర్లమూడి	ఏలూరు	12.2
మండపేట	బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	11.6

విద్యాసంస్థలకు సెలవు

ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. మచిలీపట్నం, నిజాంపట్నం పోర్టులలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా శనివారం అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అన్ని విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు.



తూర్పు గోదావరి జిల్లా పోచవరంలోని శ్మశాన వాటిక రోడ్డు మునిగిపోవడంతో మృతదేహాన్ని నీటిలోనే మోసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు



కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం మునిపెడ సమీపంలో వర్షం నీటిలో మునిగిపోయిన వరి పొలం



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం లోపలికి చేరిన వరద నీరు

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ.. ఉధృతంగా గోదావరి

- తుంగభద్ర డ్యామ్‌లోకి 1.08 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- నేడు మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ అంచనా
- గోదావరిలో మరింత పెరిగిన వరద
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 3.46 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి దిగువకు చేరుతున్న వరద

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/ధవళేశ్వరం: శ్రీశైలం మల్లన్న చెంతకు కృష్ణమ్మ శనివారం చేరుకోనుంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి విడుదల చేస్తున్న వరద ప్రవాహం శుక్రవారం తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు చేరుకుంది. జూరాలలో విద్యుత్ కేంద్రం, ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్న వరద ప్రవాహం శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుకోనుంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కేంద్రంలో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 7,063 క్యూసెక్కులను దిగువకు తరలిస్తుండటంతో నీటి నిల్వ 33.11 టీఎంసీలకు తగ్గింది. నాగార్జునసాగర్‌లోకి వరద ప్రవాహం చేరడం లేదు. సాగర్ కుడి కాలువ, ఏఎమ్మార్పీ ద్వారా 8,165 క్యూసెక్కులను విడుదల చేస్తుండటంతో నీటి నిల్వ 123.5 టీఎంసీలకు తగ్గింది. పులిచింతల ప్రాజెక్టులోకి 174 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 0.74 టీఎంసీలకు చేరుకుంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,064 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టా కాలువలకు 6,596 క్యూసెక్కులను వదులుతున్నారు. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,08,270 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 58.67 టీఎంసీలకు చేరుకుంది. శనివారం తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) అంచనా వేసింది.

పెరిగిన గోదా'వడి'

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరిలో వరద ఉధృతి శుక్రవారం మరింత పెరిగింది. ప్రాణహిత, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, శబరి ఉప నదులతో పాటు కొండ కాలువల నీళ్లు కూడా కలవడంతో భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 3.75 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం 40.2 మీటర్ల(సముద్ర మట్టానికి)కు చేరింది. పోలవరం ప్రాజెక్టులోకి 3.50 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 48 గేట్లను ఎత్తేసి అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. శుక్రవారం సాయంత్రం బ్యారేజీ వద్ద నీటిమట్టం 7 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీలోకి 3,48,191 క్యూసెక్కులు చేరుతుండగా.. డెల్టా కాలువలకు 1,800 క్యూసెక్కులు వదులుతూ మిగిలిన 3,46,391 క్యూసెక్కులను బ్యారేజీ నుంచి 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. శనివారం వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది. జలవనరుల శాఖ అధికారుల అప్రమత్తమై ధవళేశ్వరంలోని ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి బ్యారేజీ వద్ద పరిస్థితిని పరిశీలించారు.

ఉరివేసి చంపేందుకు టీడీపీ నేతల యత్నం



ఎర్రయ్య వీపుమీద గాయాలు



ముస్తాబాదలో ధ్వంసం చేస్తున్న వెంచర్ ఆర్చి

- గ్రామస్తుల రాకతో బతికిపోయిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త
- తిరుపతి జిల్లా కొత్తకండ్రిగలో ఘటన
- కృష్ణా జిల్లా ముస్తాబాదలో వైఎస్సార్‌సీపీ నేత వెంచర్ ధ్వంసం

శ్రీకాళహస్తి/గన్నవరం: తన కుమారుడితో కలిసి ఆటోలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను అటకాయించి ఉరివేసి చంపేందుకు యత్నించిన ఘటన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తకండ్రిగకు చెందిన పాళి ఎర్రయ్య తన 11 ఏళ్ల కుమారునితో శ్రీకాళహస్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, సురేష్ అటకాయించారు. 'వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేస్తావా' అంటూ కర్రలతో దాడి చేశారు. ఎర్రయ్య మెడకు టవల్ చుట్టి ఉరివేసి చంపే ప్రయత్నంలో ఉండగా.. ఎర్రయ్య కుమారుడు ఊళ్లోకి వెళ్లి గ్రామస్తుల్ని తీసుకువచ్చాడు. గ్రామస్తులు అడ్డుకోవడంతో టీడీపీ నేతలిద్దరూ పరారయ్యారు. బాధితుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. టీడీపీ నేతల దాడిలో తాను కిందపడిపోగా.. మెడకు టవల్ బిగించారని ఎర్రయ్య తెలిపాడు. గ్రామస్తులు రాకపోతే తన ప్రాణాలు దక్కేవి కాదన్నాడు. ఈ ఘటనపై తొట్టంబేడు ఎస్ఐని వివరణ కోరగా.. సురేష్, వెంకటసుబ్బయ్య తనపై దాడి చేశారని ఎర్రయ్య ఫిర్యాదు చేశాడన్నారు. ఘటనపై విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

రియల్‌ఎస్టేట్ వెంచర్ ధ్వంసం

కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాదలో వైఎస్సార్‌సీపీ నేత మేచినేని వెంకటశివసత్యనారాయణ (బాబు)కు చెందిన భూముల్లో ఓ ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను టీడీపీ నేతలు గురువారం ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత బొబ్బా ప్రసాద్, మరికొందరు నేతలు జేసీబీలతో వెంచర్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఆర్చిని కూల్చివేశారు. వెంచర్‌లోని రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వివేశారు. ఘటనపై గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు మేచినేని బాబు తెలిపారు.

బ్యూటిప్

బనానా ఫేస్ ప్యాక్





బాగా పండిన అరటి పండు గుజ్జు అర కప్పు తీసుకుని అందులో టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. వారానికి రెండుసార్లు ముఖానికి ఈ ప్యాక్ వేస్తుంటే పిగ్మెంటేషన్, సన్నని గీతలు, ముడతలు తొలగిపోయి చర్మం యవ్వనాన్ని సంతరించుకుంటుంది.

స్ఫూర్తి



కూతురి కోసం పంటనే పండించింది

తల్లిగుణం అందరి మేలు కోరుతుంది. కూతురి అనారోగ్య సమయంలో డ్రాగన్ ఫ్రూట్ తినిపించాలని వెతికితే దాని ఖరీదు సామాన్యులకు అందుబాటులో లేదనిపించిందామెకు. తన కూతురు లాంటి వాళ్లు ఎందరో ఈ పండుకు దూరం కావలసిందేనా అని బాధ పడింది. పట్టుదలతో ఏకంగా పంటే పండించింది. డ్రాగన్ ఫ్రూట్ రైతు రేణుక కథ ఇది.

'మీ అమ్మాయికి ప్లేట్‌లెట్స్ బాగా పడిపోయాయి. ప్లేట్‌లెట్స్ పెరగడానికి డ్రాగన్ ఫ్రూట్ తినిపించమ్మా' అని డాక్టర్ చెప్పిన మాట ఆ తల్లిని డ్రాగన్ పంట స్వయంగా సాగు చేసే వరకు తీసుకువెళ్లింది.

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన రేణుక, పరశురాములు దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు. ఇంటర్ చదువుతున్న కూతురు విజయకు కరోనా కాలంలో సుస్తీ చేసింది. కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయని గుర్తించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ పెరగడానికి డ్రాగన్ ఫ్రూట్ తినిపించమని చెప్పారు.

దాంతో తల్లి రేణుక కామారెడ్డి పట్టణంలో పండ్ల దుకాణాలన్నింటా డ్రాగన్ ఫ్రూట్ కోసం తిరిగితే ఎక్కడా దొరకలేదు. ఆఖరుకు ఒక సూపర్ మార్కెట్‌లో దొరికాయి. ఒక్కో పండు రూ.180 చెప్పారు. అంత ఖరీదా అని ఆశ్చర్యపోయింది రేణుక. అంత రేటు పెట్టాల్సి వచ్చినందుకు చిన్నబుచ్చుకుంది. అయినా సరే కొనుగోలు చేసి తీసుకువెళ్లి కూతురికి తినిపించింది. ఆమె ఆరోగ్యం మెరుగుపడిన తరువాత ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువెళ్లారు.

మనం ఎందుకు పండించకూడదు?

రేణుకకు చదువు లేదు. కానీ వ్యవసాయం మీద మంచి పట్టు ఉంది. రేణుక భర్త పరశురాములు కూడా చదువుకోకున్నా ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్న ఆశ ఉంది. అంతవరకూ సంప్రదాయ సేద్యం చేస్తున్న ఆ ఇద్దరూ కూర్చుని 'డ్రాగన్ ఫ్రూట్' గురించి చర్చించుకున్నారు. 'మనం పండించి తక్కువకు అమ్ముదాం' అంది రేణుక. ఆ తర్వాత భర్తతో కలిసి డ్రాగన్ ఫ్రూట్ సాగు పద్ధతుల గురించి పిల్లలతో కలిసి యూ ట్యూబ్‌లో చూసింది. ఆ పంట పండించాలన్న నిర్ణయానికి వచ్చిన రేణుక, పరశురాములు జగిత్యాల జిల్లాలోని అంతర్గాంలో డ్రాగన్ ఫ్రూట్ కు సంబంధించిన మొలకలు దొరుకుతాయని తెలుసుకున్నారు. ఓ రోజు అక్కడికి వెళ్లి పంట సాగు గురించి వారితో మాట్లాడారు. ఎకరంలో సాగు చేయడానికి ఎంత ఖర్చు అవుతుందో, ఎన్ని మొక్కలు అవసరమవుతాయో అడిగి తెలుసుకున్నారు. వాళ్లిచ్చిన సూచనల మేరకు ఇంటికి చేరుకున్న తరువాత ఎకరం పొలం దుక్కి దున్నారు. చుట్టూరా ఇనుపజాలీతో కంచె ఏర్పాటు చేశారు. మొక్కల కోసం స్తంభాలు, కర్రలను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే డ్రిప్ సౌకర్యం కల్పించుకున్నారు. పొలం తనఖా పెట్టి రూ.3 లక్షలు, అలాగే డ్వాక్రా సంఘం నుంచి రూ. 2 లక్షలు అప్పు తీసుకుని పంట సాగు మొదలుపెట్టారు.

43 పండ్లు దక్కాయి

పంట సాగు చేసిన తొలి ఏడాది నలభై మూడు పండ్లు మాత్రమే చేతికందాయి. దాంతో మరిన్ని మెళకువలు తెలుసుకుని మరింత కష్టపడి సాగు చేయడంతో రెండో ఏడాదికి వచ్చేసరికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దళారులకు అమ్మితే గిట్టుబాటు కాదని భార్య, భర్త ఇద్దరూ గంపల్లో పండ్లను పెట్టుకుని సిద్దిపేట, మెదక్, కామారెడ్డి తదితర పట్టణాలకు తీసుకు వెళ్లి ఒక్కో పండు. వంద నుంచి రూ.150 వరకు అమ్ముకుంటే రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈసారి రూ.4 లక్షలు ఆదాయం సమకూరుతుందన్న నమ్మకంతో ఉన్నారు. పది పదిహేనేళ్లపాటు పంట వస్తుందని, తాము అనుకున్నదానికన్నా ఎక్కువే సంపాదిస్తామన్న ధీమాతో ఉన్నారు.

– ఎస్.వేణుగోపాలాచారి, సాక్షి, కామారెడ్డి



ఇదేం పంట అన్నారు

నా బిడ్డ ఆరోగ్యం కోసం డ్రాగన్ ఫ్రూట్ కొనడానికి దుకాణాలన్నీ తిరిగినా దొరకలేదు. ఆ రోజే అనిపించింది. ఇంత మంచి పండు మాలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండాలని. మేమిద్దరం కలిసి పంట సాగుకు నిర్ణయం తీసుకున్నాం. మొదట్లో అందరూ ఇదేం పంట అని పెదవి విరిచారు. ఇప్పుడు పంటను చూసి మెచ్చుకుంటుంటే ఎంతో సంతోషం అనిపిస్తుంది. మా దగ్గరకి చాలా మంది వచ్చి పండ్లు కొంటున్నారు.

– రేణుక, డ్రాగన్ ఫ్రూట్ సాగుదారు

నేడు ఇంటర్నేషనల్ మూన్ డే



చల్లని రాజా ఓ చందమామా

చందమామ రావే... జాబిల్లి రావే.. అని ఎంత పిలిచినా దగ్గరకు రాని చందమామ దగ్గరకు మనిషే వెళ్లాడు. జూలై 20, 1969 నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి పై కాలు మోపిన రోజు. అతడే చెప్పినట్టు అది 'మానవ జాతి ముందంజ'. అయినా సరే... నేటికీ చందమామ ఒక నిగూఢ దీపం. రహస్యాల మయం. మానవజాతికి ఈ రేరాజు ఆత్మీయుడు, అందమైన స్నేహితుడు, ప్రియతముడు, మేనమామ. అతని చుట్టూ ఎన్నో కథలూ గాథలూ కల్పనలు. నేడు 'ఇంటర్నేషనల్ మూన్ డే'. కాబట్టి శశికాంతుని సంగతులు కొన్ని...

కుందేలు ఇలా వచ్చిందట!

చంద్రుడిపై కుందేలు అనేది అందమైన అబద్ధమైనా అది మనకు అమితంగా ఇష్టమైన అబద్ధం! అసలు మన కుందేలు అక్కడెక్కడో ఉన్న చంద్రుడిపైకి ఎలా చేరింది? ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక నమ్మకం ప్రకారం.... బుద్ధుడు ఊరూరా తిరిగి, బోధనలు చేసి అలిసిపోయాడు. ఆకలితో ఉన్నాడు. ఇది గమనించిన జంతువులు తమకు తోచిన పరిధిలో బుద్ధుడు తినడానికి రకరకాల పదార్థాలు తీసుకువచ్చాయి. పాపం! ఒక కుందేలు దగ్గర మాత్రం ఏమీ ఉండదు. 'నన్ను తిని మీ ఆకలి తీర్చుకోండి' అంటూ మంటల్లో దూకి చనిపోతుంది కుందేలు. కుందేలు ఆత్మత్యాగానికి చలించిన బుద్ధుడు దానికి అమరత్వాన్ని ప్రసాదిస్తాడు. చంద్రుడిపై ఉండి కనువిందు చేసేలా వరమిస్తాడు.

మూడుసార్లు పుట్టాడు...

ఎవరైనా సరే ఒక్కసారే పుడతారు. పురాణాల ప్రకారం చంద్రుడు మాత్రం మూడుసార్లు పుట్టాడు. అందుకే చంద్రుడిని త్రిజన్మి అని కూడా అంటారు. చంద్రుణ్ణి మొదటిసారి బ్రహ్మ సృష్టించాడు. రెండోసారి అత్రి మహర్షి కన్నుల నుంచి ఉద్భవించాడు. రాక్షసులు, దేవతల క్షీర సాగర మథనంలో లక్ష్మీదేవితో పాటు చంద్రుడు పునర్జన్మ పొందాడు.

డస్ట్‌బిన్ కాదు...

మనిషంటేనే నిరంతరం చెత్తను పారబోస్తుండే జీవి. అతడా చెత్త వేయడానికి భూగ్రహం సరిపోక చంద్రుని మీదా బోలెడంత పారబోస్తున్నాడు. పనికి రాకుండా పోయిన రోవర్లూ, విఫలమైన రాకెట్లూ, పంపిన ఉపగ్రహాలూ, ఆస్ట్రోనాట్ల బూట్లూ, బ్లాంకెట్లూ ఇలాంటివెన్నో అక్కడ. అంత రిస్క ప్రయాణికులు బ్యాగుల్లో పోసి అక్కడ పారబోసిన యూరిన్ బ్యాగులే 100కు పైగా ఉన్నాయక్కడ. ఇలా ఇప్పటివరకూ చంద్రుడి మీద మనిషి పారబోసిన చెత్త బరువు ఎంతో తెలుసా? అక్షరాలా 2,27,000 కిలోలు.

చంద్రకంపాలు

మనకు భూకంపాలలాగే చంద్రుడి మీదా చంద్రకంపాలు వస్తుంటాయి. ఇంగ్లిషులో మూన్ క్వేక్స్. ఇవి మళ్లీ నాలుగు రకాలు. చాలా లోతుగా వచ్చేవి డీప్ క్వేక్స్, ఉల్కలేవైనా చంద్రుణ్ణి ఢీకొడితే వచ్చేవి మీటియోరైట్ ఇంపాక్ట్స్, సూర్యుడి ఉష్ణోగ్రతతో వచ్చేవి థర్మల్ క్వేక్స్... ఇవి మూడూ ఒక రకం. కానీ 'షాలో మూన్ క్వేక్స్' మాత్రం చాలా భయంకరం. భూకంపం సెకన్లపాటు కొనసాగితేనే మహా ఉత్పాతం కదా... కానీ చంద్రకంపం దాదాపు పదినిమిషాలు మొదలుకొని అరగంట పాటూ అదేపనిగా వస్తుంది.

లూనార్ స్మెల్...

చంద్రునికో వాసన కూడా ఉంటుంది. దాన్నే 'లూనార్ స్మెల్' అంటారు. అక్కడ వాతావరణం ఉండదు. అప్పుడు స్మెల్ ఎలా అనే అనుమానం రావచ్చు. అపోలో-11కు చెందిన ఆస్ట్రొనాట్స్ అందరి స్పేస్ సూట్‌లకు అంటుకుపోయి ఒకే లాంటి వాసన కొట్టడంతో ఈ విషయం తెలిసొచ్చింది. ఘాటైన మెటాలిక్ స్మెల్‌లాగా. క్రాకర్స్ కాలిపోయాక బాగా మండిన గన్‌పౌడర్‌లా ఉండే వాసన ఇదంటూ ఖచ్చితంగా తెలిపినవాడు హరిసన్ జాక్ స్మిత్ అనే అపోలో-17 కు చెందిన సైంటిస్ట్ ఆస్ట్రొనాట్.



ధారాసింగ్ ముందే అడుగు పెట్టాడు

'ఇదెలా సాధ్యం!' అనుకోవద్దు. సినిమాల్లో ఏదైనా సాధ్యమే కదా! విషయంలోకి వస్తే....1967లో హిందీలో 'చాంద్ పర్ చదాయి' అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో ప్రఖ్యాత రెజ్లర్ ధారాసింగ్ వ్యోమగామి ఆనంద్ పాత్రలో నటించాడు. తన అసిస్టెంట్ 'భాగు'తో కలిసి చంద్రుడిపై అడుగు పెట్టిన ఆనంద్ అక్కడ మాన్‌స్టర్‌లతో వీరోచితంగా పోరాడుతాడు. ఈ ఫైటింగ్ విషయం ఎలా ఉన్నా 'చంద్రయాన్' లాంటి సందర్భాలలో ఈ సినిమాలోని స్టిల్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటాడు అతడి కుమారుడు విందు ధారాసింగ్.

ఆఖరి మజిలీ...

పాపం... అప్పుడప్పుడూ అతడు శశికాంతుడా శ్మశానమా అనే డౌటు కూడా వస్తుంటుంది. చంద్రుడి మీద తమ చితాభస్మం పడాలని చాలా మంది భూలోక వాసుల కోరిక. అందుకే 450 బీసీ కాలం నుంచే కొందరు తమ చితాభస్మాన్ని చంద్రుడి మీద పడేలా ఎత్తైన ప్రదేశం నుంచి ఆకాశంలోకి విసిరేయమని వీలునామా రాసేవారు. యూజీన్ షూమాకర్ అనే ఆస్ట్రొనాట్‌కు చంద్రుని మీదకు వెళ్లాలని కోరిక. అయితే అతడు ఓ శారీరక లోపం కారణంగా చంద్రుణ్ణి చేరలేకపోయాడు. కానీ ఏనాటికైనా చంద్రుణ్ణి చేరాలన్న అతడి కోరిక నెరవేరకుండానే కారు యాక్సిడెంట్‌కు గురై 1997 లో మరణించాడు. అతడి కోరికను ఎలాగైనా తీర్చాలనుకున్న నాసా... అతడి భార్య, పరిశోధనల్లో సహచరి అయిన కరోలిన్ దగ్గర్నుంచి అనుమతి తీసుకుని లూనార్ ప్రాస్పెక్టర్ అనే ఉపగ్రహోపకరణంతో చంద్రుడిపైన దక్షిణ ధ్రువంలోని ఓ క్రేటర్‌లోకి సమాధయ్యేలా చితాభస్మాన్ని జల్లి 1998లో అతడి కోరిక తీర్చారు. ఆ తర్వాత ఎలాన్ మస్క్ లాంటివాళ్లు తమ స్పేస్ ఎక్స్‌తో 2019లో 152 మంది చితాభస్మాల్ని అంతరిక్ష వైతరణిలో నిమజ్జనం చేశారు.

మూన్ డస్ట్ ఫీవర్

ప్రస్తుతానికి ఎవరు పడితే వారు ఎప్పుడంటే అప్పుడు వెళ్లడానికి చంద్రుడేమీ పిక్నిక్ స్పాట్ కాదు. మామూలు వ్యక్తులు చంద్రుడి మీదకి వెళ్లడం సాధ్యం కాదు. అక్కడ ఉండే దుమ్ముధూళికి మూన్ డస్ట్ అని పేరు. అది పీల్చడం ఎంతో ప్రమాదకరం. స్పేస్ సూట్ తొడుక్కుని వెళ్లినా బట్టల్లోకి చేరిపోతుంది. అది 'లూనార్ హే ఫీవర్' అనే సమస్యకు దారితీస్తుంది. దీన్నే మూన్ డస్ట్ ఫీవర్ అని కూడా అంటారు.

హెల్త్ ఫ్యాక్ట్

సీసాతో పాలు పడుతున్నారా?

బిడ్డకు ఎప్పుడూ తల్లిపాలు పట్టడమే చిన్నారికి మేలు చేస్తుంది. కేవలం తల్లికి పాలు పడని సందర్భాల్లో మాత్రమే పోత పాలు పట్టాలి. ఇవి రెండు రకాలుగా ఉంటాయి.



పాడి పశువుల పాలు: ఆవు, గేదె, మేక వంటి పాడి పశువుల పాలు ఇవ్వవచ్చు.

డబ్బా పాలు: మార్కెట్లో అమ్మే పిల్లల కోసం ఉద్దేశించిన పాల పౌడర్‌ను ఉపయోగించి కలిపి ఇచ్చేవి. గేదె వంటి పాడి పశువుల పాలైనా / డబ్బాపాలైనా సీసాలో పోసి తాగిస్తారు. సీసాతో పాలు పట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి...

- సీసానూ, పాలపీకను సబ్బు నీళ్లతో శుభ్రంగా కడగాలి.
- కడిగాక పాల సీసాను పదినిమిషాలు మరిగే నీళ్లలో ఉంచాలి. పాల పీకనూ కనీసం రెండు నిమిషాల పాటు వేడి నీళ్లలో ఉంచాలి.
- బిడ్డకు పాలు పట్టిన వెంటనే పక్క మీద పడుకోబెట్టకూడదు. మొదట బిడ్డను భుజంపై వేసుకుని వీపుపై నెమ్మదిగా తడుతూ ఉండాలి. తేన్పు వచ్చే వరకు ఇలా చేయాలి.
- ఒకసారి తాగాక సీసాలో మిగిలిన పాలను పారబోయాలి.
- నిద్రపోయే సమయంలో బిడ్డకు పాలు తాగించకూడదు.
- పాలు తాగించే సమయంలో బిడ్డను ఒళ్లో పడుకోబెట్టి పాలు పట్టాలి.

గమనం



వయసు ఆపని పరుగు

సాధారణంగా 53 ఏళ్ల వయస్సులో ఉన్న ఫ్యాషన్ డిజైనర్‌ని మీ లక్ష్యాలేమిటి? అంటే.. ప్రపంచమంతా బొటిక్స్ తెరవడమో మరొకటో అంటారు. కానీ ప్రపంచవ్యాప్తంగా ప్రధాన మారథాన్‌లను పూర్తి చేయడం అన్నారంటే అది డిజైనర్ నమ్రత జోషిపురా అయి ఉంటారు. అందుకే ఇప్పుడామె బాలీవుడ్ టాప్ డిజైనర్ మాత్రమే కాదు ఇంటర్నేషనల్ మారథాన్ రన్నర్ కూడా. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో తనను తాను 'సిక్స్ స్టార్ ఫినిషర్' అని సగర్వంగా పరిచయం చేసుకున్న ఢిల్లీ డిజైనర్ నమ్రత సాక్షితో పంచుకున్న విశేషాలు...



'స్కూల్‌లో, కాలేజీలో ఉండగా హాకీ ఆడేదాన్ని. బీకామ్ చేసినా సృజనాత్మక రంగంలోనే భవిష్యత్తు బాగుంటుందని ఫ్యాషన్ డిజైనింగ్‌లోకి వచ్చాను. ఢిల్లీ నిఫ్ట్‌లో కోర్సు చేస్తున్నప్పుడు నా టైమ్ పూర్తిగా దానికే కేటాయించాల్సి వచ్చేది. దాంతో ఫిట్‌నెస్, హాకీ అన్నీ అటకెక్కాయి. అయితే వాకర్స్‌కు బెస్ట్ సిటీ అయిన న్యూయార్క్‌లో ఉన్నప్పుడు సుదూరాలు నడవడం అలవాటై ఫ్యాషన్ రంగంలో బిజీగా ఉంటూనే మినీ మారథాన్స్‌లో పాల్గొన్నా. ఆ క్రమంలోనే ఎనిమిదేళ్ల క్రితం ప్రపంచంలోని 6 పెద్ద మారథాన్స్ పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నా. ఢిల్లీ మారథాన్‌తో మొదలుపెట్టి 2018లో లండన్, 2019లో చికాగో, 2021లో బోస్టన్, 2022 బెర్లిన్‌లో తాజాగా టోక్యో మారథాన్ పూర్తి చేశాను'

ఆగని పరుగు..

'వెర్టిగో, ఆస్తమా, పోస్ట్ మెనోపాజ్ సమస్యలు నన్ను బాధించేవి. రెండు సార్లు కోవిడ్‌తో బాధపడినప్పటికీ మారథాన్స్‌కు ట్రైనింగ్ షెడ్యూల్‌ను కోల్పోలేదు. అయితే ఢిల్లీలో కాలుష్యం వల్ల ఆరు బయట రన్ కష్టమైంది. ట్రెడ్‌మిల్‌పై 25-30 కిలోమీటర్లు పరిగెత్తడం కష్టతరమైన పని. ఇవి దృష్టిలో పెట్టుకుని శిక్షణలో మార్పులు చేస్తూ వచ్చిన నా కోచ్ నకుల్ బుట్టాకు థ్యాంక్స్ చెప్పాలి'

మహిళ... గుర్తించాలి తన కల...

'తన కప్పు ఖాళీగా ఉంచుకుని పక్కనవారి కప్పుని నిండేలా చేయడం అసాధ్యం. ఇంటికోసం మాత్రమే కాదు. తన పట్ల కూడా మహిళకు బాధ్యత ఉండాలి. శారీరక, మానసిక, భావోద్వేగపరమైన ఆరోగ్యాలు కాపాడుకుంటూ వ్యక్తిగత లక్ష్యాలు సాధించుకోవాలి'

ఆగను... అలుపెరుగను...

'ఫ్యాషన్ రంగంలో కూడా మరింతగా విస్తరించాలి.. కొత్త స్టోర్స్ ప్రారంభించాలి. నా తదుపరి లక్ష్యం కొన్ని ట్రయల్ రన్నింగ్ ఈవెంట్‌లు. ఎంతకాలం వీలైతే అంత కాలం పరుగు తీస్తూనే ఉంటా' అంటున్న నమ్రత తన కలను నెరవేర్చుకోవాలని కోరుకుందాం.

– సత్యబాబు

సీజన్

గోరింటా పూసిందీ...

ఆషాఢమాసపు వర్షపు జల్లులకు కొత్త చివుర్లు తొడిగి, నిండా ఆకులతో ఉల్లాసంగా కనిపిస్తుంది గోరింట చెట్టు. అత్తవారింటి నుంచి పుట్టింటికి చేరిన నవ వధువు, మరదలిని ఆటపట్టించే వదినలు, ఆజమాయిషీ చేస్తూ తిరిగే అత్తలు, ఆటపాటలతో సందడి చేసే యువతులు.. అందరినీ కట్టిపడేసి కుదురుగా కూర్చోబెట్టి, ఎర్రని పంట కోసం ఎదురు చూపుల సహనాన్ని అలవాటు చేస్తుంది గోరింట.

- ఎర్రగా పండిన చేతులను చూసుకొని ఎంతగానో మురిసిపోయే వనితలు గోరింటాకును సౌభాగ్యానికి ప్రతీకగానూ భావిస్తారు. గోరింటాకు ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాదు మహిళలంతా ఒకచోట చేరి, వేడుకలా మార్చుకుంటున్నారు. వివాహ వేడుకల్లో మెహిందీ ఫంక్షన్‌కు ఉన్న ప్రాధాన్యత ఆషాఢం గోరింటాకుకూ వర్తింపజేస్తున్నారు.





ఈ కాలమే ఎందుకంటే..

- ఆషాఢంలో వర్షాలు పడుతుంటాయి. ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ. అలాగే, చల్లబడిన బయటి వాతావరణానికి, శారీరక వేడికి సమతుల్యత లోపిస్తుంది. దీనిని బ్యాలెన్స్ చేసే శక్తి గోరింటాకుకు ఉంటుందనేది పెద్దలు చెప్పే మాట.
- వర్షాల కారణంగా నీళ్లలో తరచూ పాదాలు తడుస్తుంటాయి. ఇలాంటప్పుడు పాదాల చర్మానికి సూక్ష్మ క్రిముల వల్ల ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.
- గోళ్లకు కూడా గోరింటాకు పెట్టడం వల్ల గోళ్లు పెళుసు బారడం, గోరుచుట్టు రావడం వంటి సమస్యలు దరిచేరవు.

ఫుట్ కేర్



వర్షాకాలంలో పాదాల సంరక్షణ

- వర్షానికి పాదాలు మురికిపట్టినట్లు ఉంటే... పన్నీరు మూడు టేబుల్ స్పూన్‌లు, నిమ్మరసం రెండు టేబుల్ స్పూన్‌లు, గ్లిజరిన్ టేబుల్ స్పూన్ ఒక కప్పులో వేసుకుని బాగా కలిపి పాదాలకు పట్టించాలి. అరగంట తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. పమిస్ స్టోన్ లేదా మామూలు బాడీ బ్రష్‌తో రుద్ది కడగాలి
- పాదాలు దుర్వాసన వస్తుంటే... బకెట్‌లో పావు వంతు చన్నీటిని తీసుకుని అందులో టేబుల్ స్పూన్ పన్నీరు, టేబుల్ స్పూన్ నిమ్మరసం, టేబుల్ స్పూన్ ఉడుకులోన్ కలిపి అందులో పాదాలను అరగంట సేపు ఉంచాలి. తర్వాత గోరువెచ్చటి నీటితో పాదాలను బాగా రుద్ది కడగాలి.

హెల్దీ డైట్

వీట్ గ్రాస్ స్మూతీ





డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ & వెల్‌నెస్ కోచ్

కావలసినవి: తాజా పండ్ల ముక్కలు – కప్పు (అరటి, మామిడి లేదా బెర్రీలు); వీట్ గ్రాస్ పౌడర్– టేబుల్ స్పూన్; పాలకూర– కప్పు; బాదం పాలు లేదా పండ్ల రసం – కప్పు; తేనె – టేబుల్ స్పూన్.

తయారీ: పండ్ల ముక్కలు, పాలు, వీట్ గ్రాస్ పౌడర్, పాలకూర, తేనె అన్నింటినీ కలిపి మిక్సీలో వేసి మెత్తగా బ్లెండ్ చేస్తే వీట గ్రాస్ స్మూతీ రెడీ. పిల్లలు బాగా ఇష్టపడతారు.

పోషకాలు: విటమిన్ ఏ, సీ, కే, ఈ...లతోపాటు ఫోలేట్, పొటాషియం, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. సుమారుగా 250 కేలరీలు, ప్రొటీన్ 4 గ్రాములు, కార్బోహైడ్రేట్లు 50 గ్రాములు, ఫైబర్– 6 గ్రాములు, చక్కెరలు– 35 గ్రాములు, ఫ్యాట్– 3 గ్రాములు.

ప్రయోజనాలు: ఈ స్మూతీలో ఆల్కలైన్ ప్రాపర్టీస్ ఎక్కువ. ఇవి దేహంలోని వ్యర్థాలను తొలగించడంతోపాటు రక్తాన్ని, కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. వ్యాధి నిరోధక శక్తి వృద్ధి అవుతుంది. ఇందులో ఉపయోగించే పాలకూర వంటివి సేంద్రియ ఎరువులతో పండినవైతే మంచిది. రసాయన ఎరువులతో పండిన ఆకులు ఉపయోగించేటట్లయితే ఆకులను ఉప్పు నీటిలో నానబెట్టి శుభ్రం చేయాలి.

హెల్త్ టిప్స్



ద్రాక్షపండ్లలో పిండి పదార్థాలు, చక్కెర పదార్థాలతో పాటు విటమిన్ -ఎ, విటమిన్-బి 1, విటమిన్ సి, విటమిన్ -కె వంటి విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, ఫాస్పరస్ లాంటి ఖనిజ లవణాలు మెండుగా ఉంటాయి. ద్రాక్షవల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. మూత్రపిండ సమస్యలతో బాధపడే వారికి మంచి ఔషధంగా పనిచేస్తుంది. కొలెస్ట్రాల్‌ను అదుపు చేయడం, క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో ద్రాక్ష ఉపయోగపడుతుంది. ఆస్తమా, గుండె జబ్బులు, అజీర్ణం, మైగ్రెయిన్.. ఇలా చాలా రుగ్మతలకు ద్రాక్ష అద్భుతంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని పండ్లుగానే తినడంతో పాటు పానీయంగా, సలాడ్లుగా కూడా తీసుకోవచ్చు.



ఆషాఢంలో అల్ల నేరేడు

ఆషాఢమాసంలో నేరేడు పండు తినాలని పెద్దలు చెబుతారు. ఎందుకంటే, ఆషాఢంలో ఎండ వేడిమి తగ్గి, శరీరం నుంచి చెమట రూపంలోనూ, మూత్రం రూపంలోనూ నీరు అధికంగా విడుదల అవుతుంది. వాతావరణంలోని మార్పు జీర్ణకోశాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఈ సీజన్‌లో నేరేడు పండు తినడం చాలా మంచిదని పెద్దలు చెబుతారు.

అతి మూత్రవ్యాధికి నేరేడు మంచి మందనీ, వెంట్రుకలను కూడా కరిగించి అరగించే శక్తి దానికి ఉందనీ జీవశాస్త్రంలో పాఠాలుగా చదువుకుంటాం. దీనిని బట్టి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, వాతావరణంలోని మార్పులకు దేహం సరయ్యే విధంగా, ఆ కాలంలో ప్రకృతి అందించే నేరేడుని ఔషధంలా ఉపయోగించాలని, శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ అనే విషపదార్థాలను బయటకు పంపించడానికి నేరేడు మంచి మందనీ. దానిని తీసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యం బాగుంటుందనీ గ్రహించాలి.

నేరేడు మనకు ఇంకా ఏవిధంగా ఉపయోగపడుతుందో చూద్దాం.

- చాలా కాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపటానికి నేరేడు పండ్లను తినటం మంచిది.
- పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలకు కోసేసి బయటికి పంపే శక్తి నేరేడు పళ్ళకు ఉంది.
- రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. వ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది.
- మూత్ర సంబంధ సమస్యల నుండి ఉపశమనాన్ని కలిగిస్తుంది.
- నీరసం, నిస్సత్తువ ఉన్న వారు నేరేడు పండును తింటే తక్షణ శక్తి వస్తుంది.
- వెన్నునొప్పి, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులు, నయం అవుతాయి.
- జిగట విరేచనాలతో బాధపడే వారు నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున తాగితే రోగికి శక్తి రావడంతోపాటు పేగుల కదలికలు నియంత్రణలో ఉంటాయి.
- కాలేయం పనితీరును క్రమబద్ధీకరించడానికి లేదా శుభ్రపరచడానికి నేరేడు దివ్యౌషధంలా పనిచేస్తుందని కొన్ని అధ్యయనాలు తేల్చాయి.
- ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు, గుండెకు ఔషధంగా పనిచేస్తాయి.
- జ్వరంగా ఉన్నపుడు ధనియాల రసంలో నేరేడు రసం కలిపి తీసుకుంటే.. శరీర తాపం తగ్గుతుంది.
- మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం, నేరేడు రసం రెండు చెంచాల చొప్పున నీళ్లలో కలిపి తీసుకోవాలి.
- పిండి పదార్థాలు, కొవ్వు భయం ఉండదు కనుక నేరేడు పండ్లను అధిక బరువు ఉన్నవారు.. మధుమేహం రోగులు సైతం వీటిని రోజుకు ఆరు నుంచి ఎనిమిది దాకా తినవచ్చు.

వీరు తినకూడదు..

అయితే నేరేడు పండ్లను గర్భిణీలు ఎటువంటి పరిస్థితులలో తినకూడదు.నేరేడు అరగడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి.. ఉప్పు వేసి అప్పుడప్పుడు తీసుకోవాలి. భోజనమైన గంట తరువాత ఈ పండ్లు తీసుకుంటే.. ఆహారం జీర్ణమవుతుంది. అధికంగా తీసుకుంటే.. మలబద్ధకం సమస్యతోపాటు.. నోట్లో వెగటుగా ఉంటుంది.



రొయ్యల్లో కొవ్వులు, విటమిన్లు, ప్రొటీన్లు, సోడియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలు వుంటాయి. రొయ్యలు క్యాన్సర్‌ను నిరోధిస్తాయి. దంతాలకు, ఎముకలకు మేలు చేస్తాయి. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కళ్లకు, చర్మానికి మంచిది.



బీట్‌రూట్ రసం తీసుకున్న వారికి రక్తపోటు అదుపులో ఉంటున్నట్లు కొన్ని అధ్యయనాల్లో వెల్లడి అయ్యింది. ఇది కూడా మెదడుకు మేలు చేసేదే. కాబట్టి బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవటం మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

స్టడీ

హాయిగా నిద్రపోతున్నారా?



చిన్న పిల్లలకి నిద్ర చాలా ముఖ్యం. సుఖమైన నిద్ర వారి ఎదుగుదలను ప్రభావితం చేయడమే కాదు.. వారిలో రోగనిరోధక శక్తిని, మేధాశక్తిని పెంచుతుంది.

- నిద్రకు ఒక సమయాన్ని కేటాయించడం మంచిది. ఇది వాళ్ళ స్లీప్ సైకిల్‌ని క్రమబద్ధపరచడమే కాకుండా పిల్లల్ని మరింత శక్తిమంతంగా తయారు చేస్తుంది. వేళకు పడుకోవడం.. లేవడం అందరికీ అవసరమే.
- సుఖ నిద్రకు ప్రతిరోజూ చేసే క్రమానుసార పనులు ఎంతగానో దోహదపడతాయి. ఇది పిల్లల మానసిక ఆరోగ్యం పెంపుదలకు దోహదపడుతుంది.
- పడుకునే ముందు స్నానం చేయడం, పళ్ల తోముకోవడం, నైట్ డ్రెస్ వేసుకోవడం, కథలు వింటూనో, చెబుతూనో నిద్రపోవడం.. పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే కాదు, వారికి బంధాల పట్ల గౌరవ మర్యాదలు పెరగడానికీ ఉపకరిస్తుంది.
- పరిపూర్ణ నిద్రకి, పడకగదికి అవినాభావ సంబంధం ఉంది. పరిశుభ్రమైన పడకగది ఆరోగ్యమైన నిద్రతో పాటు అన్నిరకాల అనారోగ్యాలనూ దూరంగా ఉంచుతుంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను, టీవీ వంటి వాటిని పడకగదిలో లేకుండా చేయడం ద్వారా మగతనిద్రను దూరం చేయవచ్చు.
- పడుకునే ముందు జంక్ ఫుడ్ తినడం, కాఫీ తాగడం నిద్రాభంగం కలిగిస్తుంది. వీలైనంత వరకూ రాత్రి భోజనంలో పప్పు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం, పడుకోవడానికి రెండు మూడు గంటల ముందే తినడం మంచిది.

లైఫ్@360



* ఆస్తి హక్కు

పిల్లలకు బహుమతిగా ఇచ్చినా తిరిగి తీసుకోవచ్చు...

పిల్లలు ఎదిగేంతవరకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. వాళ్లు జీవితాల్లో స్థిరపడ్డాక ఇంకా ఈ బరువు బాధ్యతలు ఎందుకు... ప్రశాంతంగా వారి వద్ద గడిపేద్దాంలే అని ఉన్న ఆస్తులను వారికే పంచేస్తారు. కానీ, ఆస్తులను పంచుకున్న పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే.. ఆస్తులను తీసుకొని, ఇంటినుంచి గెంటేస్తే.. ఏం చేయాలి? ఈ మధ్య కాలంలో తరచూ వృద్ధులకు సంబంధించి వచ్చిన వార్తల్లో ఇది ప్రధాన అంశంగా ఉంటోంది. వృద్ధుల ఆస్తులకు సంబంధించి రక్షణ చట్టాలు ఏం చెబుతున్నాయో... తెలుసుకుందాం.

మహబూబాబాద్ జిల్లా గార్ల గ్రామంలోని జెండా బజారుకు చెందిన వృద్ధురాలు నర్సమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. వీరికి ముగ్గురు కుమారులు. ఉన్న మూడెకరాల భూమిని కొడుకులు పంచుకున్నారు. ఆ తర్వాత ఇంటిని కూలగొట్టి తల్లికి గూడు లేకుండా చేశారు. ఆస్తి పంచుకునే ముందు కొడుకులు నెలకు ఒకరి చొప్పున అమ్మను సాకుతామని ఒప్పందం చేసుకున్నారు. తీరా ఆస్తి పంచిన తర్వాత అసలు అమ్మ విషయాన్నే గాలికి వదిలేశారు. దాంతో చేసేదేం లేక తెలిసిన వాళ్ల ఇళ్ల చుట్టూ తిరుగుతూ వారిలో దయగల తల్లి ఎవరైనా ఇంత ముద్ద పెడితే తిని, ఎవరో ఒకళ్ల ఇంటి అరుగులపై తలదాచుకోవలసి వస్తోందా వృద్ధురాలు. ఈ విషయం తెలిసిన తహసీల్దార్, ఆస్తిని తీసుకుని తల్లిని వదిలేసిన కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిని పోషించాలని, లేదంటే ఆమె పంచి ఇచ్చిన యావదాస్తిని తిరిగి తల్లికి చెందేటట్లుగా చేస్తామని వారిని హెచ్చరించారు.

• • •

సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007లోని (సీనియర్ సిటిజన్స్ యాక్ట్) సెక్షన్ 23(1) తల్లిదండ్రుల ఆస్తిని రక్షిస్తుంది. మోసాన్ని నిరోధించి, ప్రాథమిక సౌకర్యాలను కోల్పోకుండా పరి రక్షిస్తుంది. ఈ చట్టం అమలులోకి వచ్చి 15 సంవత్సరాలు గడిచినా ఈ హక్కులపై సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన అంతంత మాత్రమే. సీనియర్లు తమ ఆస్తిని పంచి ఇచ్చిన తర్వాత వారిని నిర్లక్ష్యం చేస్తే ట్రిబ్యునల్ ద్వారా ఆస్తి బదిలీని రద్దు చేసుకునే అవకాశంఉంది.



అవగాహన అవసరం

వృద్ధుల రక్షణ చట్టం గురించి అవగాహన మన దేశంలో చాలా మందికి లేదు. అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. వృద్ధులు కూడా తమ సమస్యను చట్టం దృష్టికి తేవాలి. ఆస్తులు లేకపోయినా వృద్ధ తల్లిదండ్రులు మెయింటనెన్స్ క్లెయిమ్ చేసుకోవచ్చు.

– ఎ.పి.సురేష్, సీనియర్ అడ్వకేట్, హైకోర్ట్

■ ఆస్తిని తిరిగి పొందవచ్చు...

తమ పిల్లలకు ఆస్తిని బహుమతిగా ఇవ్వాలని ఆలోచించే వయోవృద్ధులైన తల్లిదండ్రులు ట్రాన్స్‌ఫర్ డీడ్‌లో ఒక ఎక్స్‌ప్రెస్ షరతును చేర్చవచ్చు. ఆస్తిని బహుమతిగా తీసుకున్న పిల్లలు ఈ షరతును ఉల్లంఘిస్తే, ఆ బహుమతి చెల్లుబాటు కానిదిగా ప్రకటించి, తల్లిదండ్రులు మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. తల్లిదండ్రులు ప్రేమ, ఆప్యాయతతో లేదా సేవలకు బదులుగా పిల్లలకు ఆస్తిని బహుమతిగా ఇచ్చినప్పుడు దానిని సూచించవచ్చు. అయితే, అస్పష్టతకు తావు లేకుండా ఎక్స్‌ప్రెస్ షరతును చేర్చడం ఉత్తమం అని పేర్కొన్నాయి.


■ ఇంటినుంచి తరిమివేయవచ్చు

సీనియర్ సిటిజన్ల ఆస్తుల నుంచి పిల్లలు లేదా ఆస్తి తీసుకున్న బంధువులను తొలగించడానికి సుప్రీం కోర్టుతో సహా కోర్టులు అనుమతించాయి. చట్టబద్ధమైన వారసులమనే కారణంతో తల్లిదండ్రులను వేధిస్తే ఇంటినుంచి బయటకు పంపివేయవచ్చని కూడా ఆదేశించింది.

■ ముఖ్యమైన గమనికలు

- ఆస్తిలో ఆర్థిక పెట్టుబడులు, కాపీరైట్‌లు, పేటెంట్లు, ఆభరణాలు, కళాఖండాలు మొదలైనవి ఉండచ్చు.
- ఆస్తుల వివరాలతోపాటు బ్యాంక్, డీమ్యాట్ ఖాతాలు, ఎమ్ఎఫ్‌లు, షేర్లు, ఎఫ్డీలు, బీమా పాలసీలు, లోన్లు.. మొదలైన వాటి జాబితా కోసం న్యాయవాది, ఆర్థిక సలహాదారుని సంప్రదింపు అవసరం. అందుకని వారి వివరాలను తీసుకోండి.
- వారసత్వం, ఆస్తుల ప్రణాళికలో కీలకమైన భాగం వీలునామాను రూపొందించడం. దాని చెల్లుబాటును నిర్ధారించడానికి కొన్ని అంశాలను జాగ్రత్తగా చూసుకోవాలి... ఆస్తులకు సంబంధించిన వివరాలు, కంపైల్ చేయాల్సిన సమాచారంలో ఇద్దరు సాక్షులను, ఒక ఎగ్జిక్యూటర్‌ని నియమించుకోవాలి.
- వీలునామాలో మీ తదనంతరం ఆస్తి ఎవరికి చెందాలో వారి పేర్లను విధిగా నమోదు చేయాలి. లేకుంటే తర్వాత వారసత్వ చట్టాలు వర్తిస్తాయి.

సినిమా



● విక్రమ్

డేట్ ఫిక్స్

'తంగలాన్' సినిమా థియేటర్స్‌కు వచ్చే తేదీ ఖరారైంది. విక్రమ్ హీరోగా నటించిన ఈ పీరియాడికల్ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రయూనిట్ శుక్రవారం ప్రకటించింది. పా. రంజిత్ దర్శకత్వంలో నీలమ్ ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్ ఫిలింస్ పతాకాలపై కేఈ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించారు. 18వ శతాబ్దంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) నేపథ్యంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో విక్రమ్ ఓ తెగకు చెందిన నాయకుడిగా కనిపిస్తారు.



● సమంత

త్వరలో సెట్‌లోకి...

సినిమా సెట్‌లో అడుగుపెట్టి మునుపటి ఉత్సాహంతో చిత్రీకరణలో పాల్గొనడానికి సమంత రెడీ అవుతున్నట్లు సమాచారం. అనారోగ్య సమస్యల కారణంగా కొంత కాలంగా ఆమె చిత్రీకరణలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. కాగా వచ్చే నెల నుంచి సమంత మూవీ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని టాక్. అంతేకాదు... తన భవిష్యత్ సినిమాల్లోని రోల్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణతో ప్రస్తుతం ఆమె బిజీగా ఉన్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 28న తన బర్త్ డే సందర్భంగా 'మా ఇంటి బంగారం' సినిమాను ప్రకటించారు సమంత. ఈ సినిమాలోని మెయిన్ లీడ్ రోల్‌లో నటించి, నిర్మించనున్నారు. అలాగే తమిళ హీరో విజయ్‌తో ఓ సినిమా, ఓ హిందీ సినిమాలో కూడా సమంత హీరోయిన్‌గా నటించనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరి... సమంత ఏ సినిమా సెట్స్‌లో ముందుగా అడుగుపెడతారు? ప్రస్తుతం ఏ సినిమాలోని పాత్ర కోసం శిక్షణ తీసుకుంటున్నారనేది తెలియాల్సి ఉంది. ఇక సమంత నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

ఐఎఫ్ఎఫ్ఎమ్‌కి అతిథిగా...

– రామ్‌చరణ్



రామ్‌చరణ్‌కి అరుదైన గౌరవం దక్కింది. 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' (ఐఎఫ్ఎఫ్ఎమ్) 15వ ఎడిషన్‌లో ఈ హీరో గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. ''రామ్‌చరణ్ వస్తున్నారు. 'నాటు నాటు..' పాటకు డ్యాన్స్ చేయడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఎక్స్ వేదికగా 'ఐఎఫ్ఎఫ్ఎమ్' తెలియజేసింది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 25 వరకు మెల్‌బోర్న్‌లో ఈ చిత్రోత్సవం జరగనుంది. ఈ వేడుకలో రామ్‌చరణ్ అతిథిగా పాల్గొనడంతో పాటు భారతీయ చలన చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకుగాను 'ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్' అవార్డును కూడా అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ స్పందిస్తూ– ''భారతీయ సినిమా గొప్పతనాన్ని, వైవిధ్యాన్ని అంతర్జాతీయ వేదికపై సెలబ్రేట్ చేసుకునే 'ఐఎఫ్ఎఫ్ఎమ్ -2024'లో భాగం అవుతున్నందుకు గౌరవంగా భావిస్తున్నాను. మన చిత్ర పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించనుండటం నా అదృష్టం. 'ఆర్ఆర్ఆర్' విజయం విశ్వవ్యాప్తం. మెల్‌బోర్న్‌లో ప్రేక్షకులను కలుసుకునేందుకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఎదురు చూస్తున్నాను'' అన్నారు.

సినిమా చేసేయండని ఎన్టీఆర్ అన్నారు

– అల్లు అరవింద్




● అంజి కె. మణిపుత్ర, 'బన్నీ' వాసు, అల్లు అరవింద్, నార్నే నితిన్

''ఆయ్' కథ ఓకే అయిన తర్వాత ఎన్టీఆర్‌కి ఫోన్ చేశాం. 'మూవీ రిలీజ్ వరకు మనం పుష్ చేస్తాం... ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. 'ఆయ్' కథ బాగుందని అంటున్నారు... సినిమా చేసేయండి అని ఎన్టీఆర్ చెప్పారు'' అని అల్లు అరవింద్ అన్నారు. హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న రిలీజ్ కానుంది. 'ఆయ్' థీమ్ సాంగ్ రిలీజ్ ఈవెంట్‌లో నార్నే నితిన్ మాట్లాడుతూ– ''గోదావరి నేపథ్యంలో సాగే ఈ సినిమాలో స్నేహం గురించి చెప్పాం. అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు. ''మా సినిమా చూస్తే కచ్చితంగా నవ్వి నవ్వి బుగ్గలు నొప్పెడతాయి. బాగా గట్టిగా నవ్వే వాళ్లుంటే పొట్ట కూడా నొప్పి పుడుతుంది'' అన్నారు 'బన్నీ' వాసు. ''అమ్మాయిలను ప్రకృతితో పోల్చుతాం. అమ్మాయి తడిసినా, ఊరు తడిసినా అందంగా ఉంటుంది. మా 'ఆయ్' కూడా అంత అందంగా ఉంటుంది'' అన్నారు అంజి కె. మణిపుత్ర.

నన్ను క్షమించండి

– పార్తిబన్





హీరోయిన్ తమన్నాకు తమిళ నటుడు–దర్శక–నిర్మాత పార్తిబన్ క్షమాపణలు చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో తమన్నా డ్యాన్స్ గురించి పార్తిబన్ చేసిన కామెంట్‌పై తీవ్ర విమర్శలు రావడంతో ఆయన క్షమాపణలు కోరారు. ఆ ఇంటర్వ్యూలో పార్తిబన్ మాట్లాడుతూ – ''ప్రస్తుత పరిస్థితుల్లో సినిమాలో కథ ఉందా? లేదా అన్నది ప్రేక్షకులు చూడటం లేదు. హీరోయిన్ డ్యాన్స్ కోసమే సినిమాలు చూస్తున్నారు. తమన్నా ఉంటే చాలు.. కథ లేకపోయినా ఫర్వాలేదు.. సినిమా హిట్టవుతుంది'' అన్నారు. పార్తిబన్ మాటలను పలువురు నెటిజన్స్ తప్పుబట్టారు. దాంతో పార్తిబన్ స్పందిస్తూ– ''సినిమా ఇండస్ట్రీ వారిపై నాకు గౌరవం ఉంది. నటీనటులను తక్కువ చేసే ఉద్దేశం లేదు. నా మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి'' అన్నారు. ఇక తెలుగులో రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రచ్చ' సినిమాలో పార్తిబన్ నటించిన విషయం తెలిసిందే.

ఆహారాన్ని తాగండి... నీటిని నమలండి!

– మాధవన్



''వ్యాయామం చేయలేదు. రన్నింగ్ చేయలేదు. సర్జరీ అసలే లేదు. మెడికేషన్ పాటించలేదు... కానీ 21 రోజుల్లోనే పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యాను. బాగా బరువు తగ్గిపోయాను''... 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమాలో తన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ గురించి మాధవన్ చెప్పిన మాటలు ఇవి. ఈ ఆసక్తికరమైన విషయాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాధవన్ వెల్లడించగా, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మాధవన్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన బయోగ్రాఫికల్ డ్రామా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా మాధవన్ ఈ సినిమాను తెరకెక్కించి, టైటిల్ రోల్ చేశారు. ఈ చిత్రంలో మాధవన్ వివిధ వయస్సుల్లో కనిపిస్తారు. కొన్ని సన్నివేశాల్లో బాగా బరువు పెరిగి, పొట్ట ఉన్న వ్యక్తిగా కనిపిస్తారు. ఈ లుక్ నుంచి మాధవన్ మళ్లీ తన సాధారణ లుక్‌కు మారేందుకు కేవలం 21 రోజులు మాత్రమే పట్టిందట. ఆ మార్పు గురించి మాధవన్ మాట్లాడుతూ– ''నేనొక డాక్టర్‌లా మాట్లాడుతున్నానని అనుకోవచ్చు. నా శరీరానికి ఏది మంచి ఆహారమని భావించానో దాన్నే తిన్నాను. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'కి దర్శకత్వం వహిస్తున్నప్పుడు కాస్త పొట్టతో కనిపించేవాడిని. ఆ తర్వాత 21 రోజులకు నార్మల్‌గా మారిపోయాను. ఇదంతా నేను తీసుకున్న ఆహారం వల్లే జరిగిందని అనుకుంటున్నాను. చెప్పాలంటే నా జీవితంలోనే సైన్స్ ఓ భాగమైపోయిందని అనిపిస్తోంది'' అని చెప్పుకొచ్చారు. ఇంకా 'ఎక్స్' వేదికగా ఈ విషయంపై మాధవన్ స్పందిస్తూ– ''అప్పుడప్పుడూ ఉపవాసం ఉన్నాను. ఆహారాన్ని 45 నుంచి 60 సార్లు బాగా నమిలాను (మీ ఆహారాన్ని తాగండి... నీటిని నమలండి). సాయంత్రం 6 గంటల 45 నిమిషాలకే రోజులోని నా చివరి భోజనం పూర్తయ్యేది. జ్యూస్‌లు ఎక్కువగా తాగాను. ఆకుపచ్చ కూరగాయలు తిన్నాను. ఉదయాన్నే సుదీర్ఘంగా నడిచేవాడ్ని. నిద్రపోవడానికి 90 నిమిషాల ముందు ఏ స్క్రీనూ చూడలేదు. రాత్రివేళ గాఢంగా నిద్రపోతాను. నా శరీరానికి, నా ఆరోగ్యానికి, నా జీవన శైలికి, జీవక్రియకు తగ్గట్టుగా ఆహారాన్ని తీసుకున్నాను. దాంతో క్రమ క్రమంగా మార్పు వచ్చింది'' అన్నారు.

జనార్ధన్ టు జాన్ స్నో



● రాజేంద్రప్రసాద్

సున్నిపెంట జనార్ధన్ ఎందుకు ఏజెంట్ జాన్ స్నోగా మారాడు? అంటే 'రాబిన్‌హుడ్' సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. హిట్ ఫిల్మ్ 'భీష్మ' తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శుక్రవారం రాజేంద్ర ప్రసాద్ బర్త్ డే. ఈ సందర్భంగా 'రాబిన్‌హుడ్' సినిమాలో సున్నిపెంట జనార్ధన్ అలియాస్ ఏజెంట్ జాన్ స్నో పాత్రలో రాజేంద్ర ప్రసాద్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 20న విడుదల కానుంది.

యావరేజ్ స్టూడెంట్



● పవన్, స్నేహా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. కార్తీక్ బి కొడకండ్ల సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'సారా సారా..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. శివకృష్ణాచారి ఎర్రోజు సాహిత్యం అందించిన ఈ పాటని పద్మలత, అనుదీప్ దేవ్ ఆలపించారు.

సాక్షి బిజినెస్
శనివారం
20-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
739	270
80,605	24,531

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,724	▽ 147
డోజోన్స్	40,225	▽ 439
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,156	▽ 49
డాక్స్	18,172	▽ 183
షాంఘై	2,982	△ 5
నికాయ్	40,064	▽ 63

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,240 ▽	739
బంగారం (99.5 స్వచ్ఛత)	72,947 ▽	736
వెండి (కేజీ)	88,983 ▽	2,572

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతీ	83.23	84.25
£	బ్రిటన్ పౌండ్	ఎంతీ	107.09	109.61
€	యూరో	ఎంతీ	89.93	92.38
¥	జపాన్ ఎన్ (100)	ఎంతీ	53.80	54.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎంతీ	55.15	57.10
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.57	64.14
SAR	సౌదీ రియాల్	[illegible]	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.87	23.66
¥	చైనా యువాన్	[illegible]	10.39	12.46

రిలయన్స్ డీలా

క్యూ1 లాభం రూ. 15,138 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 15,138 కోట్లకు పరిమితమైంది. టెలికం, రిటైల్ బిజినెస్‌ల వృద్ధిని ఇంధన, పెట్రోకెమికల్ మార్జిన్లు దెబ్బతీశాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 16,011 కోట్లు ఆర్జించింది. త్రైమాసికవారీ(క్యూ4)గా నికర లాభం 20 శాతం క్షీణించింది. తరుగుదల, ఎమార్టైజేషన్ వ్యయాలు 16 శాతం పెరిగి రూ. 13,596 కోట్లను తాకాయి. ఇబిటా 2 శాతం వృద్ధితో రూ. 42,748 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 12 శాతం ఎగసి రూ. 2.57 లక్షల కోట్లను తాకింది. ఆయిల్ టు కెమికల్(ఓ2సీ) బిజినెస్ ఇబిటా 14 శాతం నీరసించి రూ. 13,093 కోట్లకు పరిమితమైంది. చమురు, గ్యాస్ ఇబిటా 30 శాతం జంప్‌చేసి రూ. 5,210 కోట్లయ్యింది. కేజీ డీ6 బ్లాక్ నుంచి రోజుకి 28.7 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది. జూన్ చివరికల్లా ఆర్‌ఐఎల్ నికర రుణ భారం రూ. 1.12 లక్షల కోట్లకు చేరింది.

జియో ఇన్ఫోకామ్ గుడ్

జియో ప్లాట్‌ఫామ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం వృద్ధితో రూ. 5,698 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 13 శాతం బలపడి రూ. 34,548 కోట్లను తాకింది. దీనిలో భాగమైన రిలయన్స్ టెలికం సర్వీసుల విభాగం జియో ఇన్ఫోకామ్ స్టాండెలోన్ నికర లాభం వార్షికంగా 12 శాతం ఎగసింది. రూ. 5,445 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 26,478 కోట్లకు చేరింది. వినియోగదారుల సంఖ్య 48.97 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 181.7కు చేరింది. తలసరి డేటా వినియోగం రోజుకి 1జీబీని మించింది. దీంతో డేటా ట్రాఫిక్ కారణంగా ప్రపంచంలో అతిపెద్ద ఆపరేటర్‌గా అవతరించింది. చైనా వెలుపల అతిపెద్ద 5జీ ఆపరేటర్‌గా జియో నిలుస్తోంది.

ఆర్‌ఐఎల్ షేరు బీఎస్‌ఈలో 2 % క్షీణించి రూ. 3110 వద్ద ముగిసింది.



లాభాలు పటిష్టం

కన్జూమర్, ఆయిల్ అండ్ గ్యాస్ బిజినెస్ ప్రభావంతో క్యూ1లో మెరుగైన ఇబిటాను సాధించాం. ఇది డైవర్స్ పోర్ట్‌ఫోలియో బిజినెస్‌కున్న పటిష్టతను ప్రతిఫలిస్తోంది. డిజిటల్ సర్వీసుల బిజినెస్ ప్రోత్సాహకర పనితీరు చూపుతోంది. రిటైల్ బిజినెస్ సైతం పటిష్ట ఆర్థిక ఫలితాలను సాధించింది.
- ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

రిటైల్ బాగుంది...

రిలయన్స్ రిటైల్ విభాగం ఆర్‌ఆర్‌వీఎల్ క్యూ1 నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 2,549 కోట్లయ్యింది. స్థూల ఆదాయం 8 శాతం ఎగసి రూ. 75,615 కోట్లను తాకింది. ఇబిటా 10 శాతంపైగా పుంజుకుని రూ. 5,664 కోట్లకు చేరింది. 331 కొత్త స్టోర్లను తెరిచింది. దీంతో వీటి సంఖ్య 18,918ను తాకింది. మరోపక్క కొత్తగా 30 మెట్రో(హోల్‌సేల్) స్టోర్లకు తెరతీసింది. వీటి సంఖ్య 200కు చేరింది. జర్మన్ దిగ్గజం మెట్రో ఏజీ నుంచి 2022 డిసెంబర్‌లో రిలయన్స్ రూ. 2,850 కోట్లకు మెట్రో బిజినెస్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆషాఢం ఆఫర్లు



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ ఆషాఢ మాసం సందర్భంగా ఆఫర్లను ప్రకటించింది. ప్రతి కొనుగోలుపై నిర్ధారిత బహుమతి పొందవచ్చు. కొనుగోలు విలువ పెరిగే కొద్దీ ఈ బహుమతి విలువ పెరుగుతుంది. పాత బంగారు ఆభరణాలు మార్చుకొనే కస్టమర్లు గ్రాముకు రూ.50 అదనంగా అందుకోవచ్చు. ''ప్రతి ఏడాది ఆషాఢంలో జీఆర్‌టీ షోరూంల్లో కొనుగోలు చేసే కస్టమర్ల ఆనందాన్ని రెట్టింపు చేయడమే మా లక్ష్యం'' అని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఆఫర్లను అందరూ వినియోగించుకోవాలని కోరారు.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

బడ్జెట్‌కు ముందు అప్రమత్తత
- ప్రపంచ మార్కెట్లపై మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్
- 81 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 270 పాయింట్ల నష్టం



ముంబై: దేశీయ స్టాక్ సూచీల నాలుగు రోజుల రికార్డుల ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. వచ్చే వారం కేంద్ర బడ్జెట్ ప్రకటన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో అంతర్జాతీయంగా ఐటీ సేవలకు అంతరాయం కలగడమూ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా సెన్సెక్స్ 739 పాయింట్లు నష్టపోయి 81 వేల దిగువన 80,605 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 270 పాయింట్లు పతనమై 24,531 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 81,588 వద్ద, నిఫ్టీ 24,855 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే అదే జోరును కనబరచడంలో విఫలమయ్యాయి. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీలు రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఒక దశలోనూ సెన్సెక్స్ 844 పాయింట్లు నష్టపోయి 80,499 వద్ద, నిఫ్టీ 292 పాయింట్లు క్షీణించి 24,508 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. మైక్రోసాఫ్ట్‌కు విండోస్ తలెత్తిన సాంకేతిక సమస్యలతో అంతర్జాతీయంగా మార్కెట్లు డీలా పడ్డాయి.

'మైక్రోసాఫ్ట్' ఎఫెక్ట్ మాపై లేదు: ఎక్స్ఛేంజీల వివరణ

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ (బీఎస్‌ఓడీ)ఎర్రర్' సాంకేతిక సమస్య ప్రభావం తమపై పడలేదని బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు ప్రకటించాయి. తమ సేవలు యథావిధిగా కొనసాగినట్లు వేర్వేరు ప్రకటనల్లో వివరణ ఇచ్చాయి.

బ్రోకింగ్ షేర్లకు నష్టాలు

మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలో తలెత్తిన సమస్యలతో పలు రంగాల్లో సేవలకు విఘాతం ఏర్పడడం.. పరోక్షంగా స్టాక్ బ్రోకింగ్ షేర్ల నష్టాలకు దారితీసింది. కొన్ని బ్రోకింగ్ సంస్థల సేవలకు సమస్య తలెత్తడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడమే నష్టాలకు కారణం.

ఇన్వెస్టర్లకు రూ.7.94 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ దాదాపు ఒకశాతం నష్టపోవడంతో బీఎస్‌ఈలో రూ.7.94 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4.46 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలోని 30 షేర్లలో ఇన్ఫోసిస్ 2%, టీసీఎస్ 1%, ఏషియన్ పేయింట్స్ 0.50%, హెచ్‌సీఎల్ టెక్ 0.03 శాతం మాత్రమే లాభపడ్డాయి.

పెన్షన్ ఫండ్స్‌కు పన్ను ప్రయోజనాలు

ఎన్‌పీఎస్ మాదిరే కల్పించాలి • బడ్జెట్‌పై ఆర్థిక మంత్రికి 'యాంఫి' వినతి

పెన్షన్ సదుపాయంతో కూడిన మ్యూచువల్ ఫండ్స్ పథకాలు, డెట్ ఫండ్స్ విషయంలో పన్ను ప్రయోజనాలు కల్పించాలంటూ మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) కేంద్ర ఆర్థిక మంత్రిని కోరింది. బడ్జెట్‌కు ముందు తమ డిమాండ్లను ఆర్థిక మంత్రికి దృష్టికి తీసుకెళ్లింది. జాతీయ పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీసీడీ కింద కల్పిస్తున్న పన్ను మినహాయింపును పెన్షన్ ప్రయోజనంతో కూడిన మ్యూచువల్ ఫండ్స్ (మ్యూచువల్ ఫండ్స్ లింక్డ్ రిటైర్మెంట్ స్కీమ్స్)కు సైతం అమలు చేయాలని కోరింది. అలాగే, డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో మూడేళ్ల, అంతకుమించిన పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పుడు.. వచ్చిన లాభంపై డిబెంచర్లకు మాదిరే ఫ్లాట్ 10% పన్నును, ద్రవ్యోల్బణం మినహాయింపు ప్రయోజనం లేకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈక్విటీల్లో 35% వరకు పెట్టుబడులు పెట్టే డెట్ ఫండ్స్‌కు గతేడాది విధించిన స్వల్పకాల మూలధన లాభాల పన్నును తిరిగి పరిశీలించాలని కోరింది.



బాండ్లలో పెట్టుబడులకు ప్రోత్సాహం

డెట్ ఫండ్స్ ద్వారా బాండ్లలో పెట్టుబడులకు రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహించాలని కూడా ఆర్థిక మంత్రిని యాంఫి కోరింది. డిబెంచర్లు, ప్రభుత్వ సెక్యూరిటీలకు మాదిరే పన్ను రేట్లు అమలు చేయాలని, ఇందుకు ఫైనాన్స్ యాక్ట్, 2023లోని సెక్షన్ 50ఏఏను సవరించాలని వినతిపత్రంలో పేర్కొంది.



స్టార్టప్‌లపై ఏంజెల్ ట్యాక్స్ ఎత్తేయాలి..

స్టార్టప్‌లపై ఏంజెల్ ట్యాక్స్ ఎత్తి వేయాలంటూ పరిశ్రమలు, వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కేంద్ర ఆర్థిక శాఖకు సూచించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ కాని స్టార్టప్‌లు జారీ చేసే షేర్ల విలువ మదింపునకు గాను డీపీఐఐటీ గతేడాది సెప్టెంబర్‌లో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. పారదర్శక మార్కెట్ విలువ కంటే అధిక ధరపై షేర్లు జారీ చేసే స్టార్టప్‌లు ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని తొలగిస్తే స్టార్టప్‌లను ప్రోత్సహించినట్టు అవుతుంది.
– సాక్షి, బిజినెస్ డెస్క్

క్యూ1లో విప్రో ఓకే



- రూ. 3,003 కోట్లు దాటిన నికర లాభం
- క్యూ2 వృద్ధిపై -1నుంచి+1 శాతం అంచనాలు
- 260- 265 కోట్ల డాలర్ల మధ్య ఆదాయం

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 4.6 శాతం వృద్ధితో రూ. 3,003 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం ఆదాయం 3.8 శాతం క్షీణించి రూ. 21,694 కోట్లకు పరిమితమైంది. రెండో త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లో ఐటీ సర్వీసుల ఆదాయం 260–265.2 కోట్ల డాలర్ల మధ్య నమోదుకావచ్చని తాజాగా అంచనా వేసింది. వెరసి త్రైమాసికవారీగా కరెన్సీ నిలకడ ప్రాతిపదికన -1 శాతం నుంచి +1 శాతం మధ్య గైడెన్స్‌ను ప్రకటించింది. బిలియన్ డాలర్లకు మించిన భారీ డీల్స్ ద్వారా మరోసారి ఈ త్రైమాసికంలో కంపెనీ రికార్డు నెలకొల్పినట్లు విప్రో సీఈవో, ఎండీ శ్రీని పాలియా పేర్కొన్నారు. శుక్రవారం మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్‌లో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన సాంకేతిక సమస్యలపై స్పందిస్తూ కంపెనీలో ఎలాంటి సవాళ్లు ఎదురుకాలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ అంశంలో సవాళ్లు ఎదుర్కొన్న యూఎస్, యూరప్ క్లయింట్లకు సహాయం చేసినట్లు తెలియజేశారు.

12,000 మందికి చాన్స్

ఈ ఏడాది 10,000–12,000 మందికి ఉపాధి కల్పించనున్నట్లు విప్రో సీహెచ్‌ఆర్‌వో సౌరభ్ గోవిల్ వెల్లడించారు. గతేడాది క్యూ1తో పోలిస్తే నికరంగా 337 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో జూన్ చివరికల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 2,34,391కు చేరింది.

షేరు బీఎస్‌ఈలో 3% క్షీణించి రూ. 557 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పేటీఎమ్‌కు పెరిగిన నష్టాలు	బ్యాంకింగ్‌లో కార్పొరేట్లకు నో ఎంట్రీ..

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-7-2024	
విశాఖ	550–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో అనిరుధ్-అర్జున్ ద్వయం

న్యూపోర్ట్ (అమెరికా): హాల్ ఆఫ్ ఫేమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) ద్వయం 6–4, 1–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో క్రిస్టియన్ హారిసన్–వాసిల్ కిర్కోవ్ (అమెరికా) జంటపై గెలిచింది.

క్వార్టర్ ఫైనల్లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అమెరికాలో శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 318వ ర్యాంకర్ సహజ 6–3, 7–6 (7/5)తో ప్రపంచ 177వ ర్యాంకర్, రెండో సీడ్ ఎలిజబెత్ మాండ్లిక్ (అమెరికా)పై గెలిచింది. డబుల్స్‌లో సహజ (భారత్)–హిరోకో కువాటా (జపాన్) జోడీ సెమీఫైనల్లోకి చేరింది.





దీపిక కుమారి



తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, ప్రవీణ్ జాధవ్



మరో 6 రోజుల్లో...

ఈసారైనా గురి కుదిరేనా!

దీపిక కుమారిపైనే భారత్ ఆశలు
ఆర్చరీలో ఊరిస్తున్న ఒలింపిక్ పతకం
మూడు విభాగాల్లో ధీరజ్ బరిలోకి

అంతర్జాతీయ టోర్నీలలో మాత్రం నిలకడగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించడం... ఒలింపిక్స్‌కు వచ్చేసరికి తడబడటం... భారత ఆర్చరీ గురించి ఇలా క్లుప్తంగా చెప్పుకోవచ్చు. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీకి తొలిసారి చోటు దక్కింది. భారత్ మాత్రం 1988 సియోల్ ఒలింపిక్స్‌తో అరంగేట్రం చేసింది. పురుషుల వ్యక్తిగత, టీమ్ విభాగంలో లింబారామ్, సంజీవ సింగ్, శ్యామ్‌లాల్ మీనా భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో, 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లోనూ భారత ఆర్చర్లు పాల్గొన్నా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించారు. 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఎవరూ అర్హత పొందలేదు. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో పురుషుల విభాగంతోపాటు తొలిసారిగా మహిళల విభాగంలోనూ భారత్ పోటీపడింది. పురుషుల విభాగంలో సత్యదేవ్ ప్రసాద్, తరుణ్‌దీప్ రాయ్, మాఝీ సవాయన్... మహిళల విభాగంలో డోలా బెనర్జీ, రీనా కుమారి, సుమంగళ శర్మ భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. సత్యదేవ్ ప్రసాద్, రీనా కుమారి ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోగా... తరుణ్‌దీప్, మాఝీ సవాయన్, డోలా బెనర్జీ తొలి రౌండ్‌లో, సుమంగళ శర్మ రెండో రౌండ్‌లో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2008 బీజింగ్, 2012 లండన్, 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత ఆర్చర్లు బరిలోకి దిగినా రిక్తహస్తాలతో వెనుదిరిగారు.

గత మూడేళ్ల కాలంలో భారత ఆర్చర్లు నిలకడగా రాణించారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఐదు విభాగాల్లోనూ అర్హత సాధించారు. పురుషుల టీమ్ విభాగంలో బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్... మహిళల టీమ్ విభాగంలో దీపిక కుమారి, భజన్ కౌర్, అంకిత భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ పురుషుల టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో... భజన్ కౌర్ మహిళల టీమ్, వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో పోటీపడతారు. 40 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్, 30 ఏళ్ల దీపిక కుమారి నాలుగోసారి ఒలింపిక్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ముఖ్యంగా దీపికా కుమారిపై భారత్ భారీ ఆశలు పెట్టుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచకప్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా చాంపియన్‌షిప్... ఇలా అన్ని మెగా టోర్నీల్లో పతకాలు గెల్చుకున్న దీపిక ఖాతాలో కేవలం ఒలింపిక్ పతకం మాత్రమే లోటుగా ఉంది. ఈ ఏడాది దీపిక మంచి ఫామ్‌లో ఉంది. షాంఘై ప్రపంచకప్ టోర్నీలో రజత పతకం సాధించగా... ఆసియా కప్‌లో స్వర్ణ పతకం గెలిచింది. ఓవరాల్‌గా దీపిక ప్రపంచకప్ టోర్నీల్లో 37 పతకాలు... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదుపతకాలు సాధించి భారత అత్యుత్తమ ఆర్చర్‌గా పేరు తెచ్చుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో దీపిక తన అనుభవాన్నంతా రంగరించి పోరాడాల్సిన అవసరం ఉంది. కీలకదశలో ఒత్తిడికి తడబడి గురి తప్పడం దీపిక బలహీనతగా ఉంది. అయితే మూడు ఒలింపిక్స్‌లలో పోటీపడ్డ దీపిక ఈ బలహీనతను పారిస్‌లో అధిగమిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. పారిస్ గేమ్స్ నుంచి దీపిక పతకంతో తిరిగొస్తే భారత్‌లో ఆర్చరీకి మరింత ఆదరణ పెరుగుతుంది.

విజయవాడకు చెందిన 22 ఏళ్ల ధీరజ్ కూడా కొన్నాళ్లుగా నిలకడగా రాణిస్తూ పారిస్ గేమ్స్‌లో తన నుంచీ పతకం ఆశించవచ్చని ఆశలు రేకెత్తిస్తున్నాడు. గత రెండేళ్లలో ధీరజ్ ప్రపంచకప్ టోర్నీల్లో మొత్తం ఎనిమిది పతకాలు నెగ్గాడు. ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో, ఆసియా గ్రాండ్‌ప్రి టోర్నీల్లో ఐదు పతకాలు సాధించాడు. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న ధీరజ్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పతకంతో తిరిగొస్తే భారత ఆర్చరీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటాడు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ ఈవెంట్ జూలై 28 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. ఆర్చరీలో కాంపౌండ్, రికర్వ్ అని రెండు కేటగిరీలున్నా... ఒలింపిక్స్‌లో మాత్రం కేవలం రికర్వ్ విభాగంలోనే పోటీలు నిర్వహిస్తారు.
–సాక్షి క్రీడా విభాగం

మన మహిళలదే పైచేయి

- ఆసియా కప్‌లో భారత్ శుభారంభం
- 7 వికెట్లతో పాకిస్తాన్‌పై ఘన విజయం
- రాణించిన బౌలర్లు, స్మృతి, షఫాలీ
- ఆదివారం యూఏఈతో మ్యాచ్



స్మృతి మంధాన

దంబుల్లా: డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో శుభారంభం చేసింది. పాకిస్తాన్‌పై తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ మరో విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 19.2 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. సిద్రా అమీన్ (35 బంతుల్లో 25; 3 ఫోర్లు) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... రేణుక, శ్రేయాంక పాటిల్, పూజ వస్త్రకర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 14.1 ఓవర్లలో 3 వికెట్లకు 109 పరుగులు చేసింది. స్మృతి మంధాన (31 బంతుల్లో 45; 9 ఫోర్లు), షఫాలీ వర్మ (29 బంతుల్లో 40; 6 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 57 బంతుల్లోనే 85 పరుగులు జోడించారు.

టపటపా...

భారత మహిళల పదునైన బౌలింగ్ ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. పూజ తన తొలి రెండు ఓవర్లలో 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని నిలువరించగా, పవర్‌ప్లే ముగిసేసరికి పాక్ 37 పరుగులు చేసింది. కెప్టెన్ నిదా దార్ (8) ప్రభావం చూపలేకపోగా, రేణుక వరుస బంతుల్లో రెండు వికెట్లతో పాక్‌ను దెబ్బ కొట్టింది. ఈ దశలో తుబా, ఫాతిమా పోరాడి 25 బంతుల్లో 35 పరుగులు జత చేశారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో 3 వికెట్లు కోల్పోయిన పాకిస్తాన్...రాధ ఓవర్లో ఫాతిమా రెండు సిక్స్‌లు బాదడంతో 100 పరుగులు దాటింది. 47 పరుగుల వ్యవధిలో పాక్ చివరి 6 వికెట్లు చేజార్చుకుంది.

ఒకే ఓవర్లో 21 పరుగులు...

ఛేదనలో భారత ఓపెనర్లు షఫాలీ, స్మృతి దూకుడుగా ఆడారు. వరుసగా మూడు ఓవర్లలో రెండేసి ఫోర్లు రాగా...తుబా ఓవర్లో స్మృతి రెండు ఫోర్లు, షఫాలీ ఒక సిక్స్ బాదారు. ఫలితంగా 6 ఓవర్లలోనే స్కోరు 57 పరుగులకు చేరింది. ఆ తర్వాత తుబా వేసిన ఇన్నింగ్స్ 8వ ఓవర్లో స్మృతి చెలరేగింది. ఏకంగా ఐదు ఫోర్లు (4, 0, 4, 1 వైడ్, 4, 4, 4) బాదడంతో 21 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత 17 పరుగుల వ్యవధిలో స్మృతి, షఫాలీతో పాటు హేమలత (14) కూడా వెనుదిరిగినా...హర్మన్ (5 నాటౌట్), జెమీమా (3 నాటౌట్) కలిసి లాంఛనం పూర్తి చేశారు. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో నేపాల్ ఆరు వికెట్ల తేడాతో యూఏఈ జట్టుపై విజయం సాధించింది.




మిథాలీ చేతుల మీదుగా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న దీప్తి శర్మ

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫిరోజా (సి) హర్మన్ (బి) పూజ 5; మునీబా (సి) రోడ్రిగ్స్ (బి) పూజ 11; సిద్రా (సి) రాధ (బి) రేణుక 25; ఆలియా (సి) రోడ్రిగ్స్ (బి) శ్రేయాంక 6; నిదా (సి) హేమలత (బి) దీప్తి 8; తుబా (సి) రాధ (బి) దీప్తి 22; ఇరమ్ (ఎల్బీ) (బి) రేణుక 0; ఫాతిమా (నాటౌట్) 22; అరూబ్ (రనౌట్) 2; నష్రా (సి) రిచా (బి) దీప్తి 0; సాదియా (బి) శ్రేయాంక 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.2 ఓవర్లలో ఆలౌట్) 108. **వికెట్ల పతనం:** 1–9, 2–26, 3–41, 4–59, 5–61, 6–61, 7–92, 8–94, 9–94, 10–108. **బౌలింగ్:** రేణుక 4–0–14–2, పూజ 4–0–31–2, దీప్తి శర్మ 4–0–20–3, రాధ 4–0–26–0, శ్రేయాంక పాటిల్ 3.2–0–14–2. **భారత్ ఇన్నింగ్స్:** షఫాలీ (బి) అరూబ్ 40; స్మృతి (సి) ఆలియా (బి) అరూబ్ 45; హేమలత (సి) తుబా (బి) నష్రా 14; హర్మన్ (నాటౌట్) 5; జెమీమా (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం** (14.1 ఓవర్లలో 3 వికెట్లకు) 109. **వికెట్ల పతనం:** 1–85, 2–100, 3–102. **బౌలింగ్:** సాదియా 2.1–0–18–0, ఫాతిమా 2–0–15–0, నిదా 1–0–10–0, తుబా 2–0–36–0, నష్రా 4–0–20–1, అరూబ్ 3–0–9–2.

ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ



స్టాడ్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో మూడో సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ ఫైనల్లోకి చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 7–6 (7/4)తో ఐదో సీడ్ ఆరెండ్స్–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. మరోవైపు జర్మనీలో జరుగుతున్న హాంబర్గ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీ తొలి రౌండ్‌లో 1–6, 4–6తో జేకబ్ ష్నయిటర్–మార్క్ వాల్నర్ (జర్మనీ) జంట చేతిలో ఓటమి పాలైంది.

హోప్ సెంచరీ: విండీస్ 351/5



నాటింగ్‌హమ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ దీటైన జవాబు ఇచ్చింది. రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ ఆట ముగిసే సమయానికి 84 ఓవర్లలో 5 వికెట్లకు 351 పరుగులు చేసింది. కావెమ్ హాడ్జ్ (120; 19 ఫోర్లు) సెంచరీ సాధించాడు. అథనాజ్ (82; 10 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి హాడ్జ్ నాలుగో వికెట్‌కు 175 పరుగులు జోడించాడు. ప్రస్తుతం హోల్డర్ (23 బ్యాటింగ్), జోషువా డిసిల్వా (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 416కు విండీస్ మరో 65 పరుగుల దూరంలో ఉంది.

క్లుప్తంగా...

ఎన్‌ఎంసీకి అప్పీల్‌కు ఎట్టకేలకు అనుమతి

కొత్త వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభించేందుకు అనుమతి కోరిన ప్రిన్సిపాల్స్

సాక్షి, అమరావతి: మదనపల్లి, మార్కాపురం, ఆదోని, పాడేరు, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతుల కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ)కి అప్పీల్ చేయాలని ప్రభుత్వం ఎట్టకేలకు వైద్య శాఖకు చెప్పింది. దీంతో శుక్రవారం ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌ఎంసీకి అప్పీల్ చేస్తూ లేఖలు రాశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టగా.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కళాశాలల్లో తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించలేదు. దీంతో గత నెలలో ఎన్‌ఎంసీ తనిఖీలు నిర్వహించి నప్పటికీ.. ఐదు కళాశాలలకు అనుమతులు నిరాకరించింది. ఈ నెల 6వ తేదీన అనుమతుల నిరాకరణపై కళాశాలలకు లేఖలు రాసింది. అప్పీల్‌కు వెళ్లడానికి రెండు వారాల సమయం ఇచ్చింది. అప్పీల్‌కు వెళ్లే అంశంపై వైద్య శాఖ ప్రభుత్వ అనుమతులు కోరింది. అనుమతి ఇవ్వకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరించిన ప్రభుత్వం ఎట్టకేలకు గురువారం రాత్రి స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. దీంతో శుక్రవారం హుటాహుటిన ఎన్‌ఎంసీకి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌ఎంసీకి అప్పీల్ చేశారు. గత ప్రభుత్వంలోనే 5 వైద్య కళాశాలల్లో 70 నుంచి 90 శాతం మేర ఫ్యాకల్టీని నియమించి.. ఎంబీబీఎస్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభించేందుకు వీలుగా లెక్చర్ హాల్, హాస్టళ్లు, ల్యాబ్ వంటి వసతులు దాదాపు చేపట్టారు. అప్పీళ్లను ఎన్‌ఎంసీ ఆమోదించి, రెండో విడత తనిఖీలకు వచ్చేలోగా మిగిలిన ఫ్యాకల్టీని నియమించడంతోపాటు ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. కాగా, అప్పీల్‌కు వెళ్లమని చెప్పిన ప్రభుత్వం, నియామకాలు, ఇతర అంశాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదని తెలిసింది.

పొదిలి, మర్రిపూడిలో భూ ప్రకంపనలు

పొదిలి/మర్రిపూడి: ప్రకాశం జిల్లాలో శుక్రవారం పలుచోట్ల భూప్రకంపనలు సంభవించాయి. పొదిలి పట్టణంలో ఉదయం 10 గంటల సమయంలో మూడు సెకన్లపాటు భూప్రకంపనలతో పాటు శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో మర్రిపూడిలోనూ రెండు సెకన్లపాటు భూమి కంపించింది. ఇళ్లలోని వస్తువులు కింద పడిపోవడం, రేకులు అదరడం వంటివి జరిగాయి.

నేడు విశాఖలో గర్భాశయ సంరక్షణ కేంద్రం ప్రారంభం

మహారాణిపేట (విశాఖ జిల్లా): దేశంలో తొలి గర్భాశయ సంరక్షణ కేంద్రం (పీటీయూ) విశాఖలో ఏర్పాటు కానుంది. బేయర్ ఫార్మా, ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఓజీఎస్‌ఐ), రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సహకారంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. గర్భాశయ శస్త్రచికిత్సలను తగ్గించడం, మహిళల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఈ కేంద్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కేజీహెచ్‌లో పీటీయూను ప్రారంభించనున్నారు.

'ఫాస్టాగ్' అతికించకపోతే టోల్ రెట్టింపు

ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం

సాక్షి, అమరావతి: వాహనానికి ఫాస్టాగ్ లేదా...అయితే జాతీయ రహదారిపై ఇక నుంచి డబుల్ టోల్ ఫీజు బాదుడు భరించాల్సిందే. ఈ మేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. ఫాస్టాగ్ స్టిక్కర్ అతికించి ఉండని వాహనాల నుంచి రెట్టింపు టోల్ ఫీజు వసూలు చేయాలని ఆదేశించింది. చాలా ఏళ్లుగా పేటీఎం ఫాస్టాగ్‌లు చలామణిలో ఉండేవి. ఇటీవల పేటీఎం సంస్థ ఆర్థిక సమస్యల్లో కూరుకుపోవడంతో ఆ సంస్థను ఎన్‌హెచ్‌ఏఐ తొలగించింది. ఆ స్థానంలో పలు జాతీయ, ప్రైవేటు బ్యాంకుల నుంచి తీసుకునే ఫాస్టాగ్‌ను వాడుకలోకి తీసుకువచ్చింది. పలు వాహనదారులు కొత్త ఫాస్టాగ్‌లను తీసుకున్నా సరే వాటిని తమ వాహనాల ముందటి అద్దాలపై అతికించడం లేదు. వాహనాల అద్దంపై ఫాస్టాగ్ స్టిక్కర్లను కచ్చితంగా అతికించాలని స్పష్టం చేసింది. ఫాస్టాగ్ స్టిక్కర్ అతికించని వాహనాల నుంచి రెట్టింపు టోల్ ఫీజు వసూలు చేయాలని ఆదేశించింది.

పాఠశాల విద్య క్యాలెండర్‌ను విడుదల చేయండి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: పాఠశాలలు ప్రారంభమై దాదాపు 40 రోజులు గడుస్తున్నా ఇంకా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడం సరికాదని, వెంటనే పాఠశాల విద్యాశాఖ క్యాలెండర్‌ను విడుదల చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ట్యాబ్స్ పంపిణీ ఆపేయండి: ఆప్టా

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు విద్యా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబ్స్ పంపిణీని నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) కోరింది.

కంప్యూటర్ సైన్స్ ఫస్ట్.. ఈసీఈ సెకండ్



- ఈ రెండు కేటగిరీల సీట్లకే విద్యార్థుల ప్రాధాన్యం
- రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్లు 1,36,660
- తొలి విడతలో భర్తీ అయినవి 1,17,136
- సీఎస్ఈలో 40,242, ఈసీఈలో 21,060 సీట్ల భర్తీ
- ఈసారి 9 ప్రైవేటు వర్సిటీల్లో తొలి దశలో 7,700 సీట్లు భర్తీ
- వచ్చే వారంలో ఎన్‌ఆర్‌ఐ, కేటగిరీ–బి సీట్లకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు హాట్ కేకులను తలపిస్తున్నాయి. ఇంజనీరింగ్ సీట్ల తొలి విడత కౌన్సెలింగ్‌లో 86 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది కన్వీనర్ కోటాలో మొత్తం 245 కళాశాలల్లో 1,36,660 సీట్లు ఉండగా తొలి దశలో 1,17,136 సీట్లు భర్తీ అవడం విశేషం. 19,524 సీట్లు మలి విడత కౌన్సెలింగ్ ద్వారా కేటాయిస్తారు. విద్యార్థులు కంప్యూటర్ సైన్సుకే తొలి ప్రాధాన్యతనిచ్చారు. ఆ తర్వాత ఈసీఈకి డిమాండ్ ఉంది. కాలేజీలు కూడా ఇదే దృష్టితో కంప్యూటర్ సైన్సు సీట్లను ఎక్కువగా అందుబాటులో ఉంచాయి. ఈ మేరకు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి నుంచి అనుమతులు తెచ్చుకున్నాయి.

కంప్యూటర్ సైన్స్‌లోనే ఎక్కువ..

కంప్యూటర్ సైన్స్‌లో కన్వీనర్ కోటాలో 42,303 సీట్లు ఉండగా, 40,242 సీట్లు తొలి దశలోనే భర్తీ అయ్యాయి. అంటే సీట్లన్నీ దాదాపుగా భర్తీ అయ్యాయి. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో (ఈసీఈ)లో 24,121 సీట్లు ఉండగా, 21,060 సీట్లను కేటాయించారు. సీఎస్ఈ (ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్)లో 11,156 సీట్లకు గాను 10,133 సీట్లు భర్తీ అయ్యాయి. ఫెసిలిటైస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్‌లో 66 సీట్లలో ఒక్కటి కూడా భర్తీ కాలేదు. కన్‌స్ట్రక్షన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో 64 సీట్లకు గాను 7 సీట్లే భర్తీ అయ్యాయి. తొలి దశ కౌన్సెలింగ్ 17వ తేదీతో ముగిసింది. శుక్రవారం నుంచి కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. తొలి విడతలో మిగిలిన 19,524 సీట్లకు వచ్చే వారంలో మలి విడత కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. దానికంటే ముందే ఎన్‌ఆర్‌ఐ, కేటగిరీ–బి సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. చివరి దశలో కళాశాలలకు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించనుంది.

వైఎస్ జగన్ దార్శనికతతో..

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దార్శనికత, సంస్కరణలతో మెరిట్ సాధించిన పేద, మధ్య తరగతి విద్యార్థులు కూడా ప్రైవేటు వర్సిటీల్లో సీట్లు సాధించుకోగలిగారు. రాష్ట్రంలో 9 ప్రైవేటు వర్సిటీలు ఉన్నాయి. వీటిలో గ్రీన్‌ఫీల్డ్ వర్సిటీల్లో 35 శాతం, బ్రౌన్ ఫీల్డ్ వర్సిటీల్లో 70 శాతం సీట్లను ఏపీఈఏపీసెట్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో కేటాయించేలా గత వైఎస్ జగన్ సర్కారు సంస్కరణలు తెచ్చింది. దీంతో గడిచిన రెండేళ్లలో 7 ప్రైవేటు వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఎందరో పేదింటి విద్యార్థులు మెరుగైన ఉన్నత విద్యను అందుకున్నారు. ఈ ఏడాది ప్రైవేటు వర్సిటీలు 9కి చేరడంతో సీట్ల సంఖ్య 7,832కు చేరుకుంది. ఇందులో ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో తొలి విడతలోనే 7,700 సీట్లను విద్యార్థులు దక్కించుకున్నారు. గతంలో 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రైవేటు వర్సిటీల్లో చదువంటే పేద మెరిట్ విద్యార్థులకు సాధ్యమయ్యేది కాదు. లక్షల్లో ఫీజులు చెల్లించే వారికే అక్కడ సీట్లు దక్కేవి. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రావడంతో ఈ వర్సిటీల్లో పేద విద్యార్థులూ చదువుకోగలుగుతున్నారు.

కళాశాలల వారీగా సీట్ల భర్తీ ఇలా..

విభాగం	కళాశాలలు	సీట్ల సంఖ్య	భర్తీ అయిన సీట్లు
వర్సిటీ కళాశాలలు	24	6,877	6,189
ప్రైవేటు కళాశాలలు	212	1,21,951	1,03,247
ప్రైవేటు వర్సిటీలు	9	7,832	7,700
మొత్తం	245	1,36,660	1,17,136

కన్వీనర్ కోటాలో ముఖ్యమైన విభాగాల్లో సీట్ల భర్తీ ఇలా..

విభాగం	మొత్తం సీట్లు	భర్తీ చేసినవి	మిగులు
కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్	42,303	40,242	2,061
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్	24,121	21,060	3,061
సీఎస్ఈ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్)	11,156	10,133	1,023
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	8,800	6,239	2,561
మెకానికల్ ఇంజనీరింగ్	7,996	4,862	3,134
కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్)	7,539	6,553	986
సివిల్ ఇంజనీరింగ్	6,760	4,166	2,594
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	5,020	4,829	191
సీఎస్ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)	4,945	4,348	597
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్	4,632	3,721	911
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్	3,553	2,979	574
సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ)	1,658	1551	107

15 మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు
- 90.5 కేజీల గంజాయి స్వాధీనం
- విజయవాడ డీసీపీ హరికృష్ణ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ హరికృష్ణ

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ఏజెన్సీల నుంచి సేకరించిన గంజాయిని విజయవాడ, పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ముఠాలోని ప్రధాన నిందితుడితో పాటు మరో14 మందిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం అరెస్ట్ చేసింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాలతో ఈ ముఠా కదలికలపై ప్రత్యేక దృష్టి సారించింది. యాంటి నార్కోటిక్ సెల్, టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను విజయవాడ కమాండ్‌ కంట్రోల్ రూంలో విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) హరికృష్ణ శుక్రవారం వెల్లడించారు.

ప్రధాన నిందితుడు పింక్‌రౌత్..

పోలీసుల అదుపులో నున్న 14మంది గంజాయి స్మగ్లర్లు ఇచ్చిన సమాచారంతో గత కొన్నేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ప్రధాన నిందితుడు ఒడిశాకు చెందిన పింకి రౌత్‌ను అరెస్ట్ చేశారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన బరంపురం, పీలేరు ఏజెన్సీ ప్రాంతాల్లోని వ్యక్తుల నుంచి గంజాయిని సేకరించి విజయవాడకు సరఫరా చేయడంలో పింక్‌రౌత్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని డీసీపీ హరికృష్ణ తెలిపారు.ఇతనిపై గతంలో మాచవరం పోలీస్‌స్టేషన్‌లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. విజయవాడ సిటీ, చుట్టుపక్కలనున్న పలు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గోగినేని మాధవరావు, తెలంగాణా, మేడ్చల్, పోతయిపల్లికి చెందిన మురుగన్ మణికంఠ, సంకేలి గణేష్, కృష్ణా జిల్లా, పెనమలూరుకు చెందిన షేక్ మొహమ్మద్ గౌస్ అబ్దుల్ హబీబ్, విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన మర్రి రఘురాం, విజయవాడ మాచవరం డౌన్‌కు చెందిన కొమ్ము రాకేశ్, విజయవాడ భవానీపురానికి చెందిన పాలెటి మమతరాజు, మహమ్మద్ ముజ్జమిల్ సుల్తాన్, షేక్ నజీర్, మత్తే నాని, ఇల్లూరి మధుసూదన్‌రెడ్డి, కృష్ణలంకకు చెందిన అడపాల వంశీ, అమన్‌సింగ్‌ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరిందరిపై గతంలో అనేక కేసులు నమోదయినట్లు చెప్పారు. నిందితుల నుంచి 90.5 కేజీల గంజాయితో పాటు ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, ప్రజలు 91211 62475కు గంజాయి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరి, సీఐలు నాగేంద్రకుమార్, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

సినిమాల్లో దొంగతనం సీన్లు చూసి..

- రైలు దొంగగా అవతారం ఎత్తిన యువకుడు
- చీరాల రైల్వే స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్
- రూ.3.81 లక్షల సొత్తు స్వాధీనం

చీరాల రూరల్/నెల్లూరు (క్రైమ్): విలాసాలు, వ్యసనాలకు బానిసయిన ఓ యువకుడు ఇంటర్నెట్‌లో సినిమాలు చూసి ‘రైలు దొంగ’గా అవతారమెత్తి.. కటకటాలపాలయిన ఘటన బాపట్ల జిల్లా చీరాల రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. శుక్రవారం రైల్వే డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరులోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన పెదాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ అలియాస్ వెంకటేష్ వ్యసనాలకు, విలాసవంతమైన జీవనానికి అలవాటుపడ్డాడు. కూలీ ద్వారా సంపాదించిన మొత్తం తన అవసరాలకు సరిపోకపోవడంతో ఈజీ మార్గంలో మనీ సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం సినిమాల్లో రైళ్లలో దొంగతనాలు చేసే సీన్లు చూసి ప్రేరణ పొంది దొంగగా అవతారమెత్తాడు. రైళ్లల్లో తిరుగుతూ ప్రయాణికులు ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగ్‌లు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను అపహరించేవాడు. ఇటీవల చీరాలలో రైలు దొంగతనాలు అధికం కావడంతో గుంతకల్లు రైల్వే జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు.. ఒంగోలు జీఆర్పీ సీఐ కె.భుజంగరావు ఆధ్వర్యంలో చీరాల జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్.కొండయ్య తన సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు వెంకటేశ్వర్లును గుర్తించారు. గురువారం రాత్రి చీరాల రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.3.81 లక్షల విలువచేసే 62 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్, మూడు వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

విమానాలకు 'మైక్రోసాఫ్ట్' ఎఫెక్ట్

రాష్ట్రంలో నిలిచిపోయిన పలు సర్వీసులు

- విశాఖ నుంచి 4, తిరుపతి నుంచి 2, విజయవాడ నుంచి ఒకటి రద్దు
- ఆలస్యంగా పలు సర్వీసులు
- ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- ఇది అంతర్జాతీయ సమస్య.. సహకరించండి: విమానాశ్రయ డైరెక్టర్లు

సాక్షి, అమరావతి: మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ సమస్య రాష్ట్ర విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావాన్నే చూపించింది. రాష్ట్రం నుంచి పదికిపైగా విమాన సర్వీసులు నిలిచిపోగా పలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా విమానాలు నడిచే విశాఖలో 4 సర్వీసులు రద్దయ్యాయి. తిరుపతిలో 2, విజయవాడలో ఒక సర్వీసు నిలిచిపోయాయి. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాల్లో కూడా పలు సర్వీసులు రద్దయినట్లు అధికారులు వెల్లడించారు. విశాఖ నుంచి రద్దయిన వాటిలో మూడు ఇండిగో, ఒక ఇండియా వన్ సర్వీసులు ఉన్నట్లు వైజాగ్ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి ‘సాక్షి’కి వివరించారు. దీంతో హైదారబాద్, కోల్‌కతా, జైపూర్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇబ్బంది కలిగిందన్నారు. అలాగే విశాఖ నుంచి పలు సర్వీసులు గంట నుంచి గంటన్నరకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇండిగోకు చెందిన తిరుపతి–హైదరాబాద్ సర్వీసులు 2 రద్దవగా, 5కు పైగా సర్వీసులు ఆలస్యంగా నడిచినట్లు తిరుపతి అధికారులు చెప్పారు. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లే ఇండిగో సర్వీసు రద్దవగా, ఇక్కడి నుంచి పలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు విజయవాడ విమానాశ్రయం డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

మాన్యువల్‌గా బోర్డింగ్ పాసులు

మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ సమస్యతో బోర్డింగ్ పాసుల జారీ కూడా నిలిచిపోయింది. దీంతో మాన్యువల్‌గా బోర్డింగ్ పాసులు జారీ చేస్తున్నారు. సర్వీసులు ఆలస్యంగా నడవడానికి ఇదే ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. బోర్డింగ్ పాసులను వేగంగా జారీ చేయడానికి విమాన సర్వీసు సంస్థలు అధిక సిబ్బందిని నియమిస్తున్నాయి. సిబ్బంది షిఫ్టులు, సెలవులను రద్దు చేసి అధిక సిబ్బందితో సేవలందిస్తున్నాయి. సర్వీసులు ఆలస్యం అయినప్పటికీ ప్రయాణికులు వేచి ఉండటానికి తగినన్ని గదులు, శౌచాలయాలు, ఫుడ్ కోర్టులు ఉన్నాయని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇది అంతర్జాతీయ సమస్య అని, ప్రయాణికులు సహకరించాలని విమానాశ్రయాల అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లిష్టమైన కేసులను పరిష్కరించారు

- జస్టిస్ రవీంద్రబాబు పదవీ విరమణ సభలో హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్
- ఘనంగా వీడ్కోలు పలికిన ఏపీ హైకోర్టు



పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ రవీంద్రబాబు దంపతులను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం

సాక్షి, అమరావతి: ఎన్నో క్లిష్టమైన కేసులను సులభంగా పరిష్కరించిన న్యాయమూర్తి జస్టిస్ అడుసుమల్లి వెంకట రవీంద్రబాబు అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. న్యాయవ్యవస్థకు రవీంద్రబాబు అందించిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి జస్టిస్ అడుసుమల్లి వెంకట రవీంద్రబాబుకు హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీజే జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థకు జస్టిస్ రవీంద్రబాబు అందించిన సేవలు వెలకట్టలేనివని చెప్పారు. న్యాయ వ్యవస్థ పరిపాలనను మెరుగుపరచడానికి ఎంతో కృషి చేశారన్నారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జస్టిస్ రవీంద్రబాబు పదవీ విరమణ న్యాయవ్యవస్థకు లోటన్నారు. ఎన్నో కేసుల్లో నాణ్యమైన తీర్పులు వెలువరించారని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించారన్నారు. అనంతరం జస్టిస్ రవీంద్రబాబు మాట్లాడుతూ ఎంత కాలం న్యాయమూర్తిగా పనిచేశామన్నది ముఖ్యం కాదని, ఎంత నాణ్యతతో, క్రమశిక్షణలో పనిచేశామన్నదే ముఖ్యమన్నారు. అనంతరం జస్టిస్ రవీంద్రబాబు దంపతులను హైకోర్టు న్యాయవాదుల సంఘం ఘనంగా సత్కరించింది. హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నరసింహ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కూలీలపై కక్ష సాధింపు

- యూబీ పరిశ్రమ నుంచి ఐదుగురు కార్మికుల తొలగింపు
- ఎన్నికల్లో కూటమికి అనుకూలంగా లేరన్నదే ఆరోపణ
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు అనుచరుల ఆగడాలు



రోడ్డునపడ్డ కాంట్రాక్ట్ కార్మికులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో ఎమ్మెల్యే ఈశ్వరరావు అనుచరుల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. జూన్ 15న పరిశ్రమ యాజమాన్యంపై కూటమి కార్మికులు దాడికి పాల్పడి, తిరిగి వాళ్లే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. తాజాగా ఇరవై ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్న ఐదుగురు కార్మికుల్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశారన్న కక్షతో దాడి చేసి పరిశ్రమలోంచి బయటకు గెంటేశారు. పసుపురెడ్డి సత్యనారాయణ, జాక గంగరాజు, గోరు శంకరరావు, యండ తవుడు, కొంగరాపు గొల్లవాడులు 2003 నుంచి పార్టీలకతీతంగా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రాజకీయాలు బయటే తప్ప ఫ్యాక్టరీలో ఉండేవి కావు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్టరీలోకి రాజకీయం చొరబడింది. సత్యనారాయణ అనే కార్మికుడిని ముందు పని నుంచి నిలిపేయగా, మిగతా నలుగురిని ఈ నెల 15న గేటు వద్ద కూటమి కార్మికులు దాడి చేసి.. బయటకు గెంటేశారు. వీళ్లంతా ఎచ్చెర్ల ఎమ్మెల్యే, బీజేపీ నేత ఎన్.ఈశ్వరరావు సొంత గ్రామం బంటుపల్లి పంచాయతీకి చెందిన వారు. తమకు జరిగిన అన్యాయంపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

ఎక్కడికక్కడ తమ చెప్పుచేతల్లోకి..

ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయని వారిపై జిల్లాలో ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. కొన్ని చోట్ల దారి కాచి కత్తులు, కొడవళ్లతో దాడి చేసిన ఘటనలూ ఉన్నాయి. కొన్ని చోట్ల ఎన్నికల్లో తమకు పనిచేయలేదన్న అక్కసుతో వారి ఆస్తులను ధ్వంసం చేశారు. ఇక ధనదాహం తీర్చుకునేందుకు వ్యాపారులపై, పరిశ్రమలపై పడుతున్నారు. దాడులు చేసి తమ గుప్పెట్లోకి తెచ్చుకుంటున్నారు. దీనికి ఉదాహరణగా రణస్థలం మండలంలో యూబీ బీర్ల కంపెనీనే తీసుకోవచ్చు. తాము చెప్పినట్టు నడుచుకోవాలని, ప్రతి నెలా కప్పం కట్టాలని బీర్ల కంపెనీ ప్రతినిధులపై దాడి చేయడమే కాకుండా గాయపడ్డ వారిపై తిరిగి కేసులు పెట్టి వేధించారు. చివరికి కూటమి ఎమ్మెల్యే, మంత్రి పంతమే నెగ్గింది. కప్పం కట్టేందుకు అంగీకరించడంతో పాటు తమ మనుషులు చెప్పినట్టుగా నడుచుకునేలా దారికి తెచ్చుకున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. తాజాగా అదే బీర్ల కంపెనీలో పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను ఉద్యోగాల నుంచి తొలగించి కసి తీర్చుకున్నారు.

రాజకీయ కక్షతోనే తొలగింపు..

సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా పని చేయలేదనే కక్షతో నన్ను తొలగించారు. 2003 నుంచి పరిశ్రమలో పని చేస్తున్నాను. ఇలా ఉన్న ఫళంగా నన్ను తీసేస్తే నా కుటుంబం ఏమైపోవాలి. మేమంతా రోడ్డున పడ్డాం.

– గోరు శంకరరావు, కార్మికుడు, బంటుపల్లి

ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లి బతిమిలాడమంటున్నారు

ఇరవై ఒక్క ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నాను. ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేకు అనుకూలంగా పని చేయలేదని నన్ను డ్యూటీకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. యాజమాన్యాన్ని అడిగితే కాంట్రాక్టర్‌ను అడగమని, కాంట్రాక్టర్‌ను అడిగితే ఎమ్మెల్యేను కలువు అని చెబుతున్నారు. నాకు రాజకీయాలతో సంబంధం లేదు. నా ఉద్యోగం నాకు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతున్నా..

– పసుపురెడ్డి సత్యనారాయణ, కార్మికుడు, బంటుపల్లి

థాయ్‌లాండ్‌కు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూర్

తాటిచెట్లపాలెం (విశాఖ జిల్లా): ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు.

మేజికల్ థాయ్‌లాండ్

ఈ టూర్ మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7వ తేదీన విశాఖలో మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఇది విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలో గల నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లో గల గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. మొత్తం భోజనాలు, టిఫిన్స్, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సీయింగ్, ఇన్సూరెన్స్, అన్నింటితో కలిపి ఒకొక్కరికి 57,815/- (డబుల్, ట్రిపుల్ ఆక్యుపెన్సీ), రూ.66,735 (సింగిల్ ఆక్యుపెన్సీ)

సదరన్ డివైన్ టెంపుల్ టూర్

ఈ యాత్ర మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం వంటి దర్శనీయ స్థలాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒక్కొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్‌సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్, అన్ని కలిపి రూ. 38,005 (ట్రిపుల్, డబుల్ ఆక్యుపెన్సీ), రూ.39,880 (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.51,400 (సింగిల్ ఆక్యుపెనీ)గా చార్జీలను నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్ –92810 30748, సాయిప్రసాద్– 92814 95847, కేవీ రావు–95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

ఆత్మహత్య కేసును సీబీఐకి అప్పగించండి



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: నగరంలో యువతి ఆత్మహత్య కేసులో ప్రేమికుడిపై చర్యలు చేపట్టాలని జిల్లా బోవి సమాజం మహిళా అధ్యక్షురాలు శశికళ డిమాండ్ చేశారు. శుక్రవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనసుద్దేశించి ఆమె మాట్లాడారు. గత నెల 21న నగరంలోని సాంత్వన మహిళా కేంద్రంలో అనురాధ పైఅంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. ప్రేమించిన వినయ్ రెడ్డి అనురాధ ప్రేమను నిరాకరించడంతో పాటు పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందన్నారు. వినయ్ రెడ్డిని అరెస్ట్ చేసి సీబీఐతో విచారణ చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో వంద శాతం కన్నడిగులకే ఉద్యోగాలివ్వాలని కరవే డిమాండ్ చేసింది. జిల్లాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం చేపట్టిన ఆందోళనసుద్దేశించి అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడారు. వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలతో పాటు ఇతర కంపెనీల్లో ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించకుండా కన్నడిగులకే ఉద్యోగాలు అనే చట్టాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

డిగ్రీ కాలేజీని ప్రారంభించండి

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకా గబ్బూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ప్రారంభించాలని ప్రగతిశీల సంఘం ఐక్య సంచాలకులు మల్లప్పగౌడ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 30 కి.మీ.ల దూరంలోని రాయచూరు లేదా దేవదుర్గకు వెళ్లి విద్యార్థులు పైచదువులు చదువుకోవాల్సి వస్తోందన్నారు. అందువల్ల గబ్బూరులోనే డిగ్రీ కళాశాలను ప్రారంభించాలని ఆయన కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు జోడించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలను ఏర్పాటు చేయాలని రాయచూరు రైల్వే శాఖ బోర్డు సలహా సమితి సభ్యులు చంద్రశేఖర్ అధికారులను కోరారు. గురువారం సాయంత్రం రైల్వే స్టేషన్‌లో అధికారులు అశోక్ కుమార్ మీనా, హేమరాజ్, సునీల్ కుమార్‌లను కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ముంబై-తిరుపతి, బెంగళూరు ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లకు అదనంగా రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలన్నారు. మండలి సభ్యులు మహేష్, రమేష్, సిద్దలింగయ్య, సీతా నాయక్, అపరాజుద్దీన్ ఉన్నారు.

మాల్‌లో రైతుకు అవమానంపై ధర్నా




ఆందోళన చేపట్టిన రైతు సంఘం కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: బెంగళూరులోని జీటీ మాల్‌లోకి రైతుకు ప్రవేశాన్ని నిరాకరించి అవమానించడంపై శుక్రవారం కురుగోడులో ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ సదరు మాల్‌లోకి హావేరి జిల్లాకు చెందిన నాగరాజు తమ తండ్రి ఫక్కీరప్పతో కలిసి వెళ్లడానికి ప్రయత్నించగా పంచె కట్టుకున్న వారిని లోపలికి వదలబోమని మాల్ సిబ్బంది అడ్డుకొని ప్రవేశ ద్వారంలోనే అర్ధగంట పాటు నిలిపివేయడం అమానుషం అన్నారు. ఇది అన్నదాత పట్ల మాల్ యజమానికి ఉన్న చిన్నచూపుకు నిదర్శనమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆందోళనలో జిల్లా కార్యదర్శి గుర్లి రాజ, కోళూరు పంపాపతి, కాశీంసాబ్, కల్లుకంబ పంపాపతి, హొన్నూరప్ప, విరుపాక్షప్ప, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన కృష్ణా, తుంగభద్ర వరద

- యథాతథంగా వస్తున్న లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ముంపు ప్రాంతాలకు ప్రమాద హెచ్చరిక జారీ



బాగల్‌కోటె జిల్లాలో కృష్ణా నదిపై నిర్మించిన ఆల్మట్టి డ్యాం నుంచి దిగువకు పారుతున్న నీరు

హొసపేటె: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లాల ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర డ్యాంకు శుక్రవారం కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాంకు ఎగువన శివమొగ్గ, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబె, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు వరద నీరు భారీగా పోటెత్తుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి 1,06,723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నీటిమట్టం 1618.03 అడుగులు, నీటినిల్వ 55.572 టీఎంసీలు, ఔట్‌ఫ్లో 404 క్యూసెక్కులుగా ఉందని మండలి అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికల్లా తుంగభద్ర డ్యాం పూర్తిగా నిండే అవకాశం ఉందని తెలిపారు. డ్యాంకు ఆశించిన మేరకు వరద చేరుతుండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎడమ కాలువకు నీరు విడుదల

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో బాగా వస్తున్న దృష్ట్యా కాలువలకు నీరందించే పనులను శుక్రవారం కొప్పళ లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ్, కాడా అధ్యక్షుడు హసన్‌సాబ్ దోతిహాళ్ ప్రారంభించారు. ప్రారంభంలో ఎడమగట్టు ప్రధాన కాల్వకు వంద క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేశారు. అనంతరం గంట గంటకు నీటి సామర్థ్యాన్ని పెంచుకొంటూ కర్ణాటక కోటా కింద సుమారు 4100 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్ మాట్లాడుతూ దేవుడి ఆశీస్సుల వల్లే మంచి వర్షాలు కురుస్తున్నాయన్నారు. అందుకే సాగునీటి సలహా సంఘం సమావేశం నిర్వహించకుండానే కాలువలకు నీటిని విడుదల చేశామన్నారు. నీటిని విడుదల చేయడంతో గంగావతి, కారటగి, సింధనూరు, మాన్వి, రాయచూరు ప్రాంతాలకు చెందిన అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రాంత రైతులు వరి సాగుకు కాలువ నీటిపైనే ఆధారపడుతున్నారన్నారు.

ఆల్మట్టి నుంచి దిగువకు 50 వేల క్యూసెక్కులు

రాయచూరు రూరల్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆల్మట్టి నుంచి 50 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. ఆల్మట్టి డ్యాంలో గరిష్ట నీటిమట్టం 519.60 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 518.84 మీటర్లకు చేరుకుంది. శుక్రవారం యాదగిరి జిల్లా హుణిసిగి తాలూకా నారాయణపుర జలాశయం నుంచి 43,150 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. మహారాష్ట్రలోని రాజాపూర్ డ్యాం నుంచి లక్ష క్యూసెక్కులు, దూద్ గంగా నది నుంచి 30 క్యూసెక్కుల నీరు కృష్ణా నదికి వదిలారు. బెళగావి జిల్లా సవదత్తి సమీపంలోని నవీలు తీర్థ జలాశయం నుంచి 16 వేల క్యూసెక్కుల నీరు, మలప్రభ నుంచి 25 వేల కూస్యెక్కుల నీరు దిగువకు వదిలారు. ఈనేపథ్యంలో బాగల్‌కోటె, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లాల అధికార యంత్రాంగం లోతట్టు, ముంపు ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేసి అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.









నిండుకుండలా తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం, నీటిని విడుదల చేస్తున్న ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్ తదితరులు, ఎడమ కాలువకు నీరు వదిలిన దృశ్యం, యాదగిరి జిల్లాలో గురుహుణిసిగి బ్యారేజీలో చేరిన నీరు

నేడు ఇన్‌చార్జి మంత్రి పర్యటన

హుబ్లీ: రాష్ట్ర కార్మిక, ధార్వాడ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సంతోష్‌లాడ్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 5.30 గంటలకు మంత్రి బెంగళూరు నుంచి హుబ్లీకి చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు కేఎంసీ ఆస్పత్రిలో పాలక వర్గం సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు హుబ్లీ ధార్వాడ నగర పాలక సంస్థ మీటింగ్ హాల్‌లో జరిగే కార్పొరేషన్ ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఆ రోజు రాత్రి 7.30 గంటలకు విమానం ద్వారా హుబ్లీ నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళతారని మంత్రి ఆప్త కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు.

ఎయిమ్స్ ఏర్పాటుపై ప్రధానితో చర్చిస్తా



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాయచూరులో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా చూస్తామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీలోని కావేరి భవన్‌లో తనను కలిసిన ఆందోళన సమితి అధ్యక్షుడు బసవరాజ కళసతో మంత్రి మాట్లాడుతూ ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామన్నారు. కళ్యాణ కర్ణాటక ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంలో మౌనం వహించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గళం విప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

మొహర్రం వేడుకలో అపశ్రుతి

- ఒరిగిపోయిన రేకుల షెడ్డు సజ్జా
- కింద పడి 28 మందికి గాయాలు



రేకుల షెడ్డు సజ్జా ఒరిగిపోయి భక్తులు పైనుంచి కిందకు జారిపడుతున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలోని కౌల్‌బజార్ సమీపంలో అలదహళ్లిలో వెలసిన పీర్లదేవుళ్ల మొహర్రం వేడుకలను ముగించుకొని కౌల్‌బజార్ మీదుగా గుగ్గరహట్టి దారిలో ఈద్గా సమీపంలో ప్రతి ఏటా మాదిరిగానే పీర్లదేవుళ్ల ఊరేగింపునకు వచ్చిన సమయంలో భక్తులు విశేషంగా వేలాదిగా తరలివచ్చి ఆ ప్రాంతంలోని రేకుల షెడ్డుపైకి 40 మందికి పైగా చేరడంతో బరువు ఎక్కువై షెడ్డు ముందు భాగం సజ్జా ఒరిగి పోయి భక్తులంతా ఒక్కసారిగా కిందపడ్డారు. ఈ ప్రమాదంలో 28 మందికి గాయాలు కాగా కింద ఉన్న ఓ వృద్ధురాలి మీద పడటంతో ఆమె కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. విమ్స్ ఆస్పత్రికి 28 మందిని తరలించగా చికిత్స పొందుతూ కోలుకున్నారు. సలీంబీ, ఫాతిమా బీ అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. అలదహళ్లిలో ఏర్పాటు చేసిన సర్దార్ హుస్సేన్ పీరా పీర్లదేవుళ్లను నిమజ్జనానికి తరలిస్తూ ఊరేగింపుగా వస్తుండగా జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఊరేగింపును తిలకించేందుకు రేకుల షెడ్డుపైకి ఎక్కువ మంది ఎక్కడంతో భక్తుల సంఖ్య పెరగడం వల్ల భారాన్ని తట్టుకోలేక షెడ్డు ముందు భాగం సజ్జా ఒరిగి పోయి ఒక్క సారిగా అక్కడున్న వారు కిందపడిపోయారు. వెనుక ఉన్న మరికొందరు భయంతో కిందకు దిగారు. అప్పటికే కింద ఉన్న బండ్లకు, రేకుల షెడ్లకు కోసుకొన్న గాయాలతో క్షతగాత్రులు విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకరిపై మరొకరు పడి తొక్కిసలాట జరిగి మరి కొంత మందికి గాయాలైనట్లు తెలిసింది. ఈ ఘటనపై కౌల్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డెంగీపై జనజాగృతికి శ్రీకారం



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో డెంగీ వ్యాధి నియంత్రణకు జనజాగృతి అవసరమని అసిస్టెంట్ కమిషనర్ మెహబూబి పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేసి ఆమె మాట్లాడారు. నగర ప్రాంతాల్లో మురుగు కాలువల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ వర్మ, సరోజ, సంధ్యా ఉన్నారు. అదే మాదిరిగా వివిధ ప్రాంతాల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖాధికారులు కరపత్రాలను పంచి ముమ్మర ప్రచారం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి



మృతుడు ఏఎస్ఐ రామన్న(ఫైల్)

సాక్షి, బళ్లారి: కొప్పళ జిల్లా మునిరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామన్న(55) గురువారం అర్ధరాత్రి సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విజయపుర జాతీయ రహదారి-50లో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పరారవడంతో ఆయన ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనపై అక్కడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్, వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రెండు నెలలుగా గృహలక్ష్మికి గ్రహణం

- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు
- ఐదు గ్యారెంటీలతో క-కలో ఐదు చోట్ల కాంగ్రెస్ విజయం



బ్యాంకు వద్ద పడిగాపులు పడుతున్న మహిళలు

రాయచూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన ఐదు గ్యారెంటీలతో కళ్యాణ కర్ణాటక(క-క)లో లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో విజయం సాధించినా రెండు నెలలుగా గృహలక్ష్మి పథకం డబ్బులు పడకపోవడంతో మహిళలు బ్యాంకుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో పార్టీ విజయం సాధించినా పంచ గ్యారెంటీల్లోని గృహలక్ష్మి పథకం కింద నెలకు రూ.2 వేలు వేసే పథకం నిర్వీర్యం అవుతోందని మహిళలు వాపోతున్నారు. రాయచూరు జిల్లాలో 6.23 లక్షలు, యాదగిరి జిల్లాలో 2.87 లక్షలు, కొప్పళ జిల్లాలో 3.57 లక్షలు, బీదర్ జిల్లాలో 7.68 లక్షల మంది మహిళలు లబ్ధిదారులుగా నమోదయ్యారు. మే నెల వరకు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ.2 వేల నగదు పడింది. ఎన్నికలు ముగిసి రెండు నెలలు గడిచి పోతున్నా తమ బ్యాంకు ఖాతాల్లోకి గృహలక్ష్మి డబ్బులు పడకపోవడంపై మహిళలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ మరో రెండు నెలల పాటు గృహలక్ష్మి డబ్బులు వేయడం కష్టమని చెప్పడంతో నారీమణులు పలు ఇబ్బందులకు లోనవుతున్నారు.

రోడ్డు మరమ్మతు కోసం ధర్నా

హుబ్లీ: జిల్లాలోని కుందగోళ తాలూకా చాకలబ్బి గ్రామంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు చాకలబ్బి నుంచి కొకనకురహట్టి మార్గం మధ్యలో రోడ్డు బాగు చేసి తమ ఊరికి బస్సు సర్వీసులను ప్రారంభించాలని ప్రజాపనుల శాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పుస్తకాలను పట్టుకొని సదరు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ చాకలబ్బికి హుబ్లీ డిపో నుంచి ఒకే బస్సు సర్వీసు ఉంది. ఈ బస్సులో 200 మందికి పైగా ఎక్కడం వల్ల సదరు బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారని డ్రైవర్, కండక్టర్ ఆ బస్సును ఆ గ్రామంలోనే నిలిపి వేశారు. దీంతో విద్యార్థులు సంబంధిత బస్సు డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. మేనేజర్ ఆ రోడ్డు బాగుపరిస్తేనే బస్సులు నడుపుతామని సమాధానం ఇచ్చారు. అంతేగాక నవలగుంద నుంచి వచ్చే బస్సును మీ ఊరికి పంపిస్తానని కూడా ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో ఆక్రోశించిన విద్యార్థులు కుందగోళ పీడబ్ల్యూడీ శాఖ కార్యాలయానికి ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్లి రోడ్డు బాగుపరచండి అంటూ డిమాండ్ చేశారు. అంతేగాక ఘటన స్థలానికి సదరు గ్రామ పంచాయతీ సభ్యులు ముత్తప్ప కటిగి తదితరులు విచ్చేసి విద్యార్థులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ శాఖ ఏఈ సుధాకర్ బాగేవాడి మాట్లాడుతూ చాకలబ్బి కొంకనకురహట్టి రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయి కానీ సాంకేతిక లోపం వల్ల జాప్యం జరిగిందన్నారు. ఒకటి, రెండు నెలల్లో మరమ్మతు చేస్తామన్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా గరుసుమట్టి వేసి రోడ్డు మరమ్మత్తు చేస్తామన్నారు. సదరు బస్సు డిపో అధికారులతో మాట్లాడి బస్సు నడిపేలా ఏర్పాట్లు చేశారు.

కేసు నమోదు చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలోని దర్వేసి కంపెనీ యజమానిపై కేసు నమోదు చేయాలని అంబేడ్కర్ సేన డిమాండ్ చేసింది. శుక్రవారం కంపెనీ వద్ద చేపట్టిన ఆందోళనసుద్దేశించి అధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీల్లో ప్రజల నుంచి రూ.100కు 12 నుంచి 15 శాతం వడ్డీ చెల్లిస్తామంటూ కోట్లాది రూపాయలను దండుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నేడు ప్రజల డబ్బుకు జవాబుదారీ లేరని, పెట్టుబడి పెట్టిన ప్రజలు ఇబ్బందుల్లో పడ్డారన్నారు. కంపెనీ యజమాని మహ్మద్ హసేన్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రిజర్వేషన్ల బదులు నైపుణ్యం పెంచాలి

హుబ్లీ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రైవేట్ పరిశ్రమల్లో కన్నడిగులకు నూరు శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఆందోళనకరమని, ఇది పరిశ్రమల ఎదుగుదలకు విఘాతకరమని ప్రముఖ పారిశ్రామికవేత్త, స్వర్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీల అధినేత డాక్టర్ సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే పలు పరిశ్రమలు తమ సీ, డీ కేటగిరి ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశం కల్పించారన్నారు. బయట రాష్ట్రాల వారిని తీసుకురావడం పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా భారం అవుతుందన్నారు. దీంతో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆర్థిక బలోపేతానికి పరిశ్రమలు కృషి చేశాయన్నారు. అయితే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగి ఉండటం చాలా అవసరం అన్నారు. పరిస్థితులు ఇలా ఉంటే ప్రైవేట్ పరిశ్రమల్లో సీ, డీ కేటగిరి ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం తేవడం పరిశ్రమల ఎదుగుదల దృష్ట్యా మంచిది కాదన్నారు. ఇది పరిశ్రమలకు చేటు కలిగిస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు స్థానికంగా లభిస్తే రిజర్వేషన్ల అవసరమే ఉండదన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వ భాగస్వామ్య సంస్థల్లో అమలు చేయడం సాధ్యమా? అని ఆయన ప్రశ్నించారు. సదరు చట్టం అమలుకు ముందు వాటి సాధక బాధకాలను పారిశ్రామికవేత్తలతో చర్చించి ఆ చట్టాన్ని జారీకి తేవాలని, ముఖ్యంగా రిజర్వేషన్లను కేటాయించే బదులుగా ప్రజల్లో నైపుణ్య పెంచే సంకల్పం కార్యరూపంలోకి తేవాలని ఆయన కోరారు.

21న హడపద అప్పణ్ణ జయంతి

హుబ్లీ: వీరశైవ వధూవరుల సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ ఆదివారం హడపద అప్పణ్ణ జయంతి, ఉచిత వధూవరుల వివరాల నమోదు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సదరు సమాజ బాంధవులు కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లోను నివసిస్తున్నారు. వధూవరుల అన్వేషణలో ఉన్న తమ సమాజ బాంధవుల కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9538011434 నంబరుకు ఫోన్ చేయాలని నిర్వాహకులు కోరారు.

డెంగీ పరీక్షల ధరలను ప్రదర్శించాలి

హుబ్లీ: డెంగీ జ్వరాన్ని పరీక్షించే ఎలిషా, ర్యాపిడ్ టెస్ట్‌ల ధరలను నిర్ణయించి ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు ప్రజలకు కనిపించేలా ధరల పట్టికను ప్రదర్శించాలని జిల్లాధికారి దివ్యప్రభ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. వివిధ టెస్ట్‌లకు ధరలను నిర్ణయించి ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు వెల్లడించిందన్నారు. ఆ ప్రకారమే ధరలను వసూలు చేయాలన్నారు. నిర్దిష్ట ధరకన్నా ఎక్కువ వసూలు చేస్తే అలాంటి ఆస్పత్రుల లైసెన్సులను రద్దు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల బాగు కోసం డెంగీ జ్వరం నిర్ధారణకు ఎక్కువ ధరలను సవరించి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, టెస్టింగ్ ల్యాబ్‌లకు డెంగీ జ్వర నిర్ధారణకు నిర్వహించే డెంగీ ఎలిషా ఎన్‌ఎస్‌కు రూ.300, డెంగీ ఎలిషా ఐజీఎంకు రూ.300, ర్యాపిడ్ కార్డు టెస్ట్‌కు రూ.250 చొప్పున ధరలను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ ఈ ఆదేశాలను ఉల్లంఘించకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రులకు, ప్రయోగశాలలకు నిరంతరం వెళ్లి పరిశీలించాలని ఆమె ఆ ప్రకటనలో సూచించారు.

ప్రభుత్వ ఆస్తుల సర్వేపై సమీక్ష



పరిశీలిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలో జిల్లాధికారి దివాకర్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి రెవెన్యూ అధికారులతో కలిసి ప్రభుత్వ ఆస్తుల సర్వేను సమీక్షించారు. విజయనగర జిల్లాలో మొత్తం 62,737 ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయి. వీటిలో 56,806 ప్రభుత్వ ఆస్తులకు ఇప్పటికే రెవెన్యూ అధికారులు కొత్తగా రూపొందించిన ల్యాండ్ బీట్ దరఖాస్తులో సర్వే చేసి ఫోటోలతో కూడిన సమాచారాన్ని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. హగరిబొమ్మనహళ్లి తాలూకాలో పెండింగ్‌లో ఉన్న ఆస్తుల సర్వేను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులపై సంబంధిత అధికారులు నిరంతరంగా సర్వేలు నిర్వహించాలన్నారు. స్థలాల కబ్జా, అనధికార భవనాల నిర్మాణాలను గుర్తించాలన్నారు.

వృద్ధాప్యంలోనూ గొప్ప సంకల్పం

- సైకిల్‌పై దేశవ్యాప్త పర్యటన
- డ్రగ్స్, మద్యపానం నుంచి యువతను కాపాడటమే ధ్యేయం
- 2008 నుంచి కొనసాగుతున్న యాత్ర



సైకిల్ యాత్రలో అమన్ దీప్ సింగ్

మాలూరు : వృద్ధాప్యం మీద పడినా ఆయన జనజాగృతికి నడుం బిగించాడు. మాదకద్రవ్యాల బారిన పడి చెడుదారి పట్టిన యువతలో మార్పు తెచ్చేందుకు సైకిల్‌పై దేశవ్యాప్తంగా సంచరిస్తున్నాడు. తాలూకాలోని జగదేణహళ్లి గ్రామానికి మాధవరెడ్డి 10వ తరగతి చదివిన తరువాత ఇంటి నుంచి వెళ్లిపోయి పంజాబ్‌లోని జలంధర్‌కు చేరుకున్నాడు. గురుచరణ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించాడు. తన పేరును అమన్‌దీప్ సింగ్ అని మార్చుకున్నాడు. పాటియాలాలో డిగ్రీ చదివిన అనంతరం ఇంటి యజమాని తన కుమార్తె మన్‌ప్రీత్ సింగ్‌ను ఇచ్చి వివాహం చేశాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శర్వణ్ సింగ్ అమెరికాలో వైద్య వృత్తిలో ఉన్నాడు.

ఇది ప్రేరణ...

మద్యపానం వల్ల తన బంధువు మృతి చెందడంతో విచలితుడైన అమన్‌దీప్ సింగ్ సైకిల్ యాత్రతో దీనిపై ప్రజలను జాగృతం చేయాలని నిర్ణయించాడు. 64 సంవత్సరాల వయస్సులో 2008 జనవరి 1వ తేదీ నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించి 16 సంవత్సరాల పాటు నిరంతరంగా కొనసాగిస్తున్నాడు. ఇతను ఇప్పటికే 25 రాష్ట్రాల్లో పర్యటించాడు. అమన్ దీప్ సింగ్ తనతో పాటు వంట సామగ్రి, ల్యాప్‌టాప్, కెమెరా, ఫైళ్లు ఉంచుకున్నాడు. మార్గ మధ్యంలో పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులను జాగృతం చేస్తూ వెళుతున్నాడు.

3లక్షల కిలోమీటర్ల ప్రయాణం

అమన్‌దీప్ సింగ్ మట్లాడుతూ ఇప్పటికే దేశ వ్యాప్తంగా 3 లక్షల కిలోమీటర్ల దూరం సంచరించినట్లు తెలిపారు. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు కలిసి లక్ష డాలర్లు ఇచ్చారన్నారు. ఈ డబ్బుతో పంజాబ్‌లోని తన స్వగ్రామం కెరాలో విద్యార్థుల కోసం పాఠశాలను ప్రారంభిస్తానని తెలిపాడు. ఇంతవరకు 8 వేల మందిని మద్యపానం నుంచి విముక్తి చేసినట్లు అమన్‌దీప్ సింగ్ తెలిపాడు.

వంతెన కింద వాన నీరు.. వాహనదారుల బేజారు



నగరంలో రహదారిపై ప్రవహిస్తున్న వాన నీరు



మోకాలి లోతు నీటిలో ద్విచక్రవాహనాన్ని మోసుకెళుతున్న వ్యక్తి

రాయచూరు రూరల్: గత రెండు రోజుల నుంచి జడివాన కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం నగరంలోని అరబ్ మొహల్లా వద్ద రైల్వే వంతెన కింద వాన నీరు నిల్వ చేరాయి. దీంతో మన్సలాపుర, యక్లాసపుర, మర్చేడ్, హొసపేటె తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం మన్సలాపుర నుంచి ద్విచక్ర వాహనంలో పాలు విక్రయించడానికి వచ్చిన వ్యక్తి వాహనం నీటిలో తడవకుండా ఉండడానికి మోసుకొని రావడం కనిపించింది. రైల్వే అండర్ పాస్‌లో నీరు నిలబడుతున్న విషయంపై లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్, దక్షిణ మధ్య రైల్వే మండలి సలహా సమితి సభ్యులు ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.